UNIVERSAL LIBRARY
OU_204041
UNIVERSAL LIBRARY

OSMANIA UNIVERSITY LIBRARY

Call No. T 923 V44G

Acc.No. T 4201

వెంకటసుబ్బారావు. గ

గోపాలకృష్ణయ్య

# సంగీతరత్న
# గోపాలకృష్ణయ్య

★


బ్రహ్మశ్రీ
గుమ్మిడిదల వెంకటసుబ్బారావు.


★


**M. S. R. MURTY & Co.,**
PUBLISHERS & BOOK-SELLERS
VISAKHAPATNAM.


Copy Right] 1954 [Rs. 1—0—0

# విషయసూచిక


1. పుట్టు పూర్వోత్తరములు.
2. విద్యాభ్యాసము.
3. ఇంగ్లాండు పయనము.
4. ఉద్యోగము.
5. సంధిగ్ధస్థితి.
6. మహానంది మహాసభ.
7. జాతీయవిద్య.
8. విద్యాపీఠగోష్ఠి.
9. చీరాల పేరాల.
10. శ్రీరామదండు.
11. రాజకీయములు.
12. బరంపురం సందేశములు.
13. జైలు విమోచనము—ధర్మప్రబోధము.
14. బందరు ఉపన్యాసము.
15. బార్డోలీ ఉపసంహారము.
16. గోపాలకృష్ణుని మతము.
17. కాంగ్రెసు రాజకీయములు.
18. చరమదశ దైవమార్గము.
19. గోపాలకృష్ణుని భావములు.
20. తననుగూర్చి.

# తొలినుడి

నేను 1934 లోనే "ఆంధ్రరత్న జీవితసందేశము"ను నొక గ్రంథమును ఆంగ్లభాషలో ప్రచురించితిని. M. S. R. మూర్తి కంపెనీవారు రెండేండ్లక్రిందట నాగ్రంథమును సంగ్రహరూపముగ ప్రచురించిరి. గత సాలున ఆంధ్రాయూనివర్సిటీవారా పొత్తము తమ మెట్రిక్యులేషన్ విద్యార్థులకు పాఠ్యగ్రంథముగ నామోదించిరి. ఈ ప్రోత్సాహమునుబట్టియు, అందలి యనుభవము వల్లను, యిప్పుడా ఆంధ్రరత్న జీవితచరిత్రనే హైస్కూల్ విద్యార్థుల కనువగు రీతిగ కొన్ని ముఖ్యమార్పులతో ఆంధ్రమున ప్రచురింపవలెనని శ్రీ మూర్తి కంపెనీవారు సంకల్పించిరి.

ఆంధ్రరత్న గతించి యిప్పటికి యిరవైఆరు సంవత్సరములు పై దాటినది. ఇంతవరకు తెనుగులో "ఆంధ్రరత్న ప్రశంస" యను పేరిట నొక "లఘుచరిత్ర"ను మాత్రము నేను ప్రచురింపగలిగితిని. మన స్వభాషలో యీమాత్రము చరిత్రయైనను యింతవరకు ప్రచురింపకుండుట నిజముగ లోపమే. ఈ లోపమునకు గల కారణములతో మనకిప్పుడు పనిలేదు. శ్రీ మూర్తి కంపెనీవారి సహాయముతో నేటికీ లోపము తీర్పగలుగుట సంతోషము.

ఇటీవల నాంధ్రదేశమం దవతరించిన మహాపురుషులలో ఆంధ్రరత్న మొకడని నాయభిప్రాయము. రాజకీయ రంగ

# విషయసూచిక


| | | పేజీ |
|---|---|---|
| 1. | పుట్టు పూర్వోత్తరములు. | 1 |
| 2. | విద్యాభ్యాసము. | 6 |
| 3. | ఇంగ్లాండు పయనము. | 12 |
| 4. | ఉద్యోగము. | 19 |
| 5. | సంధిగ్ధస్థితి. | 24 |
| 6. | మహానంది మహాసభ. | 33 |
| 7. | జాతీయవిద్య. | 38 |
| 8. | విద్యాపీఠగోష్ఠి. | 47 |
| 9. | చీరాల పేరాల. | 54 |
| 10. | శ్రీరామదండు. | 63 |
| 11. | రాజకీయములు. | 70 |
| 12. | బరంపురం సందేశములు. | 74 |
| 13. | జైలు విమోచనము—ధర్మప్రబోధము. | 82 |
| 14. | బందరు ఉపన్యాసము. | 88 |
| 15. | బార్డోలీ ఉపసంహారము. | 94 |
| 16. | గోపాలకృష్ణుని మతము. | 100 |
| 17. | కాంగ్రెసు రాజకీయములు. | 108 |
| 18. | చరమదశ దైవమార్గము. | 116 |
| 19. | గోపాలకృష్ణుని భావములు. | 121 |
| 20. | తననుగూర్చి. | 130 |

# తొలి నుడి

నేను 1934 లోనే "ఆంధ్రరత్నజీవితసందేశము"ను నొక గ్రంథమును ఆంగ్లభాషలో ప్రచురించితి. M. S. R. మూర్తి కంపెనీవారు రెండేండ్లక్రిందట నాగ్రంథమును సంక్షిప్తరూపముగ బ్రచురించిరి. గతసాలున ఆంధ్రాయూనివర్సిటీవారా పొత్తమును తమ మెట్రిక్యులేషన్ విద్యార్థులకు పాఠ్యగ్రంథముగ నామోదించిరి. ఈ ప్రోత్సాహమునుబట్టియు, అందలి యనుభవము వల్లను, యిప్పుడా ఆంధ్రరత్న జీవితచరిత్రనే హైస్కూల్ విద్యార్థుల కనువగు రీతిగ కొన్ని ముఖ్యమార్పులతో ఆంధ్రమున బ్రచురింపవలెనని శ్రీ మూర్తి కంపెనీవారు సంకల్పించిరి.

ఆంధ్రరత్న గతించి యిప్పటికి యిరవైఆరు సంవత్సరములు పై దాటినది. ఇంతవరకు తెనుగులో "ఆంధ్రరత్న ప్రశంస" యను పేరిట నొక "లఘుచరిత్ర"ను మాత్రము నేను ప్రచురింపగలిగితిని. మన స్వభాషలో యీమాత్రము చరిత్రైనను యింతవరకు ప్రచురింపకుండుట నిజముగ లోపమే. ఈ లోపమునకు గల కారణములతో మనకిప్పుడు పనిలేదు. శ్రీ మూర్తి కంపెనీవారి సహాయముతో నేటికీ లోపము తీర్పగలుగుట సంతోషము.

ఇటీవల నాంధ్రదేశమం దవతరించిన మహాపురుషులలో ఆంధ్రరత్న మొకడని నాయభిప్రాయము. రాజకీయ రంగ

ములో దుగ్గిరాల గోపాలకృష్ణుడు, అల్లూరి సీతారామరాజు, పొట్టి శ్రీరాములును గన్న యాంధ్రావని ధన్యురాలు. మువ్వు రును మూడు రకముల వీరపురుషులు. ఒకరిది కాంగ్రెస్ పంథా — రెండవవానిది క్షేత్రమార్గము — మూడవవాడు "గాంధిని మించిన శిష్యుడు" వీరి నుచితరీతి పఠించి, గౌరవిం చుట ఆంధ్రబాలుర ధర్మము. ఇందుకై తగు ప్రోత్సాహము నొసంగుట మన విద్యాధికారులయొక్కయు కర్తవ్యము.

ఈ గ్రంథము యొక్క చిత్తుప్రతులను సరిచూచుటలో నాకు తోడ్పడిన నామిత్రులు శ్రీహరి వెంకటేశ్వర్లు గారికి నేను కృతజ్ఞుడను.

గోష్ఠి, అమలాపురము, }
1—10—1954. }
గుమ్మడిదల వెంకటసుబ్బారావు.

శ్రీ

# ఆంధ్రరత్న గోపాలకృష్ణయ్య

## 1. పుట్టుపూర్వోత్తరములు.

శ్రీ ఆంధ్రరత్న గోపాలకృష్ణుడు - ఇంటిపేరు దుగ్గిరాల వారు - అభినవ రామదాస బిరుదాంకితుడు - వెలనాటి వైదీకి - హరితసగోత్రము హారితస, అంబరీష, యవ్వనాశ్వ, త్రయార్షేయ ఋషులు - తండ్రిపేరు కోదండరామస్వామి - తల్లిపేరు సీతమ్మ - నిజముగ శ్రీ సీతారాముల పూజాఫలమే కాబోలు, మన కథా నాయకుడు!

గోపాలకృష్ణుడు 2-6-1889 తేదీకి సరియగు విరోధి సం॥ జ్యేష్ఠ శుద్ధ ౪ న కృష్ణాజిల్లా, నందిగామ తాలూకా, పెనుగంచిప్రోలులో జన్మించెను. అతని పితృస్థానము గుంటూరుజిల్లా, రేపల్లెతాలూకా, కూచినపూడి. అభిమాన విద్యాస్థలములు గుంటూరు, బాపట్లలు. కుటుంబస్థితి సాధారణము. తలిదండ్రుల కీతడొక్కడే శిశువు. పుట్టిన మూడవరోజుననే తల్లి గతించెను. అతని మూడవయేట తండ్రి స్వర్గస్థుడయ్యెను. అందుచే పినతండ్రి శివరామయ్యయు, ముత్తవయు ఆ బాలునికి సంరక్షకులైరి. 1922లో ముత్తవయు, 1940 లో పినతండ్రియు దివంగతులైరి.

గోపాలకృష్ణుని బాల్యమంతయు కూచినపూడి, గుంటూరులలో జరిగెను. 1906 వరకు యాతడు గుంటూరునందే విద్యాభ్యాస మొనర్చెను. చదువన్న యాతనికి శ్రద్ధతక్కువయనుడు-

లేక ఆనాటి "అప్రాచ్యవిద్య" యాతనికి చిన్ననాటనే యేవగింపనుడు – పరీక్షలు సీతాకాలపు పంట–ఆట పాటలు, అల్లరి, దేశాటనము, నాటకములందు కలిగిన శ్రద్ధచే పెద్దరికమున తానే "గోలకృష్ణుడ" నని చెప్పుకొనెను.

గోపాలకృష్ణునికి తొమ్మిదవయేట, అనగా 1898 లో ఉపనయన సంస్కారణ మొనర్పబడెను. ఆతనికి బ్రహ్మోపదేశ మొసంగినది శ్రీ భారతుల మృత్యుంజయ అవధానులుగారు. ఉపనయనము భారతీయులలో ఏకజులగువారికి ద్విజత్వము నొసగు సంస్కారము. ఉపనయన సమయమందే మనస్సునకుత్తేజకరమగు గాయత్రీ మంత్రి ముపదేశింపబడును. సనాతన మార్గానుసరణముగ సృష్ట్యాది నాల్గుయుగములలో కృతయుగమున శృతి లేక వేదమే ప్రధానమనియు; త్రేతాయుగమందు ధర్మము స్మృతులపై నాధారపడుననియు; ద్వాపరమున పురాణేతిహాసము లనుసరణీయములనియు; కలిలో మంత్రశక్తి యే శరణ్యమనియు పెద్దలు చెప్పుదురు. ఈప్రపంచమందలి ద్విశతకోటి మానవులకును శతసహస్రకోటి మంత్రము లున్నవట! అట్టి మంత్రరాజము లన్నింటిలో మిన్న యీ గాయత్రిమంత్రము. "నగాయత్ర్యాః పరం మంత్రం"—అనగా గాయత్రికిమించిన మంత్రము లేదని మహాఋషులవాక్కు. అట్టి మంత్రోపదేశము నొసంగు ఉపనయనమే మన నిజ "జాతీయ విద్యాభ్యాసన"నని గోపాలకృష్ణుడ నెడివాడు తాను పెద్దవాడై, భారతజాతీయతా

సంస్కరణకు పూనుకొని "అందఱను బ్రాహ్మణుల జేయవలె" నని యాతడు సంకల్పించిన రోజులలో "అందఱను యజ్ఞోపవీత ధారణచే బునీతుల జేయుదును"; "గాయత్రీ మహిమచే నే నెల్ల ఱను ద్విజులుగ నొనర్తును" "నేను గాయత్రిని బడసితిని; ఆమంత్ర రాజమును నే నెల్లఱకు నొసంగెదను"; అని చాటుచు, భారత జాతికి నిజమగు సంఘైక్యత, మతైక్యత, చేకూరనిచో స్వరా జ్యము సిద్ధించుట దుర్లభమని, యాతడు చెప్పెను. అట్టి బ్రహ్మ వేత్తకు బ్రహ్మోపదేశ మొనర్చిన ఋత్విక్కుడు "భారతుల" వంశీయుడగుటయు, "మృత్యుంజయు" డగుటయు యెంతయు సమంజసముగ నున్నది.

గోపాలకృష్ణునకు 1903 లో వివాహము య్యెను. అతని యత్తవారును కూచినపూడి వాస్తవ్యులే. ఆతని యర్థాంగిపేరు శ్రీ దుర్గాభవానమ్మ. వీరి యేకైక పుత్రరత్నము చిరంజీవి రామచంద్రమూర్తియే!

గోపాలకృష్ణుని బాల్యముగూర్చి వ్రాయునపు డాతని ముత్తవగూర్చి ప్రత్యేకముగ దెల్పుట యవసరము.

ఆంధ్రరత్న మిత్రసత్తముడును, యువకవి, రసికాగ్రేసరు డగు కీ. శే. బసవరాజు వెంకటఅప్పారావుగారు తన "ఆంధ్రరత్న ద్యుతు"లను వ్యాసరాజమున ఆమెనుగూర్చి యిట్లు నుడివెను. "గోపాలకృష్ణుని పితామహిని జూచు నవకాశము నాకు గొలది కాలము క్రిందటనే లభించినది. ఆమె యిప్పటికిని గోపాల

కృష్ణునియెడల నపరిమితవాత్సల్యముగలదై యతడే లోకముగా, నతడే ప్రాణముగ, నతడే నామమంత్రముగ నెంచి ప్రేమించుచు, నెల్లప్పుడు నాతని నామమునే స్మరించుచు జీవయాత్రసాగించు చున్నది. అతడూరికిజని తిరిగివచ్చుట కాలసించినయెడల నామె వీధియరుగుపై మంచమువైచుకొని వీవనచే గ్రీష్మతాప మపన యించుకొనుచు, వీధినిబోవువారి నెల్లరను 'నాయనా! మా గోపాలకృష్ణుడు గాన్పించినాడా? మా గోపాలకృష్ణుడెప్పుడు వచ్చును? అయ్యయో! అతడింకను రాకున్నాడే! నాకేమి యు బాలుపోకున్నది. నేనెప్పుడు నాతనివీడి యుండినదాననుగాను. మీకు గాన్పించె నేని యాతని శీఘ్రముగ రమ్మనుడీ!' యని ప్రార్థించుచుండెడిది. ఆమెయే యతనికి సంగీతసాహిత్యములందు బ్రవేశము గల్పించెనని గోపాలకృష్ణుడు నాతో చెప్పుచుండెడి వాడు. వింత వింత కథలను, విచిత్రపురాణగాథలను, ఆమె నిత్యము నాతనికి జెప్పుచుండెడినట. చక్కని పాటలను, అధ్యా త్మ రామాయణకీర్తనలను, తరంగములను, ఆమె యతనికి వినిపించుచు సంగీతమున నాతని కమితాభిరుచిని గల్పించుచుం డెను. అట్టి యభిరుచి పెంపొందిన కారణమున నతడు సంగీతము బాగుగ నేర్చుకొని గుంటూరుపురమందలి యువజన నాటక సంఘములో సభ్యుడై తన గానపటిమచే ప్రేక్షకులకెల్లరకు నమందానందమునుగూర్చుచుండెను. ప్రసన్నయాదవ నాటకము నను, గయోపాఖ్యానమందును యాతడు శ్రీకృష్ణ పాత్రను

ధరించి తన సంగీత నైపుణ్యమున సభ్యులనానందింపజేసి తన సాహిత్యవైశారద్యమువలన రసపోషణము గావించిన విధము నేటికిని నాకన్నులగట్టినట్లే యున్నది. నాటకాభిమానులెల్లరును గోపాలకృష్ణుని వేషమును జూచుటకై వందలకొలదిగ వచ్చు చుండెడివారు.

1922 లో గోపాలకృష్ణుడు కారాగారమునయున్న సమయమందు తన ముత్తవగూర్చి యిట్లు వ్రాసుకొనెను. "నా పితామహి నాకమితప్రియమైనది. ఆమె నావియోగముచే యిప్పటికే గతించియుండునని తలచెద. నా పినతండ్రి యాపె ఇంకను సజీవయే యని వ్రాయుచున్నాడు. కాని అతనిమాటపై నాకు నమ్మకములేదు. ఆపె మరణవార్త నాకు తెలుపకుండుటకే యాతడటుల వ్రాసియుండును. ఆమె యింకను బ్రతికియున్నదని నే ననుకోను. పాపము! ఆమె గతించుటయే మేలు! ఆమె యింకను జీవించినను యేమిలాభము? ఆమె నాకొఱకే జీవించెను. నే నామె ప్రక్కనున్న నే ఆమెకు సంతోషము-స్వరాజ్యాన్వేషినై నే నామె ప్రక్కనుండుట యిక దుస్సాధ్యము. స్వరాజ్యము సిద్ధించువరకు నేను పునః పునః కారాగారమున కేగుచుండవలసినదే! ఒక ముదుసలి ప్రాణముల రక్షించుటకై బ్రిటిష్‌వారు మనకింతలో స్వరాజ్యమును బ్రసాదింతురా? వారట్టి అమాయకులు కారు. శ్రీరామచంద్రుడొక్కడే అట్టి తెలివితక్కువపని గావించెను. ఒక రజకుని మాటవిని యాతడు

తన రాణినే అడవులకు బంపివేసెను. ఆతడంతటి అమాయకుడే! కాని బ్రిటిష్‌ప్రభువులు మేటిదిట్టలు-ఇట్టి సలహా వారికి హాస్యాస్పదమనిపించును! నేను లేనిచో మా ముత్తవ జీవితమిక దుర్భరమే."

కాని యామె 1922 అక్టోబరులో గోపాలకృష్ణుడు కారాగారమునుండి విముక్తుడగువరకు మరణించలేదు. ఆతడిల్లుజేరిన పిదప రెండువారముల కామె దివంగతురాలైనది.

## 2. విద్యాభ్యాసము.

గోపాలకృష్ణుని ప్రాథమిక విద్యాభ్యాసము గుంటూరునందే జరిగెననియు, కాని యాతనికి చదువన్న శ్రద్ధతక్కువనియు మనము వెనుకటి అధ్యాయమందు జదివితిమి. అయినను యెటులనో మెట్రిక్యులేషన్ పరీక్షవరకు ఆతడు బండిని నెట్టుకొని వచ్చెను. కాని ఆ పరీక్షయందాతడు తీర్ణుడు కాజాలకపోయెను.

ఆతని పినతండ్రి గుంటూరులోనైనచో సాంగత్యదోషముచే గోపాలకృష్ణుని చదువు కుంటుబడిపోవుచున్నదని గ్రహించి 1906 లో యాతని బాపట్ల హైస్కూలులో బ్రవేశపెట్టెను. క్రమముగ నాతడాయేడు పరీక్షలో నుత్తీర్ణుడయ్యెను కాని, అక్కడకూడ "జాతీయనాట్యమండలి" నొకదానిని స్థాపించి, పౌరులలో రాజకీయ విద్యాపరిబోధమునకై "జాతీయనిధి"ని నెలకొల్పి, కొన్ని త్తమిత్రులను జేరదీసెను. పరీక్షానంతర మచ్చటనే తాలూకా కచ్చేరీలో యాతడొక గుమాస్తాగా జేరెను.

కాని అచిర కాలముననే "ఈ ప్రభుత్వములో గులాంపనిచేయుట కంటె వీధులలో తిరిపమెత్తి జీవించుట మేలు" అని తన పినతండ్రి పేర వ్రాయుచు, గోపాలకృష్ణుడా యుద్యోగమునుండి విరమించుకొని ఉన్నతవిద్యాభ్యాసమునకై గుంటూరు తిరిగి చేరుకొనెను.

బడిచదువు విషయమెట్లున్నను, పాటలు, పద్యములు, పురాణములు, నాటకేతిహాసముల ద్వారా గోపాలకృష్ణుడు విశేష లోకజ్ఞానము సంపాదించుకొనెను. కొండవీడు, అమరావతి మున్నగు చారిత్రక స్థలములకు మిత్రులతో గూడి యాత్రలు సాగించెను. ఆరోజులలో దేశమంతట విజృంభించిన వంగీయ "వందేమాతరము" ఆతని హృదయములో భారత స్వాతంత్ర్య బీజములను చక్కగ నాటెను. ఆరోజులలోని ఉద్యమ నాయకులగు శ్రీ అరవిందఘోష్, లోకమాన్య బాలగంగాధర తిలకుగారలు గోపాలకృష్ణునికి ఆరాధ్యపురుషులైరి. వారి యడుగు జాడలలో తానును ఇతర మిత్రులతోగలసి రాజకీయోపన్యాసములనిచ్చుచు, రాజకీయసభలకేగుచుండెడివాడు. ఆరోజులలోనే గుంటూరులో ఆరంభమైన ఆంధ్రోద్యమము గోపాలకృష్ణుని ఆకర్షించెను. అప్పటి ఆంధ్రనాయకులలో కీ. శే. జొన్నవిత్తుల గురునాథంగారిని గోపాలకృష్ణుడు చాల మెచ్చుకొనుచుండెడివాడు. ఈగురునాథముగారిదే ఆంధ్రోద్యమ మూలపీఠమని చెప్పవచ్చును. ఆనాటి ఆంధ్రుల దుస్థితిని గుర్తించి,

ఆంధ్రులకు ప్రత్యేకరాష్ట్రము లేనిదే మన ప్రజకు మోక్షము లేదని గుర్తించి అందుకొఱకు ఆంధ్రమహాజనసభను లేవదీసిన మహానీయుడీ గురునాధముగారు. తదుపరి గోపాలకృష్ణునివలెనే పాపము! ఆతడును యీ ప్రజాసేవలో పెక్కు యిడుములబడి తుట్టతుదకు పిన్నవయస్సుననే క్షయవ్యాధిచే మడసెను.

గోపాలకృష్ణుని జీవితమంతయు అనేక విచిత్రసంఘటనలతో కూడియుండెడిది. ఈసంఘటనలను జూచినచో లోగడ శ్రీకృష్ణభగవానునివలె యీతడొక లీలామానుషుడనిపించక మానదు. ఈతని బాల్యమునకు సంబంధించిన యిట్టిలీలలలో కొన్నింటి నిచ్చట నుదహరించుట యుక్తము.

చిన్ననాటనుండియు గోపాలకృష్ణునకు ధనము విచ్చలవిడిగ వ్యయపరచుటయు, అందుకు జమాఖర్చులు వ్రాయకుండుటయు అలవాటు. కాని యీతని విద్యార్థిదశలో పినతండ్రి శివరామయ్యగారు నెల నెలకును యీతనివద్ద జమాఖర్చులు కోరెడివాడట. గోపాలకృష్ణునికీ స్వల్పవిషయములన్నియు జ్ఞాపకమా? కాని యేదో ఒక లెక్క పంపనిచో తన పినతండ్రి ధనము బంపడే! కావున జ్ఞాపకమున్న ముఖ్యపద్దులుమాత్రము వ్రాసి, కొదువసొమ్మునకు "ఇంపోజిషన్"అని వ్రాసి పూర్తిచేసెడివాడట. శివరామయ్యకు ఆంగ్లభాషాపరిచయ మామాత్రముగ నుటచే మొదట అదెద్దియో గ్రంథమనుకొనెనట. కాని యీ "ఇంపోజిషన్" నెల నెలకు వచ్చుచుండెడిది. అందుపై ఆంగ్లము

తెలిసినవారికిఁజూపి దాని అర్థమును శివరామయ్య తెలుసుకొనెను. ఆ బాలుని యీ జమాఖర్చులు వ్రాయించుటయే "ఇంపోజిషన్"—ఒక బలాత్కారపు శిక్ష అని వారాతనికి నచ్చఁజెప్పిరి. అంతటనుండియు జమాఖర్చులు పోయినవి—వాటితో యీ "ఇంపోజిషను" కూడ అంతరించెను.

గోపాలకృష్ణుడు బాపట్లలో తాలూకా గుమాస్తాగా నున్నప్పటి ఇతిహాసమొకటి చెప్పెదను. ఒక యూరనొక ఆసామీ యుండెడివాడట. ఆతని పేరేదో వెంకటయ్య చౌదరి యనుకొందము. ఆయనకు స్వాతిశయము మెండు—అదొక దాక్షికపుతంతు. ఆయన ఆధిక్యతను నిరూపించుటకై తన సంతకము "వెంకటయ్య చౌదరిగారు" అని చేసెడివాడట. అందువల్ల యెల్లరును తనను "గారు" అని పిలచి, గౌరవించెదరని ఆతని ఆశయము.

ఒకానొక సమయమున యీ వెంకటయ్యచౌదరి తహసీల్దారుగారి కొక పిటిషన్ బంపుకొనెను. యథాప్రకారముగ అందాతడు "వెంకటయ్యచౌదరిగా"రని సంతకముచేసెను. ఆతనికి ప్రత్యుత్తరము బంపుచు మన గోపాలకృష్ణుడు "మహారాజశ్రీ వెంకటయ్యచౌదరిగారు గారికి" అని జాబువ్రాసిపంపెనట. ఇందుపై యీ ఛాందసు డాగ్రహాపూరితుడై, తన కవమానము జరిగెనని వచ్చి తహసీల్దారుగారితో పితూరిచేసెనట. అందుపై యీ వ్రాతకు కారకుడగు గోపాలకృష్ణుని బిలచి "ఏమయ్యా!

యీ చౌదరిగారినిట్లపమానపరచితివి?” అని తహసీల్దారుగారు ప్రశ్నించిరి. అందుపై గోపాలకృష్ణుడు తన సహజ హాస్యముతో “అయ్యా! పెద్దలను గౌరవించుట ప్రభుత్వోద్యోగుల విధులలో నొకటి. “గారు” శబ్దమట్టి గౌరవ సూచకము. ఈ చిహ్నమును ప్రతివారి పేరునకును జేర్చుట మన ఆచారము. అట్లు చేర్చుట యెన్నటికిని న్యూనతకానేరదు. చేర్చకుండుటయే అగౌరవము. వీరు తన సంతకమునే “అయ్యంగార”ను రీతిని “వెంకటయ్య చౌదరిగార”ని వ్రాసుకొనెను. అది యాతని పేరుగ నేను భావించి వారి చిరునామాలో ‘గారు’ పదమును జేర్చి వారిని గౌరవించితిని. ఇందు నాతప్పేమున్నద”ని నుడివెనట. అచ్చటివారందరును పక్కున నవ్విరి. అంతటినుండి ఆ చౌదరి తన వ్రాలులో “గారు” పదమును ప్రయోగించలేదనియు చెప్పుదురు.

ఆనాటి గోపాలకృష్ణ యుదంతములలో నింకొక్కటి మరింత రసవంతమైనది. ఒకానొకనాడు గుంటూరుపురమునకు మదాసు గవర్నరు అరుదెంచుచుండెను. నగరమంతయు తోరణములతోను, పందెళ్లతోను అలంకరించిరి. సభాభవనము కడు శృంగారముగ నేర్పరుపబడెను. అవి వందేమాతరం రోజులగుటచే ప్రభుత్వమునెడ కొంత ద్వేషభావమును ప్రబలుచుండెను వంగదేశమందు రహస్యసంఘములును, విప్లవసంఘములు నుత్పన్నమయ్యెను. తదనుకరణముగ నొక గుంటూరు ధీరుడును యువకులలో నట్టి విప్లవబీజముల నాటబూనెను. ఆ విప్లవశూరుడు

మన గోపాలకృష్ణుని, మఱొకనిని జేరబిలిచి, "రేపు ఉదయమే యిచ్చటకు గవర్నరు వచ్చుచున్నాడు. ఏర్పాట్లన్నియు పూర్తిగానవి. వీనిని భంగపరచెడిచో మనకు ప్రభుత్వమును కించపరచినవారమగుదుము. మీరు నాతోగూడ రండ"ని చెప్పగా ఈ యిద్దరు యువకులును వప్పాయనిరట. రాత్రి మాటుమణిగిన సమయమందా శూరుడు రెండు పిడకలు కిరసనాయిలులో తడిపి, యిద్దరకు రెండు అగ్గిపెట్టెలనిచ్చి, పందెరపై యిరుప్రక్కల వానిని అంటించి విసరమని వారినాజ్ఞాపించి, తాను సురక్షిత స్థానమునకేగి పందెర నిప్పంటుకొనుట జూచి ఆనందింతమని వేచియుండెనట! ఇంతలో మన గోపాలకృష్ణుడు తన మిత్రునితో "ఓయీ! మన నాయకుడెట్టి కుతంత్రమును బన్నెనో చూచితివా! ఈ ప్రమాద కార్యమునకు మనలను బ్రోత్సహించి, పిరికిపందవలె తాను సురక్షిత స్థానము జేరుకొన్నాడు. ఈ కార్యమందు మనము పట్టుబడితిమా, మనము తీవ్రశిక్షకుపాత్రులమగుదుము. ఈ మహా శూరునకు మనమిప్పుడు చక్కని గుణపాఠము నేర్పవలయు"నని చెప్పి యాపిడకలను నిప్పంటించకయే యిరువురును పందెరపై విసరివేసి, వేగముగ తమ నాయకునివద్దకేగి, "అయ్యా, తమ యాజ్ఞను నెరవేర్చి వచ్చితిమి" అని చెప్పిరి. అంత బహుకాలముగ యా శూరాగ్రేసరుడు మంటలకొరకును పందెల భస్మీకృతమగుటకును అతికుతూహలముతో జూచెను. ఎంతసేపటికిని పొగగాని, మంటగాని కానరాదు! "ఏమిరా? కారణ"మని

యూతడా బాలుర సముగజొచ్చెను. "ఏమోనంటి! పైకి విసురుటలో ఆ పిడకలారిపోయె నేమో?" నని గోపాలకృష్ణుడు సమయస్ఫూర్తిగ బ్రత్యుత్తర మొసంగెను. ఇట్లు కొంతతడవూరక జూచి తుదకు వారు వారి స్వగృహములకు నేగిరి. అప్పటినుండియు గోపాలకృష్ణునికి రాజకీయములలో రహస్యసంఘములన్న అరుచియు, అసహ్యమును కలిగెను. తన జీవితకాలమందట్టి సంఘముల నాతడెన్నడును ప్రోత్సహించెడివాడు కాడు.

## 3. ఇంగ్లాండు పయనము.

బాపట్లనుండి గోపాలకృష్ణుడు గుంటూరువచ్చిన పిమ్మట అచ్చట ఎఫ్. ఏ. తరగతిలో బ్రవేశించి కొంతకాలము చదివెను. కాని ఆరోజులలో మన ప్రభువుల సీమయగు ఇంగ్లాండునకుబోయి బ్యారిస్టరుకో, ఐ. సి. ఎస్. పరీక్షకో చదువుట మన యువకులకొక ఆచారముగను, పలువురకు లాభదాయకముగను నుండెడిది. అదే సమయమున గోపాలకృష్ణుని బాల్యమిత్రుడును, ధనికుడు నగు శ్రీ నడింపల్లి నరసింహారావుగారు ఉన్నతవిద్యకై బ్రిటనుకు బోనుద్యుక్తుడైయుండెను. నరసింహారావప్పటికి బహు బాల్యముననుండెను. విదేశయానమునకు వలయు ధనమునకు తోడు ధైర్యమాతనికి లేదయ్యెను. అట్టితరి గోపాలకృష్ణు డాతని బ్రోత్సాహపరచి, పరులెవ్వరకును దెలియకుండ డనే రాత్రికి రాత్రి పయనమై, గుంటూరువిడచి, బొంబయి చేరి, ఓడయెక్కి క్రమముగ ఇంగ్లాండుచేరుకొనిరి.

గోపాలకృష్ణుడు ఇతరులవలెనే బ్యారిస్టర్ పరీక్ష చదువ వలెనని మొదట తలచెను. కాని కారణాంతరములచే ఆపని కొనసాగలేదు. ఇందుకుమారుగ యాతడును, నరసింహారావును ఎడింబరో చేరి, అచ్చట ఎమ్. యే. పరీక్షకు జదువ నారంభించిరి. నరసింహారావు కుశాగ్రబుద్ధి, పాఠములందు శ్రద్ధ, తన ఆధ్యాపకులయెడ భక్తి, పరీక్షలయందు దమరక్తి గలవాడగుటచే క్రమముగ ప్రతియేడును తన తరగతులలో నుత్తీర్ణుడై, ఎమ్. ఏ. డిగ్రీని—పొంది, తదుపరి లండన్‌లో ఎల్. ఎల్. బి., బ్యారిస్టరు పరీక్షలు చదివి, పట్టాను స్వీకరించి నాలుగేండ్లలో స్వదేశమునకు తిరిగి వచ్చెను. కాని గోపాలకృష్ణుడో, మహామేధావి యైనను, గురువులయెడ నిర్లక్ష్యము, పాఠములయందశ్రద్ధ, యితరవ్యాపకములు హెచ్చు, వీనితో రెండుసార్లు ఎమ్. యే. పరీక్షకే అర్హత బొందలేక, తుట్టతుదకు అయిదేండ్లయినబిమ్మట ఎమ్. యే. డిగ్రీమాత్రము పొందగలిగెను. గోపాలకృష్ణునికి పఠనమందు అర్థశాస్త్ర మభిమానశాస్త్రమయ్యెను. కాని పరమ వేదాంతియు, రసికాగ్రేసరుడు, కళావేత్తయు నగు గోపాల కృష్ణునకీ శాస్త్రమునిన యెంత ఏవగింపో వేరుగ వ్రాయుట అనవసరము.

విద్యావిషయమై గోపాలకృష్ణుని విదేశయాత్ర యెక్కుడుపయుక్తముకాకపోయినను, నితరవిషయములలో ఆతడచ్చట గడించిన అనుభవము అమూల్యమని చెప్పవచ్చును. ఈ అను

భవములలో డాక్టర్ ఆనందకుమారస్వామితో గోపాలకృష్ణుని సాహచర్యము చాల ముఖ్యమైనది.

ఆనందకుమారస్వామి తండ్రివైపు సింహళదేశస్థుడు. తల్లి ఆంగ్లవనిత. ఆతడును ఒక ఆంగ్లస్త్రీనే వివాహమాడెను. ఆమెకు రత్నాదేవియని యాతడు నామమొసంగెను. ఆతనికి నారదుడను నొక కుమారుడు, రోహిణి యను కుమార్తెయు నుండెడివారు. ఆయన గొప్ప తత్త్వవేత్త — కళాకారుడు — విమర్శకుడు. గోపాలకృష్ణుడాంగ్లసీమలో నున్నపు డానందకుమారస్వామియు నచ్చటనే యుండెడివాడు—ఒకనాడు గోపాలకృష్ణుడు ఎడింబరో భారతసంఘ కార్యదర్శిగా నున్నప్పు డానందకుమారస్వామి సభాధ్యక్షుడుగ నచ్చటకేగెను. గోపాలు డాతని ఆకర్షించెను. క్రమముగ ఉభయులకును ఉత్తర ప్రత్యుత్తరములు సాగెను. తుట్టతుదకు కొంతకాలము గోపాలకృష్ణుడు కుమారస్వామి ఆశ్రమమున గడిపెను. ఉభయులు గురుశిష్యులైరి. గోపాలకృష్ణుని చిత్తవృత్తిని రూపొందించినవారిలో ఆనందకుమారస్వామి అగ్రగణ్యుడనుటలో నేమాత్రమును అతిశయోక్తి యుండదు.

ఆనందకుమారస్వామియింట గోపాలకృష్ణుడు నాలుగు మాసములకు పైగనే యుండెను. ఇందుగూర్చి ఆతడిట్లు వ్రాసెను. "నేనానందకుమారస్వామియొద్ద శుశ్రూష జేయనెంచితిని. ఈతనిలో ప్రాగ్ప్రతీచీల పరమార్థ ఐహికములు రెండును చక్కగ సమన్వయ మొనర్పబడినవి. యదార్థమునకు "ఆచార్యవాన్

పురుషో వేదః" అను నార్యోక్తి ననుసరించి, నిజమగు విద్యా న్వేషణకు గురువవసరము. నేను కుమారస్వామికి శిష్యుడనగుదు నంటిని. ఆతడానందముతో వప్పెయనెను. అందుచే నే నిచ్చటకు వచ్చి ఆతని యింటిలోనుంటిని, ఈయిల్లు సాలిస్బరీ పట్టణమునకు మూడు మైళ్లలో నుండును. ఇదొక పల్లెటిసీమ. ఆహా! దీని సొగసు నేమనదగు? ఆతడొక ఋషితుల్యుడు. ఆతనిభార్యయు, బిడ్డలును నాయెడ అతిదయతోనున్నారు. ఈ గృహము శాంతి, సౌఖ్యములకొక నిలయము. ఆతనికొక పెద్ద గ్రంథాలయ మున్నది. ఆతడు నిరంతరము కృషిచేయుచుండును. ఇచ్చట అంతయు శాంతముగను, సౌఖ్యముగను, స్వర్గతుల్యముగ నున్నది. ఇంటిచుట్టు నొక చిన్న తోటకలదు. వాతావరణము బహు సొంపుగనున్నది. ఇచ్చటికి రెండుమైళ్ళలోపుగా ఇళ్ళే మియు లేవు. అన్నివస్తువులకు సాలిస్బరీకి పోవుదుము - ఇద్దరు నొకర్లు ఉన్నారు. పగలంతయు నేను లైబ్రరీలో కాని, నాగదిలో కాని పనిచేసుకొందును. సాయంకాల మందరముకలసి సంగీ తమో, కబుర్లో, కాలక్షేపముచేయుదుము, కుమారస్వామిగారు నిరంతరము పనిచేయుచు, నాచేగూడ పనిచేయించుచున్నారు. ఈజీవితము బహు ఆనందదాయకముగనున్నది."

బ్రిటిష్ ఫోర్డు వదలినపిమ్మట గోపాలకృష్ణుడిట్లు వ్రాసెను. "నేను కుమారస్వామితోనున్న నాలుగుమాసములును ఇంత వరకు నాజీవితమందలి ఉత్తమోత్తమ కాలమని చెప్పవచ్చును.

ఈ యునికి నాజీవిత వైఖరిని, భావములనే మార్చివైచినది. శారీరికముగను, మానసికముగను నేనిప్పుడు సంపూర్ణముగ మారిపోయితిని. నే నాతనితో కొంత కాలముండవలెనను సంకల్పము మహత్తరమైనది. దానివల్ల నే నాలో యిట్టి సంస్కారము కలిగెను.

ఆనంద కుమారస్వామి గోపాల కృష్ణుని సహజ ప్రజ్ఞాధురీణత కొకరూపమేర్పరచెనని చెప్పవచ్చును. భారతీయవిజ్ఞానము, కళ, వేదాంతవిషయములలో ఎన్నియో హంశములగూర్చి యాతని కెరుకపరచెను. అంతవరకు అశిక్షితమైన యౌవనాశయములకు ఆనందకుమారస్వామి యొక విధమగు క్రమశిక్షణ యొసంగెను. క్రమముగ అజంతా చిత్రములు, రాజపుత్ర చిత్రములగురించియు, భరతనాట్యము, గానవిషయములగూర్చి ఉభయులును కలసి గ్రంథరచనకు గడింగిరి. "అభినయదర్పణమ"ను సంస్కృతగ్రంథమును ఉభయులును ఆంగ్లమొనర్చిరి. ఉభయులమధ్య యొక గాఢమగు గురుశిష్యానురాగమంకురించెను. కాని వెన్వెంటనే గోపాలకృష్ణుడు తన విద్యాభ్యాసనమునకై ఎడింబరో కేగుటయు, ఆనందకుమారస్వామి అమెరికా ఉద్యోగముకొరకు వెళ్ళుటయు దటస్థించెను. వారి జీవితకాలములో తిరిగి ఉభయులును కలియజాలకపోయిరి.

గాంధీ, గోపాలకృష్ణుల ప్రథమసమాగమమునకు ఆనంద కుమారస్వామియే కారకులని చెప్పుదురు. అవి ప్రథమ యుద్ధ

దినములు—1915 సంవత్సరము. గాంధీమహాత్ముడు దక్షిణాఫ్రికానుండి స్వదేశమునకు బోవుచు మధ్య లండన్ వెళ్ళెను. అప్పుడింగ్లాండులోని భారతీయులు పెక్కురు గాంధీమహాత్ముని సందర్శింపబోయిరి. ఆనందకుమారస్వామియు గోపాలకృష్ణునితో సహా గాంధిని కలసెను. ఆతనియొద్దకు పోకపూర్వము "మన మిప్పుడు భావి భారత భాగ్యవిధాతను కలియుదు" మని కుమారస్వామి గోపాలునితో ననెనట. ఈమాటలు గోపాలకృష్ణుని హృదయసీమలో మంత్రాక్షరములవలె నాటుకొని, 1920 లో గాంధీమహాత్ముడు ఇండియాలో అసహాయోద్యమము ప్రారంభించినప్పుడాతడు గాంధీ అనుచరులలో నగ్రగణ్యస్థానమున కాశించుటలో నాశ్చర్యము లేదు.

సీమలోనున్నప్పు డొక కృష్ణాష్టమినాడు పీతాంబరములు ధరించి గోపాలకృష్ణుడు తన భారతీయమిత్రులకు కృష్ణలీలలను హరికథారూపమున బ్రదర్శింపజేసెనట!

గోపాలకృష్ణు డింగ్లాండులోనున్న కాలమందే ద్వితీయ ప్రపంచయుద్ధ మారంభమయ్యెను. ఆ ఐరోపాదేశములన స్వతంత్రదేశములు. అందు "ప్రపంచమందల్లెడలను ప్రజా రాజ్యముల నెలకొల్పుటకు" నేర్పడిన సంగ్రామము. ఆరోజులలో నిచ్చట కాంగ్రెసు మితవాదులచేతులలో నుండెడిది. 1915 లో తిలకుమహాశయుని మాండలే జైలునుండి విముక్తుని జేసిరి. ఆత

పించెను. 1916 లో భూపేంద్రనాధబాసు అను నాతడు కాంగ్రెస్ అధ్యక్షుడయ్యెను. "భారతస్వాతంత్ర్యము"ను నొక పొత్తమును రచించి, అందు భారతీయులు బ్రిటన్ యెడ రాజభక్తి గలవారని నుడివెను. అందుపై ఇంగ్లాండునందలి విద్యార్థులలో తర్జన భర్జనలు బయలుదేరెను. ఒక ఆంగ్ల మిత్రుడిది నిజమేనా? యని గోపాలకృష్ణునడిగెను. "అది కేవలమబద్ధము. ఇవి లౌక్యము కొఱకు చెప్పెడిమాటలు. మాదేశమంతయు బ్రిటన్‌పై ద్వేష భావముతో నుడికిపోవుచున్నది అచ్చట నొక రహస్య విప్లవో ద్యమము కలదు. మంచి ముహూర్తమున 1857 లో వలె మీ దేశీయుల నందరను మావారు హతమార్చెద"రని నుడివెను. అందుపై ఆ స్నేహితుడు గోపాలకృష్ణుని కరచాలనముచేసి "మిత్రమా! ఆనాడు యుద్ధరంగమున మనము కలియుదుమేని, నిన్ను నేను విడచెదను—నాప్రాణమును నీవు కాపాడుము" అనెనట.

గోపాలకృష్ణుడింగ్లాండులో నుండగనే జరిగిన యొక సంఘటనము ఆతని జీవితమందతి ముఖ్యమైనది. విదేశమునకేగిన భారతీయ విద్యార్థులు ఆ యా దేశములందలి సంఘైక్యత గురించి విస్తుపోయి మనదేశమందలి విభేదములగూర్చి యోచించుట సామాన్యానుభవము. గోపాలకృష్ణుడును, ఆతని మిత్రులును, యిందుగూర్చి తరచు చర్చించుకొనుచుండెడివారు. తుట్టతుదకు ది 1-8-1915 న లండన్ నగరమున గోపాలకృష్ణుడును,

ఆతని ఆప్తమిత్రుడగు శ్రీ తాడేపల్లి శంకరశాస్త్రిగారును ఒక టామ్‌బండిలో పోవుచుండిరి. ఉన్నట్లుండి గోపాలకృష్ణుడు "మన జాతి ముక్తికి నేను మార్గమును కనిపెట్టితినిరా! "ఇక నందరను నేను బ్రాహ్మణుల జేయుదు"నని శాస్త్రిగారితో ననెనట. ఈ సందేశమే తదుపరి యాతని జీవిత సందేశముగ బరిణమించెనని మనము మున్ముందు చదువుదుము.

## 4. ఉద్యోగము.

గోపాలకృష్ణుడాంగ్లసీమలో 1911 మొదలు 1916 వరకు అయిదేండ్లు గడపెను. ఆతడు స్వదేశమునకు రాగానే దేశ స్వాతంత్ర్యముకొఱకు గాని, నూతన మతస్థాపనకొఱకుగాని యాతడెట్టి ప్రయత్నమును గావింపలేదు. ఆతడు వెంటనే యుద్యోగమునకై ప్రయత్నించెను. ఆరోజులలో ప్రభుత్వోద్యోగమే మన వారికి మోజుగనుండెడిది. అందుచే 1917 వేసవిలో యాతడుదకమండలమునకేగి రెవిన్యూసభ్యుడగు సర్ అలెగ్జాండర్ కార్డ్యూను, విద్యాశాఖా డైరెక్టర్ స్టోన్ దొరను చూచెను. వారియాదరణచే గోపాలకృష్ణునకు రాజమహేంద్రవరమందలి ట్రెయినింగ్ కాలేజీలో చరిత్రోపాధ్యాయత్వము లభించెను.

కార్డ్యూదొరతో గోపాలకృష్ణుని సమావేశములో నొక సంఘటనము జరిగెను. ఈ దొరగారు మద్రాసుప్రభుత్వములో బ్రాహ్మణేతర పక్షపాతియని ప్రతీతి. గోపాలకృష్ణునితో యా

తడు జరిపిన సంభాషణలో యాదాలాథముగ నొకతూరి "నీవు
బ్రాహ్మణుడవా?" అని అడిగెనట. అందుపై తాను బ్రాహ్మ
ణుడనని గోపాలకృష్ణుడు సమాధానమిచ్చెను. కార్డ్యా నవ్వె
ను. గోపాలున కందుపై ఆగ్రహముకలిగి వెళ్ళిపోవుటకై కుర్చీ
నుండి లేచెను. అప్పుడు కార్డ్యా గోపాలకృష్ణుని క్షమాపణ
గోరి, తాను గోపాలకృష్ణునిగాని, బ్రాహ్మణులనుగాని నొప్పింప
దలచ లేదనియు, ప్రభుత్వమునకు బ్రాహ్మణు లెంతయో అవసర
మనియు, నాటి బ్రాహ్మణేతరోద్యమము కేవల రాజకీయావసర
ములకై యుద్భవించెననియు సమాధానము నొసంగెను.

గోపాలకృష్ణుడు రాజమహేంద్రవర కళాశాలలో తొమ్మిది
మాసములు మాత్రముండెను. తన సహజ ప్రజ్ఞావిశేషములు,
ప్రపంచానుభవము, వక్తృత్వము, హాస్యగుణములతో గోపాల
కృష్ణుడాచార్యపదవికి మిక్కిలి తగియుండెను. ఆతని స్వాతంత్ర్య
ప్రియత్వము విద్యార్థులను హెచ్చుగ నాకర్షించెను. చరిత్రా
బోధన విషయమై ఆతని పద్ధతులు నవీనములు, సాంప్రదాయ
యుతములై యుండును. జరిగిన సంగతులను పూసగ్రుచ్చినట్లు
రసవిహీనముగను, భావరాహిత్యముగను, వప్పజెప్పుట యాత
నికి రుచించెడిదికాదు. ఇందుకుమారుగ ఆంధ్రచరిత్రలో బొబ్బిలి
యుద్ధముగూర్చి చెప్పుటకు జంగంకథరూపమే యెక్కుడుపయుక్త
మనియు, పల్నాటివీరులగూర్చి తెల్పుటకు బాలనాగమ్మకథ
సహాయకారియనియు, కళాశాలయందే అట్టి ప్రదర్శనముల

నేర్పరచెడివాడు. వీనివల్ల ఆంధ్రశౌర్యమును, దేశభక్తియు, ఉత్పన్నములగునని ఆతని విశ్వాసము. ఈ పద్ధతులు విద్యార్థులకు కడు యింపుగనుండెడివి. కాని కళాశాల ప్రిన్సిపల్‌గారగు రాన్ దొరకివి కిట్టెడివికావు.

ఇంతియగాక గోపాలకృష్ణుడు తరుచుగ కళాశాలకు ఆలస్యముగ వెళ్ళుచుండెడివాడట. తనకు పనిలేకపోయినను ఉదయము 9-45 మొదలు మధ్యాహ్నం 12-30 వరకును, మధ్యాహ్నం 2 మొదలు సాయంత్రం 4 గంటలవరకు గోపాలకృష్ణుడు కళాశాలలోనే యుండవలెనని ప్రిన్సిపల్ చీటిపంపెను. మరుచటి దినమున యీ ఉత్తరువును నిర్లక్ష్యముచేసి యథాప్రకారముగ గోపాలకృష్ణుడాలస్యముగ కళాశాలజేరెను. ప్రిన్సిపల్ యీసంగతి గమనించి కళాశాల తలుపులు మూయించెను. గోపాలకృష్ణుడు గేటుదూకి లోపలికి జొరబడెను. "ప్రతిరోజును నీవేల యిట్లాలస్యముగ వచ్చుచున్నా"వని ప్రిన్సిపల్ గోపాలకృష్ణుని హెచ్చరించెను. మా యింట వంటలాలస్యమగును. దేవతార్చన వగైరాలును ఆలస్యమగునని గోపాలకృష్ణుడు ప్రత్యుత్తరమిచ్చెను. "మీ యాడువారిని త్వరితముగ వంట జేయుమని నీవేల చెప్పవు?" అని ప్రిన్సిపల్ తిరిగి ప్రశ్నించెను. ఈ విధముగ తన స్త్రీలగురించి ప్రిన్సిపల్ హెచ్చరించుట గోపాలకృష్ణుని కాగ్రహకారణమయ్యెను. వెంటనే యాతడు రుద్రరూపముధరించి, చొక్కా చేతులు పైకిలాగి, "రాసా

సురుని”పై యుద్ధమునకు సంసిద్ధుడయ్యెను. అంత రాసుదొర రివ్వు రివ్వున తన గదిలోనికి పరువెత్తి తలుపులు బిగించుకొని ప్రాణము దక్కించుకొనెను. ఈ హడావుడినంతను జూచుటకు వసారాలలో మూగిన విద్యార్థిబృందము పక పక నవ్వుచు దొర గారి ధైర్యమునకు గోల చేసిరి.

రాసుదొర గోపాలకృష్ణునియెడ క్రోధముబూని క్రమముగ యాతని ఉద్యోగమునుండి తొలగించుటకు కృతనిశ్చయుడయ్యెను. ఒకానొకతూరి యొక విద్యార్థిసభలో గోపాలకృష్ణుడధ్యక్షపీఠమందుండగా, నెవ్వరో యొక చిన్న స్వరాజ్యపతాకము నాతనిచేతికందించిరి. ఆతడు ప్రభుత్వోద్యోగి. రాజకీయ వ్యవహారములలో జోక్యము కలిగించుకొనరాదు. ఆ జెండా నేమిచేయదగునని ఆతడొక్క క్షణమాలోచించెను. “ఇది చక్కని జెండా. దీనిని నా దేశీయులు పవిత్రముగ జూచుచున్నారు. ఎవ్వడో యొక బాలుడు దీనిని నాకొసంగెను. దీనిని నేను స్వీకరింప దగునా? త్రోసికరింపవలెనా?” ఎట్టకేలకు బల్లపైనున్న గుండునూదుల దిండులో దానిని గుచ్చెను. ఈసంగతి బాలుర వల్ల రాసు గ్రహించెను.

ఇంతలో బందరులో నొక విద్యార్థిమహాసభ జరిగెను. అవి ‘హోమ్‌రూల్’ ఉద్యమరోజులు – అనిబెసంటుదొరసాని నాయకత్వమున బ్రహ్మాండముగ స్వారాజ్యోద్యమము చెలరేగు చున్న దినములు. విద్యార్థులెవ్వరును రాజకీయసభలలో

పాల్గొనరాదని ప్రభుత్వమొక 555 నెంబరు జి. ఓ. ను జారీ చేసెను. ఈ జి. ఓ. ను ఖండించుట నాటి బందరు సభయొక్క ముఖ్యోద్దేశ్యము. గోపాలకృష్ణుడా సభకు హాజరుకాలేదు కాని ఆ సభానంతర మచ్చటనే మరొకసభలో ఆంధ్రకళలగురించి యావిద్యార్థులకు ప్రబోధించెను. ఇందుగూర్చి రాసుదొర తెలుసుకొనెను. అచ్చటి విద్యార్థిసభకు గోపాలకృష్ణు డధ్యక్షత వహించెనని ప్రభుత్వమునకు తెలిపెను. గోపాలకృష్ణుని యుప న్యాసమును బంపమని ప్రభుత్వమాజ్ఞాపించెను. గోపాలకృష్ణుని వద్ద లిఖితరూపమగు ఉపన్యాసమెద్దియు లేదు. ఆతడాశువుగనే ఉపన్యసించెను. ఆసంగతి ప్రిన్సిపల్‌కు ఆతడు తెలిపెను. "ఇక నుండి మీయుద్యోగము మాకు వల" దని ప్రభుత్వము ఉత్త రువు బంపెను. దానితో గోపాలకృష్ణుని రాజమహేంద్రవర వాస మంతమందెను.

వ్రాత ఉపన్యాసములగూర్చి గోపాలకృష్ణుని అభిప్రాయ ములు ఆతని పదిడిపాడు ఆంధ్రగ్రంథాలయ మహాసభాధ్యక్షోప న్యాసము వల్ల మనము గ్రహింపగలము. అందాతడేమనె ననగా :—

"హావ భావ విలాసములతోకూడి నాయెదుట ప్రత్యక్ష ముగనున్న సభ్యులతో నేను ముచ్చటింతునుగాని వారి మనో భావములెట్లుండవచ్చునని ముందుగ నా మనోఫలకమున చిత్రిం చుకొని వారి పరోక్షమున నా యుపన్యాసమును సిద్ధపరచు

నాచారము నాకు సరిపడదు. వర్తమాన కాలపు నవనాగరక స్త్రీ తాను కల్పించుకొన్న యితర వ్యాపృత్తులచే నియమిత కాలములందు మాత్రము శిశువునకు స్తన్యమునిచ్చు అస్వాభావిక పద్ధతి నవలంబించవచ్చునుగాని శిశుసందర్శనమాత్రముననే స్తన్యము స్రవించుట స్వాభావికము. ప్రియుడు తన ప్రేయసితో మాటలాడు సంభాషణమును ముందుగ నెన్నడు వ్రాసుకొనడు. అటులనే వివిధరుచులు, స్వభావములుగల సభ్యులుగల పరిషత్తులలో వారి వారి రుచుల వైచిత్ర్యమును వక్త అనుసరింపవలెను. కావున లిఖితపూర్వక యుపన్యాసములు నాకు గిట్టవు."

## 5. సందిగ్ధస్థితి.

రాజమహేంద్రవరం కళాశాలను వదలినపిమ్మట గోపాలకృష్ణుడు తన కర్తవ్యముగురించి యోచించుకొనుచుండగా బందరులోని ఆంధ్రజాతీయ కళాశాలలో అధ్యాపకత్వమునకు కాతనికి పిలుపువచ్చెను.

వందేమాతరం ఉద్యమమున కంతర్భాగములుగ ఆరోజులలో విదేశవస్తు బహిష్కారమును, విదేశవిద్యా బహిష్కారమును ప్రచారములోనికి వచ్చినవి. వీని సిద్ధాంతభాగములే స్వదేశీయుద్యమమూ జాతీయవిద్య.

బ్రిటిష్ వారిచ్చట రాజ్యమేలినకాలమందే వారు రేరీతిగ నను విదేశవస్తువులతోపాటు "అప్రాచ్యవిద్య"ను గూడ యిచ్చ

టకు దిగుమతి చేసికో లోకవిదితము 1834 ప్రాంతమాదు ము కాలే ప్రభువు శిఫారసుపై యిచ్చటి ప్రాచ్యవిద్యాలయము లను అణగద్రొక్కి, ఆంగ్లవిద్యాలయములను ప్రోత్సహించుట కప్పటి బ్రిటిష్ అధికారులు నిశ్చయించిరి. తమవరి క్రమముగ మన దేశమున ఆంగ్లకళాశాలలు, యూనివర్సిటీలు వృద్ధిజెంది దేశీయభాషలును, సంస్కృత అరబ్బీలును అడుగంటిపోయినవి. భాషలతోపాటు భావములును విదేశ జనితములై క్రమముగ మన యువకులాంగ్లమానసపుత్రులగుటయు దటస్థించెను. దీని వల్ల క్రమశః యిచ్చట దేశభక్తి సన్నగిల్లి జాతీయత రూపు మాయు స్థితికివచ్చెను. ఇట్టి పరిస్థితిలో మార్పుదెచ్చుటకు మహా రాష్ట్రమందు తిలకు, గోఖ్లేలు "నవ్యాంధ్ర బడు"లను, క్రమేణ దక్షిణ విద్యాసంఘము, ఫెర్గుసన్ కళాశాలలను, వంగదేశ మందు రసవిహారీఘోష్, శ్రీ అరవిందఘోష్‌గార్ల నాయకత్వ మున జాతీయకళాశాలలను, జాతీయ యూనివర్సిటీని నెలకొల్ప బడినవి; ఈ వంగీయోద్యమ పరిణామమే మన బందరులోని ఆంధ్రజాతీయకళాశాల.

ఈ కళాశాలకు మూలపురుషులు ముగ్గురు—కీ. శే. కోవల్లె హనుమంతరావు, కీ. శే. ముట్నూరి కృష్ణారావు, ప్రస్తుత నాగపురి గవర్నరు డాక్టర్. పట్టాభిసీతారామయ్య గారలు. ఆరోజులలో యీ కళాశాలకు జాతీయాభిమానులగు విద్యార్థిబృందమూరూరను దిరిగి, కానుకలు, దక్షిణలు ప్రోగు

జేసి, "దీపావళిభిక్ష"వసూలుచేసి పోషించెడివారు. కళాశాలాధ్య క్షుడు శ్రీ హనుమంత రావుగారొక ఆదర్శపురుషుడు—తత్వవేత్త. కృష్ణారావుగారు తత్వవిషయములందును, డాక్టర్. పట్టాభిగారు ఆర్థికవ్యవహారములందును హనుమంతరావుగారికి దిట్టలైతోడ్ప డు చుండెడివారు. అట్టి కళాశాలలో గోపాలకృష్ణున కీసమయ ము న ఆధ్యాపకత్వము లభించెను.

గోపాలకృష్ణుడు సహజముగ విద్యావేత్త – స్వసంప్ర దాయాభిమాని — జాతీయతాప్రియుడు — ఆంధ్రత్వమునకు మూర్తి. కాని ఆతడు హెచ్చుకాల మీకళాశాలయందుండు ఉండలేకపోయెను. ఏడెనిమిది నెలలలోనే యాతనికిని, కళాశా లాధికారులకును విభేదములంకురించి 1919 మార్చిలో యాతడు కళాశాల వదలిపోయెను.

ఇందుకు కారణములు రెండు—

పైపై కారణము లీతని ఉద్యోగమునకును, ఉపకార వేతనమునకును సంబంధించిన కొన్ని స్వల్పవిషయములు. తాత్కాలికావేశముచే ఆరోజులలో యీ విభేదములే గోరిం తలు కొండంతలుగ పత్రికలకెగబ్రాకి ఆంధ్రలోకమున యొక చిన్న సంచలనము గలుగచేసినవి. ఇట్టివానిలో ఆతనిహోదా వైస్‌ప్రిన్సిపల్ అగునా? కాదా? ఆతని గౌరవభృతి నెలకు యెనభైయా? నూరా? కాని యీభేదములు బహు స్వల్పవిష యములని పైననే చదివితిమి.

ఇందుకు అసలుకారణము జాతీయ విద్యా విధాన విషయమై గోపాలకృష్ణునికిని బందరు పెద్దలకును అంకురించిన భిన్న భావములే.

ఆనాటి జాతీయ విద్యావిధానము కొంతవరకు భారతదుకూలమును ధరించినను మూలవిషయములలో నది చాల భాగము ప్రభుత్వ విద్యానుకరణమేయని గోపాలకృష్ణుని మతము. ఉదాహరణ:- గురువునకు దక్షిణయొసంగవలెనుగాని నెలజీతములు పనికిరావు - శిష్యుడు గురువుతో నంతేవాసి కావలెనుగాని ఉభయులును కేవలపరిచయస్థులవు వేర్వేరు రూపములు కాను. విద్యాలయములు గురుకులములు కావలెనుకాని కళాశాలలు కాకూడదు తరగతుల వర్గీకరణము విషయములబట్టి కాదు - బాల బాలికల సత్వరజస్తమోగుణములనుబట్టియు, తదనుసరణములగువారి కర్మలనుబట్టియు జరుగవలెను. హాజరుపట్టీలును, మస్తరుజాబితాలును ఆధ్యాపక వర్గమున కపభ్రంశములు-విద్యారంభముపనయన రూపమునయుండవలెను - ప్రేరణ మాంత్రిసహితముగను-సాధన ఉపాసనాపద్ధతిలోను నుండవలెను.

ఇట్టివి గోపాలకృష్ణుని నిజాశయములు.

కాని నాటి మనజాతీయ విద్యాలయములలో యిట్టి భావములకు తావులేదు. ప్రభుత్వవిధానమునుండి ఆంగ్లము కొంత తగ్గించుట, దేశభాషలకు కొలది ప్రోత్సాహము; మేష్టర్లకు జీతముతక్కువ, విద్యార్థులకు హెచ్చు; కేవల భాషా

బోధనయేకాక, దానికితోడు కొన్ని సాంకేతిక వృత్తులను, దేశీయకళలను నేర్పుట, జాతీయనాయకుల పరిబోధము - ఇవి ఆ కళాశాలల ముఖ్యలక్షణములు.

గోపాలకృష్ణుని విద్యావిధాన మింతకంటె ఉన్నతస్థాయికి జేంరియుంటచే యాతని కచిరకాలముననే బందరు కళాశాలతో విడాకులు లభించుటలో నాశ్చర్యము లేదు.

కాని ఆతడు బందరులోనున్న సమయమున భారతీయాదర్శము గురించియు, సారస్వతవిషయమునను కొన్ని ఉపన్యాసముల నిచ్చెను. అందు "పురుషార్థముల" గూర్చి యాతని ఉపదేశము లుత్తేజకరములును, నిజ మానవాదర్శములపట్ల భావగర్భితములునై యున్నవి.

రవీంద్రనాథఠాగూరు కవిత్వముగూర్చి చెప్పుచు, యాతను మహాకవీంద్రుడే కాని యాతని రసజ్ఞత మన చేమకూర వెంకటకవి పాకమునకైనను చేరదని అనెడివాడు. ఠాగూరు "సర్వనామారాధకు"డట - భారతసిద్ధి నామ రూపాత్మకమై, ప్రేయసీ ప్రియులకు సంపూర్ణ సాక్షాత్కారయుతమై, రాధాకృష్ణులుగనో, సీతారాములుగనో, ఉమామహేశ్వరులుగనో వెలయుచుండగ, గీతాంజలిలోని నాయికా నాయకులు "నేను-నీవు" మాత్రమే!

బందరు కళాశాలను వదలిన పిమ్మట కొంతకాల మెచ్చటికేగుట? ఏమి చేయుట? యని గోపాలకృష్ణుడు తటపటాయించెను. ఇక ఉద్యోగములయాశ యాతనికి పోయెను. దేశసేవయే ఆతని

పరములక్ష్యమయ్యెను. అందు రాజకీయములా? విద్యాసేవయా? రెండును అభిమానవిషయములే – దేశమునకు రెండును అవసరములే. ఈలోగా తన భార్య అనారోగ్య కారణమున యాతడు చీరాల జేరెను.

ఆ కాలమందలి రాజకీయపరిస్థితిగూర్చి యొకింత దెలుసుకొనుట యిచ్చట అవసరము.

1917–18 లో అనీబెసంటు నాయకత్వమున "హోమ్ రూల్" ఉద్యమము సాగెను. ఆమెకు తిలకు, జిన్నాగారలు సహాయులుగనుండిరి. ఇంతలో గాంధీమహాత్ముడు దక్షిణాఫ్రికానుండి తిరిగివచ్చి భారతరాజకీయములందు బ్రవేశించెను. 1918 నవంబరులో మొదట ప్రపంచయుద్ధమును అంతమొందెను. 1919 లో భారతప్రభుత్వ చట్టము పేరిట ఇంగ్లాండు మన దేశమునకు కొన్ని రాజకీయ సంస్కరణముల నొసంగెను.

1920 మధ్యభాగమున యిచ్చట ముఖ్యముగ మూడు సమస్యలుత్పన్నములయ్యెను. అందొకటి పంజాబు ఘోరములు; రెండవది ఖిలాఫత్ అన్యాయము; మూడవది స్వరాజ్యసమస్య.

ఇందు పంజాబునందలి జలియన్వాలాబాగులో డయ్యర్ సేనాని దాదాపొక వెయ్యిమంది భారతీయులను కౄరముగ కాల్చి చంపెను. దీనిఫలితముగ పంజాబులో పలుచోట్ల అల్లర్లు, కాల్పులు, చెలరేగెను. గాంధీమహాత్ముని నాయకత్వమున ప్రజలు "సత్యాగ్రహము"నకు గడంగిరి. బ్రిటిష్‌ప్రభుత్వము

లోంగ లేదు. దేశమంతయు అతృప్తి ప్రబలెను.

ప్రపంచమందలి మహమ్మదీయులెల్లరకు టర్కీసుల్తాను మతగురువు. ఆతని "ఖలీఫా" యనెడివారు. మొదటి ప్రపంచ యుద్ధమందు టర్కీ జర్మనీవైపు జేరెను. జర్మనీ యోడిపోగనే జర్మనీ, ఇటలీలతోపాటు టర్కీకిగూడ తగుశాస్తి జరిగెను. ఇది ప్రపంచమందలి మహమ్మదీయులందరికిని ఆగ్రహకారణమైనది. అందు ముఖ్యముగ భారతీయ మహమ్మదీయులు తమ సహజ మతావేశముచేతను, బ్రిటన్ నందలి ద్వేషభావముచేతను యిచ్చటనొక "ఖిలాఫత్" ఉద్యమమును లేవదీసి భారతప్రభుత్వ ముపై యొత్తిడి తేసాగిరి. ఈ ఉద్యమనాయకులు సుప్రసిద్ధ అలీ సోదరులు. వీరి యత్నములకు గాంధీమహాత్ముడును సంపూర్ణ ముగ దోహదమొసంగెను.

ఇక స్వరాజ్యవిషయమై—1919 లో బ్రిటన్ ఇండియా కొసంగిన మాంటేగు-ఛెమ్సుఫోర్డు సంస్కరణలు అసంతృప్తి కరమును, ఆశాభంగముగను నున్నవనియు, సంపూర్ణ స్వరాజ్యమే భారతీయుల గమ్యస్థానమనియు, కాంగ్రెసువారు ప్రకటించిరి. అంతవరకు కాంగ్రెస్ సంస్థ మితవాద శేఖరులగు గోఖ్లే, మెహతా, బెనార్జి మున్నగువారి చెప్పుచేతలలో నుండెడిది. కాని పైజెప్పిన పరిస్థితులలో గాంధీ, అలీసోదరులు మున్నగు అతివాదులు కాంగ్రెసు వ్యవహారమంతయు కైవసము చేసి కొనిరి. ఇంతలో 1-8-1930 న లోకమాన్య తిలకుమహాశయుడు దివంగతుడయ్యెను. గాంధీమహాత్ముడు దేశమందద్వితీయ నాయకుడయ్యెను.

గాంధీమహాత్ము డిచ్చటి బ్రిటిష్ప్రభుత్వమును "సైతాన్ ప్రభుత్వ"మని ప్రకటించి దాని సర్వనాశనమునకై "అహింసాయుత అసహాయోద్యమ"మును సూచించెను.

ఈ యుద్యమమునకు మూలసూత్రములు రెండు.

అందొకటి కాంగ్రెసువాదులు తమ యత్నములలో అహింసామార్గమును విడనాడరాదు. సత్యాహింసలు గాంధీ మహాత్ముని శకటమునకు రెండు పట్టాలవంటివి.

రెండవది "సహాయనిరాకరణము".

అప్పటి మన దాస్యకారణముల నూహించినచో యీ "అసహాయ" సూత్రముయొక్క హేతువాదన మనకు సుబోధకము కాగలదు.

ఇండియాలో అప్పటి జనసంఖ్య ముప్పదియైదుకోట్లు. ఇందాంగ్లులు మూడున్నరలక్షలు మాత్రమే. బ్రిటిష్వారు మనల నిచ్చట తమ సంఖ్యాబలముచేగాని, సైనికబలముచేగాని, తుదకు ధనబలమువల్లగాని జయింపలేదు. ఇచ్చటి రాజ్యాపోషణయు భారతీయుల సహాయమువల్లనే జరిగెడిది. అనగా యిచ్చటి సైనికులలో చాలమంది భారతీయులు; భారతీయులిచ్చెడి పన్నులే ప్రభుత్వబొక్కసము; భారతీయులే బ్రిటిష్ వారి గుమాస్తాలు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ప్లీడర్లు, శాసనసభ్యులు. ఇట్టి భారతీయ స్తంభములపైననే వారి ప్రభుత్వ సౌధము వెలసెను. ఆ స్తంభముల నొకటొకటిగ తొలగించినచో

ఆ ప్రభుత్వము దానంతట అదే కూలిపోవునని గాంధీ విశ్వాసము.

సర్ జాన్‌సీలే యను బ్రిటిష్ రాజకీయవేత్త "ఇంగ్లాండు పెరుగుదల" యను నొక గ్రంథమం దిట్లు వ్రాసెను. "అత్యల్పముగ నైనను భారతీయులలో జాతీయతా భావమంకురించి; విదేశీయుల నిచ్చటనుండి తరిమివేయువలెనను వాంఛ లేకున్నను; యిచ్చట రాజ్యనిర్వహణలో విదేశీయులకు తోడ్పడుట సిగ్గుచేటను భావముత్పన్న మైనచో; ఆనాటనుండియు మనసామ్రాజ్య మంతరించిపోవును."

ఇంకొక ఆంగ్లేయు డిటుల వ్రాసెను. "యిరోపియులకొరకు పనిచేయుటకు భారతీయులు నిరాకరించినచో, ఒక్క నెలలోనే మన శ్వేతసామ్రాజ్య మంతరించిపోవును."

ఈ ప్రాతిపదిక పైననే గాంధిమహాత్ముని అసహాయోద్యమము బయలుదేరెను. బ్రిటిషు బిరుదులను విసర్జించుట-కోర్టులను, పాఠశాలలను బహిష్కరించుట - శాసనసభలకు పోకుండుట - ఉద్యోగులను వదలుకొనుట - విదేశవస్త్ర బహిష్కారము - తుదకు పన్నులు చెల్లింపకుండుట - ఇవి యా ఉద్యమమందలి ప్రధానాంశములు.

ఈ అసహాయోద్యమమును స్వీకరించుటయా? మానుటయా? యనునదే 1920 నాటి యిచ్చటి ముఖ్య రాజకీయ సమస్య. అందు ప్రధానముగ 1919 సంస్కరణల ననుసరించి

యిచ్చట 1920 లో జరిగిన రాష్ట్రశాసనసభల యెన్నికలకు కాంగ్రెసువారు పోటీచేయుటయా? మానుటయా? ఈ సంస్కరణలను ప్రారంభించుటకు 1921 లో యిచ్చటకు రానున్న బ్రిటిషు యువరాజును భారతీయప్రజలు సగౌరవముగ ఆహ్వానించుటా? లేక బహిష్కరించుటా?

ఈ సందిగ్ధస్థితిలో జరిగినవి, 1920 మధ్యభాగమందలి మహానందిలోని ఆంధ్రమహాజనసభయు, కలకత్తాలోని ప్రత్యేక భారతకాంగ్రెసు సమావేశమును - ఈ సభలలో మన కథానాయకుని పాత్రగూర్చియు, తదుపరి వృత్తాంతములగూర్చియు ముందు అధ్యాయములలో జదువుదుము.

## 6. మహానంది మహాసభ.

గోపాలకృష్ణుని చరిత్రసత్తినునును, ఆంధ్రకీట్సు అని పేర్వడిన కీ. శే. బసవరాజు అప్పారావుగారు తన "ఆంధ్రరత్న ద్యుతు"లను గ్రంథమందీ మహానంది సభలగూర్చి యిట్లు వర్ణించిరి.

"సుందరోద్యాన విలసితమును, ఫుల్లపద్మాలంకార శోభిత కాసారయుతమును, వివిధ కుసుమ ఫలభరితమును నగు మహానందిక్షేత్రమున జరుగనున్న సభకు గోపాలకృష్ణుడుగూడ సపరివారుడై వచ్చుచుండెనను వార్త వినినతోడనే మితవాదులును, సంశయాత్ములును గలగుండువడిన హృదయములు కల్గినవారై వెనుకటికి అరణ్యాజ్ఞాతవాసఖేదము లనుభవించిన పేరలుక చే

రోషకషాయితనయనుడై గోగ్రహణార్థమై వచ్చిన ఫల్గుణుని దలచుకొనుచు లోలోపల గుందుచు, జంకుచు నడలసాగిరి.

"గోపాలకృష్ణుడును నార్యపద్ధతుల నవలంబించి తొల్లిటి పండితుల సంప్రదాయము ననుసరించి పాశ్చాత్యనాగరికతా చిహ్నముల నెల్ల విసర్జించి, యంగవస్త్రమును ధరించి, వేఱొక యంగవస్త్రమును భుజములపై వైచుకొని, రుద్రాక్షమాలాలంకృతుడై, చామరపాణియై, జగతి నవతరించవచ్చిన ఫాలనేత్రుడో యనునట్లుగ విశాలఫాలప్రదేశమున బెద్ద కుంకుమ తిలకమును ధరించి, మిత్రులతో నార్యధర్మముల గూర్చి ప్రసంగముల గావించుకొనుచు సభాస్థలి కరుదెంచిన నావాసము సభావిస్మయజనకమై యొప్పెను. సభాంతరాళమున నిల్చి యాతడు గంభీరవాక్యములతో యాంధ్ర విద్యాస్వరూపస్వభావములగూర్చి యుపన్యసించునప్పుడును, ముక్తకంఠముతో, సమాజవిమలోచ్ఛస్వరముతో, మహాకవి వర్ణితంబులగు పద్యరత్నములు హావభావచేష్టాసహితముగ జదువునప్పుడును సభికులెల్లరును నమందానంద భరితులై తొల్లింటి యార్యుల స్వధర్మస్వభావ స్వరూపముల స్మరణకుదెచ్చుకొని, విజాతీయ సంప్రదాయబద్ధముగు నేటి యనాగరస్థితికిని, నాస్తికతకును రోసి, భారత ధర్మోద్ధరణదీక్షాబద్ధులు కాజొచ్చిరి. ఆర్య సంప్రదాయసిద్ధమగు సనాతన విద్యాపద్ధతి నరసి విశదీకరించుటకు మహాపండితుల గొందర నుపసంఘముగ నేర్పఱచి యా సంఘమునకు గోపాలకృష్ణుని కార్యద్రష్టగ నియమించిరి.

ప్రభుత్వమువారొసగిన సంస్కరణములు నిరసనార్హములను తీర్మానమును సభికులచే నామోదింపజేసినవారిలో గోపాలకృష్ణుడు ప్రముఖుడు. జాతీయవాదుల సంఘమే నిజముగ నాంధ్రుల యభిమతమును వెలిబుచ్చగలదనియు, మితవాదసంఘము ప్రయోజనరహితమనియు గోపాలకృష్ణుడు సభికులకు బోధించి జాతీయవాదుల కక్షికి యెంతయో బలము జేకూర్చినవాడయ్యెను. యువరాజునకు స్వాగతమొసంగదగదను తీర్మానము గూర్చి మాట్లాడుచు, పంజాబున జలియన్వాలాబాగులో మన భారతీయులు హతులై మరణించుటచే భరతవర్షము సూతకమునందుండెననియు, అశుచియందున్నవారింటికి బందుగులు రాదగదనియు, వచ్చిన నుచితమర్యాద జరుగుట యసంభవమనియు బల్కిన గోపాలకృష్ణుని పలుకులు విని సభికులెల్లరమందాశ్చర్యచకితహృదయులైరి.

"మహానందీ క్షేత్రమున జరిగిన యాంధ్రమహాసభల మూలముగ గోపాలకృష్ణుని కీర్తి యాంధ్రహృదయపీఠముల సుప్రతిష్ఠితమయ్యెను. సభికులెల్లరకును హాస్యరసభరితంబును, చమత్కార విలసితంబును, శ్రావ్యతమ గానయుతమును, నపూర్వరచనా శోభితంబును, భారతసాంప్రదాయ విజ్ఞానైకబంధురంబును నగు గోపాలకృష్ణుని వాగ్ధోరణి శ్రవణపేయమై, హృదయానందకరమై, పవిత్రోద్రేకజనకమై, మహాత్కార్యప్రోత్సాహకమై యొప్పిన కతన నెల్లరకును గోపాలకృష్ణుడు

ప్రేమపాత్రుడును గౌరవపాత్రుడును నయ్యెను. ఆయేటి సభలో నెల్లరును గోపాలకృష్ణుని నామమునే యుగ్గడింపసాగిరి. "గోపాల కృష్ణయ్యకు జై!" యను కేకలు సభాంతరాళమున మిన్నుముట్ట జొచ్చెను, గోపాలకృష్ణుడు సభికులచే నేకగ్రీవముగ నాంధ్ర మహాజనసభా కార్యదర్శిగ నెన్నుకొనబడెను.

"కాని యసూయాపరులగు యాతని విరోధులు కొంద ఱాతని కబ్బిన కీర్తికి నీసుజెంది, భారతసంప్రదాయ విజ్ఞాన శూన్యులగుటచే నాతని భావౌన్నత్యమును గ్రహింపజాలక తమ యజ్ఞానమును, నాస్తికత్వమును దేలపడ, నతనిగూర్చి "సుంకరకొండాయి'' యని అసభ్యముగ బల్కిరి. గోపాలకృష్ణు డందులకు వెంటనే యాశువుగ

క. బింకాలుబల్కు బందరు
కుంకలఘీంకారమెల్ల గీడ్వడ సేయున్
శంకరుడె మహానందిని
సుంకర కొండయుగ వెలసె చోద్యముగాదే॥

యని సమాధానమొసంగెను.

"ఇట్లు సురక్షితుడై, కీర్తికాముడై, నిర్భయుడై గోపాల కృష్ణుడు దేశసేవ జేయుటకును, నిజమనోరథసిద్ధి నొందుటకును, ప్రయత్నింపదొడగెను. జాతీయవిద్యావిధానము నరసి నివేదిక సమర్పించుట కేర్పరుపబడిన పండితులతో గోపాలకృష్ణు డుత్తర ప్రత్యుత్తరముల నల్పుచుండెను. కట్టమంచి రామలింగారెడ్డి,

కల్లూరు వెంకట్రామశాస్త్రి, సర్వేపల్లి రాధాకృష్ణయ్య, కోపల్లె హనుమంతరావుగార్లు మొదలగు పండితుల యభిప్రాయముల నరసి గైకొనుచు, తానుగూడ ననుకూలమగు విద్యావిధానము గూర్చి తీవ్రముగ నాలోచింపసాగెను. తదాలోచనా ఫలిత ముగ నతడొక విద్యావద్ధతిని సిద్ధపరచి, దాని నాచరణకు దెచ్చుటకై చీరాల పరిసరప్రాంతములందొక "విద్యాపీఠము" నెలకొల్ప నెంచెను. అచ్చటికి నతిదూరమున శ్రీరామనగరమను పేరిట నొక నగరమును స్థాపించి, ఆంధ్రవిద్యాపీఠగోష్ఠి యను నొక సంఘము నేర్పరచి రిజిస్టరు చేయించెను."

ఇందు గోపాలకృష్ణుని విద్యాగోష్ఠిగూర్చి మున్ముందు జదువుదుము. కాని పైజెప్పిన "సుంకరకొండయ"విషయమించుక బ్రస్తావించుట యిచ్చట అవసరము. ఇతరులాతని "సుంకర కొండయ" యని గేలిసేయగ అందుకు సమాధానముగ తాను మహానందిని వెలసిన శంకరుని అవరావతారమని చెప్పుకొనెను.

గోపాలకృష్ణుని జీవితచరిత్ర దృష్ట్యాయిదెంతయు సమం జస మని తోచును. ఏలయన, లోగడ మన దేశమందలి బౌద్ధ సంప్రదాయములను ఛేదించి, తిరిగి బ్రాహ్మణధర్మమును పున రుద్ధరించిన ఆదిశంకరులకు బిమ్మట

సంకరమయమైన యీ ప్రపంచముకెల్ల
శంకరమతము నిప్పించువాడు!

అన్నటుల, నేటి అబ్రాహ్మణ ప్రపంచమునంతను తిరిగిబ్రహ్మ

న్ముఖము గావించుటయే మన కథానాయకుని జీవితాశయముగ బరిణమించెను. ఇట్టి ధర్మోద్ధరణకై పీరుభయులు అవలంబించిన మార్గమును సమన్వయమార్గము. ఆదిశంకరులు బౌద్ధము నణచుటకు శ్రీకృష్ణునికి బిమ్మట బుద్ధుని తొమ్మిదవ అవతారముగ నంగీకరించెను. ఇటులనే గోపాలకృష్ణుడును హిందూముసల్మాన్ క్రైస్తవ సమ్మేళనకొఱకు బుద్ధుని యనంతరము క్రైస్తు, మహమ్మదులను మరి రెండవతారములుగ నొనర్చి, మన అష్టాదశ పురాణములకు దోడుగ బైబిల్, ఖురానులను మరి రెండు పురాణములుగ జేసివైచెను.

ఈ కారణముచే గోపాలకృష్ణుడు తాను మహానందిని వెలసిన శంకరుడనే యని చెప్పుకొనుట సమయస్ఫూర్తి నేకాక, పాత్రౌచిత్యమునుగూడ సూచించుచున్నది.

## 7. జాతీయవిద్య.

మన దేశములో స్వరాజోద్యమముతో బాటు జాతీయ విద్యావ్యాప్తికై పలుచోట్ల పలుయత్నములు జరిగినట్లును అందుకొఱకొక నిర్దిష్టమగు విధానము నేర్పరచుటకై గోపాలకృష్ణుని ప్రోత్సాహముచే మహానందిసభలో నొక ఉపసంఘమేర్పడుటయుగూర్చి గత అధ్యాయమందు జదివితిమి. తదనుగుణ్యముగ గోపాలకృష్ణుడొక విధానమును సిద్ధపరచెనని యమనము చదివితిమి. ఇందలి విషయప్రాశస్త్యముచే యీ విధానమిచ్చుట బొందుపరచబడినది.

గోపాలకృష్ణుని విధానమందు విద్యాశిక్షణ బాలశిక్ష, పెద్దబాలశిక్ష, విద్వద్భాగములను మూడు భాగములు. ఆయా భాగములందలి బాలకుల గుణగణములు, అధికారవివేచనము, శిక్షాక్రమములగూర్చి యాతడిట్లు నిరూపించెను.

ఉపనయనము :— బాలకుని సంప్రదాయానుసరణముగ ఉపనయనకర్మ నాచరింపజేసి, తదనుగుణమగు మంత్రోపదేశము జేసి, ఆసమయముననే గురుసత్కారమొనరించి, బాలకుని విద్యాశాలయందు బ్రవేశపెట్టవలయును. బాలకుని యీ క్రింది వివరము లుపనయనకాలమందు చక్కగ దెలిసికొనవలెను. (౧) కులగోత్రములు; (౨) కులదైవము; (3) వృత్తి; (౪) జాతకము; (౫) బాలకుని శిక్షాపరిమితిగూర్చి తలిదండ్రుల యభిప్రాయము. ఈ పై వివరముల ననుసరించి ఉపనయనసమయమున బాలునికొక దీక్షారూపమును బ్రసాదింపవలెను. బాలకుడు నిరుపేదకుటుంబమునకు జెందియున్నచో ఉపాధ్యాయుడు తలిదండ్రుల యనుమతిబడసి యాతని తనగృహమునందే యుంచుకొని అన్నవస్త్రములకు తగు వసతినేర్పరుపవలెను. అట్టి బాలకుని తనపుత్రులమాడ్కి చూచుకొనుచు దగు పోషణ జరుపవలెను. ఉపాధ్యాయులందునిమిత్తమై తమగృహనిర్మాణములందు తగు వీళ్ల నేర్పాటుచేసుకొనవలెను. బాలశిక్షకుపనీతు డగుటకు బాలకుడు జడస్వభావమును సంపూర్ణముగ వదలి అహంకారోదయమైన సమయముననే యర్హుడుకాని (కేవలము వయో

విచారమే యాధారముగ నుండకూడదు. ఇంతులకాధార ములకై "మనుస్మృతి" యందలి బ్రహ్మచర్య ప్రకరణము జూచునది. ఇది యుపాధ్యాయులుమాత్రమే నిర్ణయింప నర్హులు.

బాలశిక్ష :- గుణకర్మ విభాగమునననుసరించి యధికార నిర్ణయ మొనర్పవలయును. ఇదియే బాలకుని స్వరూపస్వభావ నిర్ణయము. దీనిబట్టి ముఖ్యముగ నైదు తరగతు లేర్పడును. సత్త్వవృత్తి ప్రధానముగా గలవారును, రజోవృత్తి ప్రధాన ముగా గలవారును, తమోవృత్తి ప్రధానముగా గలవారును, స ము లు ను, మి శ్రు లు ను, ఇ ం దు స ము లు చా ల అ రు దు గ ను ం దు రు. ఈవృత్తిత్రయము సమవిభక్తమై సమానప్రతిభ కలిగి యెవ్వరియందు వర్తించునో వారు సములు. అట్టివారుండుట దుర్లభము. లభించినచో దైవసమానులగుటచే సామాన్య శిక్షామార్గములు వారియెడ వ్యర్థములు. కావున సామాన్యముగ నాలుగు గణములు మాత్రమేర్పడును:- సత్త్వ గణము, రజోగణము, తమోగణము, మిశ్రగణము. ఈ నాలు గును నాలుగు తరగతులపేర్లు.

"గణమునకు ముప్పదిమంది బాలకులును, ఒక యుపా ధ్యాయుడును నుందురు. ఈ వివిధవృత్తుల లక్ష్యలక్షణజ్ఞానము సంపూర్ణముగ గల్గి యే వృత్తియందు ప్రత్యేకముగ నభిమాన మెవ్వరికిగలదో వారే యాగణమున కుపాధ్యాయపదవినలంకరింప నర్హులు. మిశ్రగణమున కుపాధ్యాయుపదవిని వహింప వృత్తి

త్రియమునందు సమప్రతిభగలవారే యుస్తాలు.

"ఒక్కొక్క గణమందు మూడు శ్రేణు లేర్పడును. వర్షా రంభమున నుపనీతులైన బాలకులు ప్రథమ శ్రేణివారు. ద్వితీయ వర్ష శిక్షనొందువారు ద్వితీయ శ్రేణివారు. ఇట్లే తృతీయ శ్రేణి వారును. ఈమూడు శ్రేణులందును శ్రేణికి బదిమంది వంతున ముప్పదిమంది బాలకులు ఒక యుపాధ్యాయుని క్రిందనుందురు. ఈ మూడు శ్రేణులకును ఉపాధ్యాయు డొక్కడే కావున శిక్షా విషయములకు వేర్వేరు ఉపాధ్యాయుల నేర్పరచు ప్రస్తుతా చార మనుష్ఠింపదగదు. ఒక్కొక్క గణమునకు బాలకులు ముప్పదిమందికి మించినచో నింకొక ఉపాధ్యాయుని నియ మింప వలెను.

"ఈ గుణవిభాగమునకు మూడంశము లాధారభూత ములు. (౧) బాలకుని కులగోత్ర సంప్రదాయములు; (౨) జాత కము; (3) అనుభవము. మొదటి రెండును బాలకుని స్వభా వము నిదమిత్థమని నిర్ధారణ చేయజాలవుకాని సూచించు ననుటమాత్రము నిజము. ఈ సూచననుబట్టియే అనుభవము నడచును. అనుభవమునకు సిద్ధాంతాధికారమున్నది. దీనినే వృత్తిదర్శనమందు ముఖ్యముగ వివరింపవలసియున్నది. బాల కుని దినచర్యయందు జ్ఞానేంద్రియ కర్మేంద్రియ వ్యాపారాను మితములైన బాలకుని యభిలాషము నభిమతమును తత్స్వభావ నిర్ణయమునకు మార్గదర్శకములు. సిద్ధాంతమీ మూడింటి సమ

స్వాయముగ నుండును. గురుకులవాసము జేయు బాలకుల స్వభావము నిర్ణయించుట యుపాధ్యాయులకు సులభసాధ్యము. లేని యెడల తలిదండ్రుల సహాయమపేక్షింపవలయును. స్వభావ పరిజ్ఞానమునకై యవసరమగువట్లు తగు సందర్భముల గల్పించి బాలకుని చిత్తవృత్తి సాంగోపాంగముగ దెలిసికొనవలయును. ఈ స్వభావనిర్ణయ ముపనీతుడైన యారుమాసములకు మించని కాలమున జరుగవలయును. అంతవరకు కులగోత్రసంప్రదాయ జాతకాదుల సూచనల నాధారముజేసికొని శిక్షాక్రమమును నిర్వర్తింపవలయును.

పెద్దబాలశిక్ష :- ఇందు గణములు నాలుగైనను ఒక్కొక్క గణమునకు శిక్షాకాలము నాలుగేండ్లు కావున శ్రేణులు నాలుగేసియుండును. కావున గణముయొక్క నియమిత సంఖ్య నలుబది. ఇతరవిషయములందు బాలశిక్షకువలెనే యధికారవివేచనమార్గ మన్వయించును.

"విద్వద్భాగము :- విద్యార్థికి ఉపనయనకాలమందే స్వభావముసిద్ధాంతమగును. అదియునుగాక విద్యార్థియొక్క శిక్షాక్రమము బాలశిక్ష, పెద్దబాలశిక్షలయొక్క శిక్షాపద్ధతికి భిన్నమగుటచే గణవిభాగము, శ్రేణివిభాగము లిందు వర్తింపవు. విద్వద్భాగమున శిక్షావిషయముల నొక్కొక్కదానికినొక్కొక యాశ్రమ మేర్పడుటయు, తదాశ్రమాధిపతులు సర్వస్వభావ ప్రభుత్వము గలవారగుటయు, అధికార వివేచనము సులభసాధ్యము.

"ఈ గణవిభాగము ప్రస్తుతము ఆచారమునందున్న శిక్షాక్రమమునకు భిన్నమగుటయు, ప్రస్తుత ముపాధ్యాయ పదవులం దున్నవారలకీ పద్ధతి యొకింత యర్వాచీనముగను, విలక్షణముగను నుండుటచే యీగణములయొక్క లక్ష్య లక్షణ సంబంధము స్థాలీపులాకన్యాయముగ, దృష్టాంత పురస్సరముగ నిట క్లుప్తముగ వర్ణింపబడుచున్నది.

"సత్త్వగణము:- శృంగార, కరుణా, శాంతరస విష్ణులగు వారిందు జేర్చబడుదురు. అనగా విద్యాబోధకులు, మతబోధకులు, న్యాయస్థానములందు బనిచేయువారు, మంత్రులు, అమాత్యులు, వైద్యులు, వేదశాస్త్రములందు శ్రవణ మనన నాదులు గలవారియొక్క భావపరంపర శాంతిరసపోషకములగు వ్యాపారములందే సంచరించుచుండును. కావున బోధనావిషయములు వారి కనువగునట్లు కూర్పవలయును. ఇందుజేరు బాలకుల చిత్తవృత్తు లెవ్వియన :-

"ఆహారము : కారము తక్కువగల పదార్థములు, మిత భోజనము, చిరుతిండియందు విముఖత, కందమూలఫలాదులందు బ్రీతి, ఉల్లిపాయ మున్నగు నిషిద్ధవస్తువులయందు విముఖత;

"వ్యవహారము : వినయవిధేయత లక్షితముగనే వెలువడుట; డంబము లేకుండుట; వేషభాషలందు శిష్టమార్గమం దాదరణ, అవాచాలత్వము, త్యాగశీలత మొదలగునవి.

"నిద్ర : మితముగ నిద్రించుట, సకాలమున మేల్కాం

చుట, పగలు నిద్రింపకుండుట మొదలగునవి అశిక్షితముగ నెలువడుట".

"వీని ననుసరించి బాలుని నేగణమునందు జేర్పవలయునో యెఱుంగునది."

"ఉపాసన ఇష్టదేవతలు : గౌరీశంకరులు, లక్ష్మీనారాయణులు, సీతారాములు, సరస్వతి, ఇత్యాది ప్రసన్నరూపములు.

"రజోగణము :- శృంగార, వీర, కరుణా, హాస్య, కాద్రి రసపోషకములగు వ్యాపారములయం దాదరణగలవారి నీగణమందు జేర్పవలయును. క్షాత్రకర్మ, పరిపాలనాపేక్ష, సంగీతసాహిత్యనాట్యాది కళాకలాపము, వినోదక్రీడలయందత్యంతాభిరుచి, రూపకల్పనయందు, అనగా సంగీత, సాహిత్య, చిత్రలేఖన, శిలా, దారు, తక్షశిల్ప, నాట్యాదిమార్గములయందు సంచరించువా రిందుండ నర్హులు. బోధనాపద్ధతులలో యే తద్రస ప్రధానవిషయము లు నేర్పవలయును.

"ఇందు జేర్పబడు బాలకుల చిత్తవృత్తు లెవ్వియన :-

ఆహారము : షడ్రసోపేతమైన భోజనము, చిఱుతిండియందు కాంక్ష, భోజనవస్తువులయందు విశేషశ్రద్ధ, మద్యమాంసాదులయందు కోర్కె మున్నగునవి.

"వ్యవహారము : వినయవిధేయతలు శిక్షితముగ నలవడుట; డంబముగలిగియుండుట; దర్పముజూపుట; వేషభాషలందు నూతనప్రియత్వము; వాచాలత్వము గలిగియుండుట; ఆట

పాటలయందెక్కువ శ్రద్ధ; శక్తులు, ప్రతిజ్ఞలను మొండుగ నాద రించుట; ధైర్యోత్సాహసాహసము లమితముగ గలిగియుండుట; దానధర్మములయందు తెగువ; ఆర్తత్రాణపరాయణత్వము.

నిద్ర : నియమరహితమైన నిద్ర, భోగాపేక్ష.

"ఉపాసన : కోదండరాములు, నటరాజు, కృష్ణుడు, ఇత్యాది లీలారూపములు.

"తమోగణము : శృంగార, హాస్య, రౌద్ర, భీభత్స, భయానక రసపోషకములగు వ్యాపారములయందాదరణ గల వారి నీగణమందు జేర్పవలయును. ఇందు శస్త్రకర్మ, వ్యవసాయము, వణిగ్వృత్తి, పాశుపాల్యము, వస్తుకల్పము, అనగా స్వర్ణకారవృత్తి, వడ్రంగము, నేత, పాత్రనిర్మాణవృత్తి, మొదలైన మార్గములందు సంచరించువారిందుండ నర్హులు. బోధనా పద్ధతులలో యే తద్రసప్రధానములగు విషయములు నేర్పవల యును. ఇందు జేర్పబడు బాలకుల చిత్తవృత్తు లెట్టివనగా :-

"ఆహారము : మద్యపాన మాంసాది భోజనము.

"వ్యవహారము : కృపణత్వము వైరము, వేషభాషలందు సాధారణ పరాధీనత మొదలగునవి.

"నిద్ర : భోగాపేక్ష లేకుండుట, మితనిద్ర.

"ఉపాసన : కాళి, నరసింహ, మహిషాసురమర్దని, ఇత్యాది బీభత్సరూపములు.

"మిశ్రగణము :- రసాభాసవ్యాపారములయందాదరణ

గలవారిందు జేర్పబడవలయును. వీరు ప్రస్తుతమిట్లున్నను, సాధనచే నితర గణములయందు జేర సర్హులగుదురు. సత్వరజస్తమోగుణములయందేదైన ప్రాధాన్యము వస్తుతః కలవారు గణాంతరములలోనికి మార్పు జేయబడ నేరరు. గుణప్రాధాన్యము వస్తుతః కనబడక, గుణమాంద్యముగలవారు సాధనచే గుణప్రాధాన్యము బొందగలరు. భటవృత్తి, గౌండ్ల, కుమ్మరివృత్తులు, అంబష్ఠవృత్తి, రజకవృత్తి, చర్మకారవృత్తి మొదలగు వృత్తులయందుండువారు మిశ్రగణమునకు జెందుదురు. బోధనావిషయములందు రసపిపాసకులనుగ జేయునవి వీరికి నేర్పవలయును. ఇందు జేర్పబడు బాలుర చిత్తవృత్తు లెవ్వియన :-

"ఆహారము : మద్యపాన మాంసాదిభోజనము, అమితత్వము, నిషిద్ధవస్తువులందు విధినిషేధములు లేకుండుట మొదలగునవి

"వ్యవహారము : దైన్యము, అతిసాహసము, భయము, క్రూరస్వభావము, స్వార్థపరత్వము మొదలగునవి.

"నిద్ర : అతినిద్ర, భోగరాహిత్యము.

"ఉపాసన: క్షుద్రదేవతలు, పాము తేలుమంత్రములు వగైరా.

"ఈ సత్వరజస్తమోగణములలో ఉత్తమమధ్యమాధమాది వివక్షత తప్పు, నిరర్థకమునునగును. అట్లు భావించుటవలన గీతావాక్యానుసారమైన స్వధర్మానుష్ఠానమునకు భంగము వాటిల్లును. వృత్తిభేదము మార్గభేద నిరూపణ గావించు నే కాని వేరొండు కాదు.

"ప్రతి వ్యక్తియందు నీ మూడుగుణములును నుండును. అందెద్దియో యొకటి ప్రాధాన్యత వహించును. అదియే యాతని జీవితమార్గముయొక్క వైలక్షణ్యమును సూచించును. సత్త్వ గుణ ప్రధానులకు జ్ఞానమార్గమును, రజోగుణప్రధానులకు భక్తిమార్గమును, తమోగుణ ప్రధానులకు కర్మమార్గమును అనుష్ఠేయములు."

## 8. విద్యాపీఠ గోష్ఠి.

1920 లో గోపాలకృష్ణుడు విద్యాభివృద్ధికై సంకల్పించిన సంస్థ శ్రీ మదాంధ్ర విద్యాపీఠగోష్ఠి. ఈగోష్ఠి యుద్దేశ్యములు మూడు.

" (అ) సనాతనమార్గానుసారముగ విద్యానుష్ఠానము జరుపుటకు ఆంధ్రదేశమున "విద్యాపీఠ" మను పేర విశ్వవిద్యాలయ రూపమగు నొక ప్రధాన ప్రతిష్ఠాపనమును నెలకొల్పుట;

" (ఆ) విద్యావ్యాప్తికై తత్ప్రతానుబంధములుగ వివిధాంధ్ర మండలముల వీలు వెంబడి అనేక ఆశ్రమపరంపరలు నిర్మించుట;

" (ఇ) ఆంధ్రప్రజలందు సద్విద్యావ్యాపనమును, సన్మార్గ జీవనమును వృద్ధినొందించుట కావశ్యకములగు సమస్తసాధన మార్గముల ననుష్ఠించుట."

ఇందు పండితులు, పోషకులు, సాధకులను మూడు తెరగతుల సభ్యులుందురు. గోష్ఠికిజెందిన ప్రతిష్ఠాపనములందు వది

సంవత్సరములకు దక్షిణ కాల సేవ చేయ కృతనిశ్చయు లగు వారు పండితులు. గోష్ఠీసంఘమునకు భూదానాది ద్రవ్య సహాయమునొసర్చి గోష్ఠీప్రతిష్ఠాపనములను బోషించువారు పోషకులు. ఇందలి విద్యార్థిబృందమెల్లరును సాధకులు. ఈ సంఘమున కొక వ్యవహారసభయు, విచారణకర్తయు నుందురు. సభ్యులెల్లరు నేకగ్రీవముగ నెన్నుకొన్నచో విద్యాపీఠమున కొక అధ్యక్షుడు నుండును.

గోష్ఠీసమావేశములు యేడాదికి కనీసము రెండైనను జరుగవలయును. గోష్ఠి పర్యవసానముల నేటేట బ్రచురింప వచ్చును.

గోపాలకృష్ణుని సంకల్పానుసారము గోష్ఠికి ముప్పది యకరముల గ్రామకంఠమును, నూరు యకరముల సాగుభూమియు నుండవలయును. గ్రామకంఠమున నొక దేవాలయమును, విద్యాలయము, గ్రంథాలయము, ముద్రణాలయము, సత్రము, గృహాసదుపాయములుండవలెను. ఇందు పదిపంద్రెండు కుటుంబములకు తావుండును.

1920 లో గోపాలకృష్ణుడీ సంఘమును స్థాపించిన సమయమున చీరాల సమీపమున కొన్ని పొలములకై యాతడు ప్రభుత్వము నాశ్రయించెను. మొట్టమొదట ప్రభుత్వ మాతనికి ఏభైయెనిమిది యకరముల భూమినొసంగెను. కాని అంతలో గాంధీమహాత్ముడు విజయవాడ కేతెంచుటయు, గోపాలకృష్ణు

డచ్చటకు బోయి యా మహాత్ముని యుపన్యాసమును తర్జుమా చేయుటచే మొదటి యుత్తరువు వచ్చిన నాలుగురోజులలోనే యా ఉత్తరువు రద్దు చేయబడెను. ఆ పొలమునకు మారుగ చీరాల పేరాల పౌరులు పేరాలనానుకొన్న పందొమ్మిది యకరముల స్థలము నాతనికొసంగిరి. అంతతో గోష్ఠిసంఘ మారంభమయ్యెను. అచ్చట శ్రీరామచంద్రుని పేరిట శ్రీరామనగరమను పేరిట నొక గ్రామము సంకల్పింపబడెను. ఈ గ్రామమునకు తదుపరి గాంధీమహాత్ములే శంకుస్థాపన యొనర్చిరి. కాని యచిరకాలముననే యిచ్చట వీచిన రాజకీయ వాయువులలో దేశమంతయు నుఱ్ఱూతలూగుటయు, అందు చీరాల పేరాల యుద్యమమునకు గోపాలకృష్ణుడు ప్రధాననాయకుడగుటచే, గోష్ఠియత్నములు వెనుకబడి బోయెను.

గోపాలకృష్ణుడు కాంగ్రెసునాయకుఁడై యా మహాసంస్థ ద్వారా దేశమున కెక్కుడు సేవ జేసినను, ఆతని మనోగోళమున యెల్లప్పుడును తాండవించిన సంస్థ యీ గోష్ఠియే అగుటచే, యిందుకై ఆతడు చేసిన యత్నముల నిచ్చట క్రోడీకరించుట యుక్తము.

1922 లో జైలునుండి విడుదలకాగానే ఆతడిటుల నుడివెను. "శ్రీ గాయత్రీమంత్రోపదేశముచే నే నెల్లరకు ద్విజత్వము నొసంగ సంకల్పించితిని. ప్రతి గ్రామమునందొక బ్రాహ్మణ గోష్ఠి నెలకొల్పెదను. ఇందు జేరువారెల్లరు బ్రాహ్మణులుగ నెంచబడుదురు. ప్రతి గోష్ఠియు నొక విద్యాలయమును, వైద్యాలయమును నెలకొల్పవలెను. వానికనుబంధముగ నొక గ్రంథాలయమును, సహకారసంఘము, పంచాయతీకోర్టును స్థాపింప

వచ్చును. వీనిమూలముగ గోష్ఠికి గ్రామపాలనాధికారము సిద్ధింపగలదు. ప్రతి గ్రామము నీవిధముగ బలపడినచో సంఘీభావము కరతలామలకమై స్వరాజ్యము సుసాధ్యమగును."

(బందరు ఉపన్యాసము.)

**7-3-25** న రామనగరులో శ్రీరామచంద్రుని పేరిట నొక శివాలయము, నొక విష్ణాలయములకు శంకుస్థాపనయొనర్చి యాంతడిట్లు వ్రాసెను. "ఈరీతిగ మన విద్యాపీఠగోష్ఠి ప్రారంభమగును. ఇది గాంధీశకమునకు బూర్వమే నా మనోసీమల సంకురించెను. కాని యింతవరకీ రామనగరు యిసుకలలోమాత్రమే దాగియుండెను. ఇప్పుడీ పనికి నాకు కొంచెము సావకాశము చిక్కినది. ఎన్ని చిక్కులువచ్చినను నే నీ పనిజేయుటకు కృతనిశ్చయుడనైతిని. నవీనులకీ పద్ధతి ఆశ్చర్యజనకముగ నుండవచ్చును. కాని నామతములో గ్రామమునకు విగ్రహము లే ప్రథమపౌరులు—గోష్ఠిలో ప్రథమసభ్యులును, విగ్రహమేమన యాదర్శములకు మూర్తి."

గోష్ఠిసమావేశములగూర్చి చర్చించుచు 1925 ఏప్రిల్‌లో నీతడిటుల వ్రాసెను. "ప్రతినెలయు కొలది దినములు మనము రామనగరులో నేలకలియరాదు? అచ్చట మన అన్యోన్యానుభవములగూర్చి సంప్రదించుకొనవచ్చును. ఇది కేవలము ఆరిస్టాటిల్ (వేదాంత) పద్ధతి కాకపోయినను కనీసము పిక్‌నికియన్ (ఖులాసా)గనైన నుండునుగదా! మరికొందరనుగూడ మనము పిలువవచ్చును. వారు మూతిబిగింపుడుగాళ్ళు కాకుండా, రసజ్ఞులై, ఉత్సాహపూరితులై యుండవలెను. ధనవంతులు కాకపోయినను సరే. మనకు పోషకులనవసరము. సహాధ్యా

యులులైన జాలును. ఇచ్చోటి సంభాషణలను మనము గ్రంథస్తముగూడ చేయవచ్చును. ఇదియే నిజమగుగోష్ఠి"

(శ్రీ జి. వి. సుబ్బారావుగారికి వ్రాసిన లేఖలనుండి.)

మరి రెండుమాసములకు బిమ్మట యాతడిట్టుల వ్రాసెను. "గోష్ఠికి ప్రతి నెలయు పౌర్ణమికి సామీప్యమగు భానువారము తగినరోజు. ఇందు మొట్టమొదట అయిదార్గురు సభ్యులు చాలును. వీరు (1) భావరాగములందొక స్థాయిగలిగి, (2) జీవితమందొక ఉత్తమాదర్శమునకు బద్ధకంకణులై, (3) ఏతల్లక్ష్యసాధనయందు వలయు స్వాతంత్ర్యముతో నడచుకొనగల వారై యుండవలెను. నిరాశాపరులకిందు తావులేదు. సత్సంకల్పులగు యువకులీగోష్ఠికి అమూల్యము. ధనోన్మత్తులను, గర్విష్ఠులను దీనినుండి దూరముగ నుంచుట మంచిది."

(శ్రీ జి. వి. సుబ్బారావుగారికి వ్రాసిన లేఖలనుండి.)

1927 జనవరిలో తన నిజబ్రాహ్మణగోష్ఠి నుద్దేశించి గోపాలకృష్ణుడీ క్రింది లక్ష్య లక్షణములను నిరూపించెను.

"**లక్ష్యము:**— (౧) 'తత్త్వమసి', 'అహంబ్రహ్మాస్మి', 'సర్వం ఖల్విదం బ్రహ్మ', ఇత్యాది అద్వైత ప్రతిపాదితములగు శ్రుతులు మాత్రము పరమార్థములుగను, ధర్మనిర్ణయాదుల యందు సహితము పరమప్రమాణములుగను అంగీకరించుటయు, నమ్ముటయు, తన్నియమితములగు మార్గముల ననుసరించియే వ్యావహారిక పారమార్థిక వ్యవస్థలన్నిటియందును తమ జీవయాత్రను నడిపింప, సాధింప, కృతనిశ్చయులై యుండుట;

(౨) బ్రహ్మజ్ఞానాన్వేషణము, బ్రహ్మపదార్థసాధనము, తమజీవితమందు సర్వావస్థలయందును ప్రధానలక్ష్యముగ నంగీక

రించి, సమస్తమైనవృత్తులను యిందు సమన్వయము జేసి, నడచు కొనువారగుచు, బ్రాహ్మణసంజ్ఞను స్వీకరించి, అట్టిదీక్షను గ్రహించి, జీవయాత్రను సాగించుట.

"లక్షణము :— (౧) ఈ పైనుదహరింపబడిన లక్ష్యము నంగీకరించి బ్రాహ్మణదీక్షను బూనిన బ్రాహ్మణులు పది మందికి తక్కువ లేకుండా నొక గోష్ఠి నేర్పరచుకొనుచు, తమ తమ జీవితములు తద్ధర్మానుష్ఠానముగ జరిగించుకొనుట;

(౨) ఈ లక్ష్యలక్షణములను యథాశక్తి తమ సోదర ప్రజలకు విన్నవించుచు, యీ బ్రాహ్మణధర్మమును లేక మతమును వారియందు వ్యాప్తిచేయుచుండుట."

ఇట్టి లక్ష్య లక్షణములతో కొందరు బ్రాహ్మణేతరులనబడినవారితోసహా యిరవైనలుగురకు ఆహ్వానములబంపి, వారి సమ్మతితో మొదటి బ్రాహ్మణగోష్ఠి నేర్పరుపవలెనని యాతడాశించెను. కాని యింతలో శరీరరుగ్మతచే వెంటనే మరియొక్క ఉత్తరువు జారీకాబడెను. "మనగోష్ఠి విషయమై లోగడ ఉత్తరమును మార్చవలెనని యున్నది. బ్రాహ్మణస్మృతియను పేరిటనే నొక నూతన (సాంఘిక) సూత్రమును నివేదించ దలచితిననియు; ఈ సూత్రము నంగీకరించువారితోగూడిన గోష్ఠి నెలకొల్పుదమనియు మాత్రమే వ్రాయవలెనని యున్నది. ఆహ్వానపత్రము ముందు వ్రాసిపంపుదును. ఇంకను ఆరోగ్యమేమియు బాగులేదు."

(శ్రీ జి. వి. సుబ్బారావు గారికి వ్రాసిన లేఖలనుండి.)

కాని గోష్ఠి యనగా నేమి?

భారత సాంప్రదాయమున "గోష్ఠి" శబ్దము శిష్టులగువా

కెల్లరకు సువిదితమైనది. ఆంధ్రభారతమున యీ ప్రయోగము పలుతావుల గానవగును. స్త్రీపర్వమందు "సుఖగోష్ఠి"యనియు, ఆనుశాసనికమున.

సీ. .........హిమగిరిమీద మునీంద్రులు కూడి
గోష్ఠిసుఖంబు।
ననుభవింపగ లీలనచ్చటికి వచ్చి సువర్ణుండు వారికి బ్ర
ణతుడగుడు।
వారభినందించి గౌరవంబున సుఖాసీనుగావించి
యర్చించి ప్రీతి।
నతనితో సల్లాపమాచరించుచునుండ......(1.346)

యని మునులగోష్ఠి వర్ణింపబడినది.

తే. గీ. .........నీతోడి గోష్ఠికి నర్థిపుట్టి।
యరుగుదెంచితి తమ్ముడా!.........(4.170).

యనియు; "పుణ్యగోష్ఠి" యనియు (4.397). "సద్గోష్ఠి"యనియు (అశ్వమేధపర్వము, 2.11); "విశిష్టగోష్ఠి" యనియు (270); "గోష్ఠినిరతి" యనియు (ఆనుశాసనికము, 2.38); చాలచోట్ల గానవగును. "నాస్తికగోష్ఠిజనమి"యని అరణ్యపర్వము (5.44). శ్రీ గాయత్రీసహస్రనామస్తోత్రమందు వరాశక్తికి "గోష్ఠి" యని నామముకలదు. ఈ కాలమునగూడ "ఇష్టాగోష్ఠి" యనియు, "విద్వద్గోష్ఠి", "గానగోష్ఠి" "నాట్యగోష్ఠి" "పండితగోష్ఠి" "రైతాంగగోష్ఠి" కార్మికగోష్ఠి" "విద్యార్థిగోష్ఠి", తుదకు "సినిమాగోష్ఠి" యనియు మనము వినుచున్నాము.

'గోష్ఠి' శబ్దము—గావః నానావిధా వాచః, తిష్ఠంతీత్యత్ర గోష్ఠీ—నానావిధవాక్కులుండునది గావున గోష్ఠియని నిర్వచనము.

శ్రీకృష్ణుడు గోష్ఠపాలకుడగుటయు, గోపాలకృష్ణుడీగోష్ఠీస్థాపకుడగుటయు ఈపదమెంతయు సమంజసముగనున్నది. ఇంతియగాక, శ్రీకృష్ణుడీ యుగమందు జగద్రక్షకుడగుటయు, ఇచ్చటిజీవులు కలియుగాంతమువరకు ఆతని 'గోష్ఠ'మందే మసలవలయు గావునను, పాశ్చాత్య సాంప్రదాయమునగూడ జీవులు గొఱ్ఱెలగుటయు, క్రీస్తు కాపరియగుటయుచే ఈ 'గోష్ఠి' శబ్ద మీ యుగమందు సర్వమానవ సంరక్షకమును, ముక్తిదాయము నగుచున్నది.

శ్రీరామకర్ణామృతమందంతర్భాగమును, గోపాలకృష్ణుని నిజసంకల్పముల కాదర్శప్రాయము నగు యీ దిగువ శ్లోకముతో యీ గోష్ఠి ప్రశంసను ముగింతము.

శ్లో॥ మార్గే మార్గే శాఖినాం రత్న వేదీ
వేద్యాం వేద్యాం కిన్నరీ బృందగీతమ్।
గీతే గీతే మంజులాలాప గోష్ఠి
గోష్ఠ్యాం గోష్ఠ్యాం తత్కథారామచంద్ర॥

## 9. చీరాల పేరాల.

భారతదేశమం దిటీవల జరిగిన రాజకీయ ఘట్టములలో చీరాల పేరాల ముఖ్యమైనది.

చీరాల పేరాల గ్రామములు ఆంధ్రసముద్రమునకు నాలుగు మైళ్ళలోనున్న రెండు గ్రామములు. ఇవి యొకటితో నొకటి కలిసియుండును. ఈ గ్రామములకు చేరువలో జాండ్రపేట, పాతచీరాల, వీరరాఘవపేట, యను గ్రామములు కూడ కలవు. ఈ యైదూళ్ళజనాభా మొత్తంమీద 18 వేలుండెడిది. చీరాల పేరాల గ్రామములను ప్రభుత్వమువారు గుంటూరు

జిల్లాబోర్డు యాధీనమున నొక యూనియను గావించిరి. ఈ యూనియనువారే గ్రామములందలి బజులు, దీపములు, ఆరోగ్యము పరిపాలించుచుండిరి. యూనియనుకు సాలుకి అయిదువేల రూప్యముల పన్ను వసూలయ్యెడిది. చీరాలలోని మిషన్ ఆస్పత్రి; లోకల్ ఫండ్ ఆస్పత్రులవల్ల వైద్యవిషయమును, గ్రామీయులు నెలకొల్పుకొన్న ప్రైవేటు బడులవల్ల విద్యాసమస్యయు; జిల్లాబోర్డు సహాయముచే రోడ్లను, కొంతవరకు కడతేరుచు, మితవ్యయములో గ్రామపాలనా వ్యవహారమంతయు సుళువుగా సాగుచుండెడిది.

ఇట్లుండగా 1914 లో గుంటూరుజిల్లాలో ప్లేగుజాడ్యము బయలుదేరి. చీరాలకుగూడ వ్యాపించి, కొలదిగ ప్రాణనష్టము గల్గించెను. తత్కారణమున ఆరోగ్యశాఖాధికారి సలహా ననుసరించి ప్రభుత్వము చీరాల, పేరాల, పాతచీరాల, వీరరాఘవపేట, జాండ్రపేటల నొకటిగజేర్చి మునిసిపాలిటీ నేర్పరుప నుద్దేశించిరి. 1915 లో జిల్లాకలెక్టరు చీరాలకు మునిసిపాలిటీ అక్కరలేదని అభిప్రాయమొసగెను. యూనియన్ మునిసిపాలిటీగ మార్చినచో పన్నులభారమతిశయించి, అయిదువేలనుండి యాభైవేలు యిర్సాలు కావలసివచ్చును. వ్యయమును యిటులనే పెరుగును. అచ్చట నివసించు జనులలో అసంఖ్యాకులు బీదవారు. వారి యిండ్లు చాలవరకు పూరిపాకలేకాని, ఆరోజులలో పెద్ద భవనములు లేవు. బావులలో యెచ్చటజూచినను బారెడు లోతులో మంచినీరు లభ్యమగుచుండుటచేత యిచ్చట నీటికొళాయిలనవసరము. ఊరంతయు యిసుకమయమగుటచే, మురికికాలవ కట్టడములును, ఊరిచుట్టు నెచటజూచినను

T. 420

విశాలమగు ఖాళీస్థలములును, జీడిమామిడితోటలు నుండుటచే పాకీపనివాండ్రు కూడ యెక్కుడవసరము లేదు. ఈపరిస్థితులలో తమకు మునిసిపాలిటీ వలదని యీ ప్రాంతీయులు తీర్మానించు కొనిరి. ఇంతలో బొబ్బలజాడ్యము వచ్చినది వచ్చినట్లే మాయమైనది.

కాని 1916 లో కొందరి ప్రోత్సాహమువల్ల బాపట్ల తాలూకాబోర్డును, గుంటూరు జిల్లాబోర్డును చీరాలకు మునిసి పాలిటీ అవసరమే యని తీర్మానించినవి. ఇందుపై తర్జన భర్జనలు జరుగగా, తుదకు జాండ్రపేటను వదలివేసి, చీరాల పేరాల గ్రామములను మాత్రమే మునిసిపాలిటీ గావించిరి. అందుచే యీచీరాల, పేరాల వాసులపైననే యీమునిసిపల్ పన్నుల భార మంతయుపడినది. జనులలో నశాంతి ప్రబలెను. ఎట్టకేలకు ఖండన ముండనములతో వ్యవహార మొకటిరెండేండ్లు గడచెను. ఎట్ట కేలకు 1919 లో మునిసిపాలిటీ స్థిరముగ నేర్పడెను. ఎన్నికలు జరిగినవి. కాని మనసులేని మనువు. మొదటియేడు ప్రజలు మూల్గుచు పన్నులు చెల్లించిరి. సర్కారువారికి మహజర్లు సాగినవి. ఆ సమయముననే గోపాలకృష్ణుడు చీరాల ప్రవేశిం చెను. ఆతని అమూల్యసలహాలను, రాజకీయాభిప్రాయములను యాతడు చీరాలవాసులకొసంగి, మునిసిపాలిటీ వ్యవహారము గూర్చి చెన్నపురిలోని ప్రముఖులతోను, ఉద్యోగులతోను సంప్రదించెను. కాని లాభము లేకపోయెను. మునిసిపాలిటీవారు సభ చేసి, తమకు మునిసిపాలిటీ అనవసర మనియు, యూనియన్ మాత్రము చాలుననియు తీర్మా నించిరి. అట్టి తీర్మానము గావించినవారిలో రెవరెండ్ థామస్

అను నొక యిరోపీయుడు కూడ నుండెను. కాని ప్రభుత్వము వినలేదు. అంతట మునిసిపల్ సంఘసభ్యులు ప్రజాభిప్రాయమును గుర్తించి 1920 సెప్టెంబరులో తమ పదవులకు రాజీనామా యొసంగిరి. మునిసిపల్ పరిపాలన స్తంభించినట్లుండెను.

ఇంతలో నూతన సంస్కరణల ననుసరించి రాష్ట్రశాసన సభకు యెన్నికలు జరిగినవి. శ్రీ గాంధీమహాత్ముని యాదేశానుసారము కాంగ్రెసు యెన్నికలను బహిష్కరించగా, బ్రాహ్మణేతర పక్షీయులగు జస్టిస్ వర్గమువారు శాసనసభా సభ్యులై, కీ. శే. పానుగంటి రామారాయణింగారు, కూర్మా వెంకటరెడ్డినాయుడు, సుబ్బరాయులు రెడ్డిగార్లు ప్రథమ మంత్రులైరి. వీరిలో పానుగల్లు ప్రభువు ప్రధానియు, మునిసిపల్ మంత్రియు నయ్యెను. ఆ హోదాలో శ్రీ రామారాయణింగారు చీరాలను సందర్శింపవచ్చిరి. కాని చీరాల పేరాల పౌరులు బ్రాహ్మణుడగు గోపాలకృష్ణుని మాటవిని యెన్నికలలో ఖాళీపెట్టెలను పంపిరను కారణముచే యాతడు వారిని చులకనగజూచి యెద్దేవములాడెను. అందుచే ప్రజలింకను కినుకబూని, మరింత సహాయనిరాకరణవాదులైరి. ఇంతలో నాగపురి కాంగ్రెసునందు "యేడాదిలో స్వరాజ్య" సూత్రమంగీకరింపబడి, గోపాలకృష్ణుడు వెన్వెంటనే ప్రభుత్వముతో పోరునకు సంసిద్ధపడెను.

1921 జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలో చీరాల వ్యవహారములో ప్రభుత్వమెట్టిమార్పును యొప్పుకొనలేదు. ప్రజలు పన్నులు చెల్లింపనిరాకరించిరి. సర్కారువారు మునిసిపాలిటీని తొలగించి నెలకు రు 800 లపై నొక వేతనపు ఛెయిర్మనును నియమించి, 60 మంది ప్రత్యేక పోలీసులనుగూడ యేర్పరచిరి

వీరు ప్రజలయొద్దనుండి బలాత్కారముగ పన్నులు వసూలు చేయ బ్రయత్నించిరి ఈ సంఘటనలో ఉద్యోగుల యొత్తిడికి తాళలేక ప్రజలెప్పుడు శాంతిని వీడుదురోయని గోపాలకృష్ణుడు తహతహలాడుచుండెను. ఇందులకై యాతడు తన రామదండును, భజనలు, పురాణశ్రవణము, భగవత్సంకీర్తనము, సద్గోష్ఠులను వినియోగించెను. గ్రామములో సంతకకలహములు రాకుండుటకును, వచ్చిన పేచీలను బరిష్కరించుటకును, పుర ప్రముఖులతో గూడిన పంచాయతీని యేర్పరచెను. ఈ పంచాయతీవారు ప్రతినిత్యము, అన్నివిధముల తగవులను విచారించి, తీర్పులు చెప్పి, ప్రభుత్వోద్యోగుల కెంతో జరిమానాలను విధించి, వసూలు చేయుచుండిరి. సంఘమును పీడించు త్రాగుడు, జూదము, మున్నగు దుర్వ్యసనములను రూపుమాపుటకై కులకట్టుల నేర్పరచి, దోషులగువారికి "కులతప్పు"లను విధింపజేయుచు, యెల్లరను సన్మార్గవర్తనులుగ జేయుచుండెను. జనులలో సదాచారము, దైవభక్తి, నీతి, ధర్మము వృద్ధికాజొచ్చెను. రామారాయణింగారు చీరాలకేగు సమయమున జనులెల్లరు భజనలతో యెదురేగి, సీతాపహరణమున కొడిగట్టిన రావణునకు విభీషణుడు "వారి సీతను వారికిచ్చి మంచిమార్గము బట్టిపోరా — రావణా" యని బోధించినరీతిగ, మునిసిపల్ సంఘమును రద్దుపరచి ప్రజలతో సఖ్యమొనర్చుకొమ్మని యాతనికి హితవొసంగిరి. కాని రామారాయణింగారు వారభిప్రాయమును పెడచెవిని బెట్టెను.

ఇట్లుండ మార్చి 30, 31 తేదీలలో విజయవాడలో అఖిలభారత కాంగ్రెసు కమిటీ సమావేశమయ్యెను. ఆనాడు తమ ప్రాంతమునకు విచ్చేసిన శ్రీగాంధీ, దాసు, నెహరూ,

లజపత్రాయి, అనీబిసెంటు మున్నగు నాయకులను సందర్శించుటకు సుమారు రెండు మూడు లక్షలజన మాంధ్రదేశముయొక్క మూలమూలలనుండియు విజయవాడ కేగుతెంచిరి. ఆసమయమున విజయవాడ మహాతీర్థముగ నొప్పారెను. అప్పుడే గోపాలకృష్ణుడు చీరాలనుండి యొక ప్రత్యేక రైలులో తన దండు సహితముగ వచ్చి మహాత్ముని రక్తాంబరధారులును, భగవద్భక్తిపరులును, దేశారాధనాతత్పరులు నగు తన భటవర్గమును ఆ నాయకోత్తములకు జూపి, వారియెల్లర మెప్పును బడసెను. లక్షలకొలది జనసమూహమును తన భటసహాయముచే పాయలుగదీసి, మధ్యవీధులగుండ నాయకుల నెల్లరను గొంపోయి ప్రజలకు జూపించి. వారి యుపదేశములను యెల్లరకు వినిపించి. నాటి సభికులలో ఆ బాలగోపాలమునకు మహదానందమును సమకూర్చెను. గోపాలకృష్ణుని శక్తిసామర్థ్యముల నెల్లరును వేనోళ్ల ప్రశంసించిరి.

బెజవాడ సభల యనంతరము గాంధీమహాత్ము డాంధ్రదేశ సంచారము సేయుచు, ఏప్రిల్ 6 వ తేదీన చీరాల, పేరాల గ్రామములు సందర్శించెను. రామనగరమున "గోపాలకృష్ణుడు చక్కని పందిళ్ళు వేయించి, తాళపత్రముపై సుస్వాగతము వ్రాసి, భక్తిపురస్సరముగ నాతనికి సమర్పించెను. మహాత్ముడును చీరాలవాసుల భక్తిని, శక్త్యుత్సాహములను అభినంది, కష్టములలోనుండియు వారొసంగిన నాలుగువేల రూప్యములను పదిమడుంగులుగ స్వీకరించెను. మునిసిపాలిటీ వ్యవహారము గూర్చి ముచ్చటించుచు, నయ్యది సక్రమాందోళనమే యనియు, అట్లయ్యును మునిసిపాలిటీని తొలగించుటకు శాంతి

యుత శాసనోల్లంఘనముచే పన్నుల నిరాకరించుటగాని పురత్యాగమొనర్చుటగాని, రెండుమార్గములనియు, దేశమెల్లను చీరాల పేరాలపై దృష్టినిగిడ్చి చూచుచుందురనియు, జయము చేకూరినచో దేశీయులెల్లర ఆశీస్సులను, అపజయమైనచో దూషణలకు వారు పాత్రులగుదురనియు, అందుచే తమ నాయకుడగు శ్రీ గోపాలకృష్ణుని యాజ్ఞానుసారము శాంతముగ తమ యుద్యమమును సాగించి విజయము బొందుడని యుద్బోధించి యాశీర్వదించెను. పురజనులెల్లరును మహాత్ముని వాక్సుధాధారలగ్రోలి, ఆనందపారవశ్యతజెందిరి. మహాత్ముని రాకచే తమ గృహములు పావనమయ్యెనని యెల్లరును సంతసించి, యాతనియాజ్ఞలను తలదాల్చి తమ యుద్యమమును కొనసాగింప దృఢనిశ్చయులైరి.

గాంధీమహాత్ముని రాకకు బిమ్మట చీరాల పేరాల పౌరులు తమ లక్ష్యసిద్ధికై పురత్యాగమే మేలని నిశ్చయించుకొనిరి. అందుచే మునిసిపల్ సరిహద్దులకు బయట వేనవేలు తాటాకుపాకలను నిర్మించి, ఆబాలగోపాలమును ఊరువిడచి పోవుటకు నిశ్చయించిరి. ది 25-4-21 రాత్రి సుముహూర్తమేర్పరుపబడెను. మంగళవాద్యములతోను, దేదీప్యమగ వెలుంగు దీపములతోను, "శ్రీ మద్రమారమణ గోవిందోహరి" "మహాత్మా గాంధీకీ జై" యను శంఖారావముతోను, తాత తండ్రులనుండియు తాము నివసించుచున్న స్వగృహములను వీడి, చీరాల పేరాల ప్రజ తమ నూతన కుటీరములకు జనిరి. ఆనాటిరాత్రి వారి యుత్సాహమునకు మేరలేదు. గొప్పవారు, కొద్దివారు, భాగ్యవంతులు, బీదవారు, బలిష్ఠులు, దుర్బలులు,

పెద్దలు, పిన్నలు, స్త్రీలు, పురుషులు, యెల్లరు గ్రామములను వదలిపెట్టిరి. ఆ నడివేసవిలో, నాటి రాత్రియు, మరుసటి మిట్ట మధ్యాహ్నము గూడ అచ్చట ప్రజానీకముతమ తమ సామానులను నెత్తిపైబెట్టుకొని, చేటలు,చాపలుచీపుళ్లు, రోకళ్ళు,రోళ్ళు, పిడకలు,మున్నగువానిని మోసికొనిపోవు పురుషులను జూచినవారి కెవరికి కంటనీరు కలుగదు? గర్భిణీ స్త్రీలు, బాలింతలు, పసిబిడ్డ తల్లులు, ముదుసలులు, శిశువులు, రోగులు, యెల్లరు గ్రామమును త్యజించిరి. చీరాల పేరాల వారి త్యాగము శ్రీమాన్ ఎస్. శ్రీనివాస అయ్యంగార్, శ్రీ టంగుటూరి ప్రకాశం పంతులు గార్ల హృదయముల నాకర్షింపగా వారుభయులు నచ్చటకు వచ్చి చెరి వేయిరూప్యముల నొసంగిరి. రాష్ట్రకాంగ్రెసు వారును మూడువేలతో చీరాలవాసులను దీవించిరి.

చీరాల పేరాల పౌరుల కార్యదీక్షయు, గోపాలకృష్ణుని అసమాన ధైర్యసాహసములును, ప్రభుత్వమును కలవరబెట్ట నారంభించెను. గోపాలకృష్ణుడును తనయొద్ద జేరిన పేదప్రజల సహాయార్థమై ఆంధ్రదేశమెల్లెడల సంచారమొనర్చి, "సంజీవి" నర్థించి, యుద్యమ ప్రబోధము గావించుచుండె. ఈరీతిగ యాతడు బెజవాడ, ఏలూరు, భీమవరము, వుండి, నర్సాపురము, రాజమహేంద్రవరము, కాకినాడ మున్నగు స్థలములను సందర్శించెను.

ఇంతలో చీరాలయందలి అధికారులు పురజనుల నెట్లైనను లొంగదీయవలెనను తలంపుతో నిర్బంధపు విధానమునకు గడంగిరి. మహాత్ముడు చీరాలకు రాకపూర్వమే పండ్రెండుగురు పురుషులను, వృద్ధురాలగు నొక స్త్రీయు పన్నుల నిరాకరణకై

కారాగారముల కంపబడిరి. పురజనులు భజనలతోను, జైజైల తోను వేనవేలుగ వారికి వీడ్కోలు దెల్పిరి. ఆ పదముగ్గురును విడుదలయై వచ్చిన పిమ్మట మహాత్ముడు వారిని పుష్పమాలా లంకృతులగావించి, గౌరవించెను.

వేసవి గడచిపోయెను. కాని ప్రభుత్వము మునిసిపాలిటీని రద్దుచేయలేదు. ప్రజలూర లేనందున పన్నులబాధ తప్పినది. అందుచే వారి వారి పాకలలోనే వారు తమ పనులనన్నిటిని జేసుకొనుచు, అచ్చటనే పెండ్లి పేరంటములు జరుపు కొనుచు, అచ్చటనే హరికథలు, పాటకచ్చేరీలు, భజనలు, భాగవతములు, మొదలగునవి సాగించుకొనుచుండిరి. ఇక చీరాల పేరాల గ్రామములో? అవి నిర్మానుష్యములై భూత ప్రేతపిశాచముల కాలవాలమై, విషసర్పములకును, సృగాలము లకును నివాసస్థానమై, వెలవెలబోవుచు భీకరముగ నుండెను. ఇండ్లు కూలిపోయినను, చోరులు తలుపుల నెత్తుకొనిపోయినను, ఎన్ని యిక్కట్టులు వచ్చినను ప్రజలు తమ దీక్షను వదలలేదు. ఇంతలో వర్షాకాలము వచ్చినది. అనేక కష్టములు సంప్రాప్తిం చినవి. కాని ప్రజలు పట్టినపట్టు వీడలేదు. నాయకుల అరెస్టు ప్రజలను మరింత యుత్సాహపరులుగ జేసెను.

ఇంతలో సెప్టెంబరు నెలలో బరంపురమందు ఆంధ్ర మహాజనసభయు, ఆంధ్రరాష్ట్రీయ సభయు జరిగినవి. అప్పటికీ చీరాల రంగమువల్లనే గాక స్వరాజ్యసమరోత్సాహమువల్లగూడ ఆంధ్రదేశమంతయు నట్టుడికినట్టుడికిపోవుచున్నది. ఎల్లెడలను నిర్బంధములే! ఎచ్చటజూచినను ప్రజలలో నమిత భక్త్యుత్సా హములే! అన్నిచోట్లను ప్రభుత్వము నిర్బంధవిధానమునకు

గడంగజొచ్చెను. అట్టి నిషేధాజ్ఞలను శిరసావహించుటయా? లేక ఉల్లంఘించుటయా? అనునది బరంపుర మహాసభలో ప్రధానప్రశ్నయయ్యెను. గోపాలకృష్ణుడు శాసనోల్లంఘనమే అవసరకర్తవ్యమని వాదించెను. బరంపురమునందు దాత డుపన్యసింపకూడదని జిల్లాకలెక్టరు రూథర్ ఫర్డుదొర నిషేధపుటుత్తరువు బంపెను. దీనికి విరుద్ధముగ గోపాలకృష్ణు డుపన్యసింపసాగెను. అందుపై ప్రభుత్వమాతని బందీకృతునిజేసి శిక్షించెను. ఈ బరంపుర యుదంతములగూర్చి మనము ముందు అధ్యాయమునందు జదువుదుము.

## 10. శ్రీ రామదండు.

గోపాలకృష్ణుడు స్వరాజ్యసాధనకై సంకల్పించిన శాంతి బలగము శ్రీ రామదండు. ఆంధ్రరత్నము మొదటినుండియు రామభక్తుడు—అతనికి రాముడే యిష్టదైవము. హనుమంతుడు సమ్మానబంటు—భద్రాద్రిరామునకు శ్రీ నైజామ్ ప్రభు వేటేట కానుకల నిచ్చుచుండుటచే నిజమగు హిందూముసల్మాన్ సమ్మేళనమునకే రామనామమే తార్కాణము. ఇంతియగాక, శ్రీ గాంధీ మహాత్ముడు మన స్వరాజ్యము తిరిగి "రామరాజ్యము" కావలెననియు, నిరాయుధులగు హైందవప్రజకు రాముడే "శ్రీరామరక్ష" యనియు, చెప్పుటచే, యాతని"రామదండు"నకు గుర్వాజ్ఞ కూడ సిద్ధించెనని యాతడు తలంచెను. కావుననే శ్రీ గాంధీఋషి సంకల్పించిన స్వరాజ్యయజ్ఞమునకు తనవంతు చీరాల-పేరాలలో యాతడు రామదండు నేర్పరుప సంసిద్ధుడయ్యెను.

ఈ రామదండు యుద్దేశ్యముల నాత డిటుల విశదీకరించెను. రామదండు ఉద్దేశ్యములు రెండు : (అ) నిరంతరము

భగవన్నామస్మరణచేయుట; (ఆ) రామకార్యములని అంగీకరింప బడు సమస్త సత్కార్యములకు యిందలి సభ్యులు తమ సర్వస్వమును సమర్పింప సంసిద్ధులై యుండుట."

"శివకేశవారాధనయం దాదరణగల యాపన్నంది ఆంధ్రులును యిందు సభ్యులుగ నుండవచ్చును." రామనామము బ్రహ్మ, విష్ణు, యీశ్వరులు ముగ్గురితో. రామబ్రహ్మమనియు, రామకృష్ణుడనియు, శివరాముడనియు, సమ్మిళితమగుటచే నది సర్వజన సమాదరణీయ మగుచున్నది. ఇంతియగాక ఆంధ్రావనిలో ఆత్మారాముడు మొదలు "ఆకాశరాము"ని వరకు "అంతా రామమయమే!" త్యాగబ్రహ్మలును, గోపన్నగారును రామనామమునే గానముజేసిరి. అందుచే శ్రీరామదండు ప్రత్యేకముగ ఆంధ్రసాంప్రదాయ యుతమునైయున్నది.

శ్రీరామదండు యొక్క దీక్షావిధానమునందు భటావళి రూపమున చెంగావిధోవతి, చెంగావిచొక్కా, తలపాగ, కుంకుమ తిలకము, రుద్రాక్షతావళము, అంగవస్త్రము, తామ్రపాత్ర, దండము, తాళపుచిరుతలు, ఒక పచ్చని రెమ్మయు ధరించవలయునని యాతడు విధించెను. ప్రయాణములందొక సంచియు, వంటసామగ్రియు నుండును. పండుగదినములును, దండుశాసనసభచే విధింపబడు యితర దినములును, దీక్షాదినములు. "శ్రీమద్రమారమణ గోవిందో హరిః", "హరహర మహాదేవ", "దళ్ళరభ" యున్నగు వాక్యములు దండువాక్యములు. అతిపవిత్రమును, తేజోవంతమును, మహాశక్తియుతమునగు వజ్రము (ఇంద్రధనస్సు) దండుధ్వజము. ఇందుపై శ్రీ ఆంజనేయుని ప్రతిమను చిత్రింపవలయును.

దీక్షాసమయమున భటుడు నాయకుని గురువుగ నెఱింగి శుశ్రూషాధర్మము ననుసరింపవలెను. అనుదినము ప్రాతఃకాలమున నే స్నానసంధ్యాద్యనుష్ఠానములు దీర్చికొని, దీక్షావస్త్రధారణము గావించి, శ్రీరామస్మరణ జేయుచు, గురునిర్దిష్టమైన కార్యమును నిష్కళంకముగను, నిర్వివాదముగను, నిశ్చలమనస్కుడై యాచరింపవలెను. దీక్షాసమయమున సర్వసంగవర్జితుడుగనుండి, చిత్తము శ్రీరామపాదములందు జేర్చి నిశ్చలబుద్ధితో నెట్టికార్యమునైనను, ఎట్టి త్యాగముతోనైనను, నిర్వర్తించుటకు సంసిద్ధుడు కావలెను. దీక్షాసమయములందు జాతి, మత, వివక్షత లేక, సమస్తప్రాణులను నిజస్వరూపప్రతిబింబములుగ నెఱింగి, సంపూర్ణ ప్రేమాంతరంగుడై, సమబుద్ధితో ప్రతిసభ్యుడును గుర్తించవలయును. భోజనపానాదులందు వనభోజనమునందలి ధర్మము ననుసరింపవలయును. మహాజనసమావేశములు, నదీ పర్వతసముద్రాద్రిప్రాంతములు, దేవాలయాది ప్రదేశములను పుణ్యక్షేత్రములుగ దలంచి, వీనిని యీశ్వరుని ప్రత్యక్షరూపముగ నెఱింగి, ఆయాస్థానములందు భజన, సేవ యిత్యాది భక్తిమార్గము లనుష్ఠింపవలయును.

దండునిర్మాణమునందు గ్రామపంచాయతీలు, తాలూకా మండలసభలు, యావదాంధ్ర ధర్మసభయు నుండును. దుష్టశిక్షణము, శిష్టరక్షణము, ధర్మసంస్థాపనము, ప్రతినాయకుని యొక్కయు విధియగుటచే రామదండునాయకులట్టి సన్మార్గమునే అవలంబించి, దండు ధర్మములను బరిపాలించి, ఆంధ్రలోకాభ్యుదయ పరంపరాభివృద్ధికి తోడ్పడి, శ్రీరామభక్తి, ప్రజానురక్తిబొంది; సంపూర్ణముగ శాంతమూర్తులై, భక్తివిశ్వాసముల

పెంపొందింపగలిగి రామదండు నుద్ధరించుచు, ఆంధ్రప్రజలందు రామభక్తియు, సర్వప్రాణి సమత్వమును, ప్రేమయు, సాత్త్విక వృత్తియు; పరోపకారపారీణతయు, సర్వభూతహితమును, వ్యాప్తినొందించుటకు నిరంతరము కృషిసలుపుచుండవలయును. ప్రతిగ్రామమందును ౧౮-౫౦ సంవత్సరముల మధ్యనున్న పురుషులు రామదండులో జేరవచ్చును. ౧౮ లోపు బాలురను యిందుండ నర్హులేకాని వారు దండువ్యవహారములను విచారించుటకును, నాయకత్వము వహించుటకుమాత్ర మనర్హులై, వారి గురువుల యాజ్ఞలకు బద్ధులైయుందురు.

ఈ రామదండు విధానమునకు ప్రతిపదికగ శ్రీ గోపాలకృష్ణుడొసంగిన యీదిగువ హెచ్చరిక ఆంధ్రులకు చిరస్మరణీయము.

శ్రీ రా మ ద ం డు : హె చ్చ రి క.

శ్లో॥ రామేతి వర్ణద్వయ మాదరేణ
సదా స్మరన్ ముక్తి ముపైతి జంతుః
కలౌయుగే కల్మషమానుషాణాం
అన్యత్ర ధర్మే ఖలు నాధికారః॥

"ఆంధ్ర దేశమందు గతానుగతికముగ 'రామదండు' అను ప్రతిష్ఠాపనము నెలకొల్పబడుచు వచ్చినది. రామశబ్దము శైవ వైష్ణవాది సమస్తమైన యాంధ్రహైందవ సంప్రదాయముల కత్యంత ఆదరణీయమగుట "రామదం" డను పేరును నిరాక్షేపణీయముగ జేసెను. గ్రామసమయములు, అరాజక సమయములు రామదండుయొక్క యుత్పత్తికి కారణములయ్యెను.

ప్రస్తుతస్థితిగతులలో ధర్మసందేహము లెక్కువగుటయు,

దారిద్ర్య మధికమగుటయు, బహునాయకత్వ మేర్పడుటయు, ప్రజలయం దశాంతి యతిశయించుటయు ముఖ్యముగా గమనింప దగినవి. వీనిని జయించుటకు నిదానము, వివేకము, నిరోధము, ధైర్యము, శౌర్యము, స్థైర్యము, శీలము అత్యావసరములు. అవి సంపాదించుటకు ఆధునికులు స్వార్థజ్ఞానమే ప్రబల సాధనమని చెప్పుచున్నారు. ఆర్యసంప్రదాయ మిందుకు భిన్నముగ నిరంతరమీశ్వర సేవాపరాయణత్వమే సాధనమని సిద్ధాంతీకరించి యున్నది. స్వార్థజ్ఞానముపదేశించి ప్రజల నావేశపూరితుల గావించినచో, అందు బయల్వెడలిన అహంకార విజృంభణమువలన కొంత కార్యసాధన సమకూరునుగాని, అవసరమగు పట్ల జనసమూహమును శాంతుల, ప్రసన్నుల జేయుట మిక్కిలి కష్టమును కొన్నికొన్ని సందర్భములలో బొత్తుగా వీలుపడకుండుటయు అనుభవవైకవేద్యము. రామశబ్దప్రవేశ మైనచో, దృష్టియందు నిలచియున్న స్వార్థపరత ధర్మనిరూపణమవలంబించును. నాయకు లప్పుడు విశ్వమూర్తులగు మహాజనసమూహమునకు నిగ్రహానుగ్రహములు రెండును ప్రసాదింపగలుగుదురు. తాము రామశబ్దసహాయముచే ప్రయోగోపసంహారముల యందు సమర్థత గలవారలగుదురు. అందు ముఖ్యముగ ప్రజలు సమిష్టిగా తమ లోకవ్యవహారములను జరుపవలసివచ్చిన యోజనలలో రామశబ్దరహితమైన సమిష్టివ్యవహారము నిష్ప్రయోజనము, అనర్థజనకము. అపాయకరమును అగును.

"కావున ప్రజల సంకల్ప సీమల రామభక్తి ప్రవేశపెట్టినచో, వివేకముగలవారై, చిత్తనిరోధము గలవారై, నిశ్చలులై, శాంతులై కార్యసాధనకు గడంగుదురను విశ్వాసముతో నీ రామ

దండేర్పాటు గావింపబడినది.

"ఇంచుమించు ఇట్టి యుద్దేశముతోనే, బాలభట సంఘమను నొక పాశ్చాత్యప్రతిష్ఠాపన మిప్పుడు కొందరు పెద్దలచే నామోదింపబడి మన యనుష్ఠానమునకు విధింపబడినది. ఈ రెండింటికి గల భేదాభేదములు, యోగ్యతా యోగ్యతలను విచారించినచో మన తత్వమునకు యుక్తమైనది రామదండసియే తేలగలదు.

"'స్కౌటు' అను పదమునకు 'అన్వేషించువాడు' అని యర్థము. శ్రీరామచంద్రుని యొక్క భాగ్యలక్ష్మి, రాజ్యలక్ష్మి, యర్థాంగలక్ష్మియగు (శ్రీ) సీతామహాదేవిని అన్వేషించినవారే రామదండు. కావున పాశ్చాత్య రూపమగు స్కౌటుకు రామదండను పదమే యోగ్యమైన ప్రాచ్యానురూపము, జాతీయమును అగుచున్నది. ధర్మాన్వేషణముగావించి ధర్మసంస్థాపనమునకు తోడ్పడవలసినది రామదండసియే సిద్ధాంతమగును.

"రామదండు కామధేనువు. ప్రజలవ్యవహారము లన్నిటియందు నిఖిల పురుషార్థసాధనమందు రామదండు ప్రయోజనకారిగ నుండును. ధర్మవిషయములు, ఆర్థికవిషయములు, రాజకీయములు, మతసంబంధములు వగైరా అన్నిటియందు రామదండుకు జోక్యము కలుగజేసికొనుటకు అధికారముకలదు. మహాజనము మీద జరుగవలసిన కార్యములకు ప్రయోగమందేగాక యుపసంహారమందుగూడ శక్తిసామర్థ్యములుండుట ముఖ్యముగా నవసరము. కనుక రామమంత్రి బలిమిచేగాక యింకొక విధముగా వీలులేదు. కావున రామదండు మార్గమే అవ

పరమని గ్రహింపనగును.

"ఆంధ్రమహాజనులు రామదండువిషయము తగుశ్రద్ధ వహించి యుద్ధరింప బూనవలయునని నా ప్రార్థన.

చిత్తగించవలెను.

దుగ్గిరాల గోపాలకృష్ణయ్య."

ఇట్టి మహదాశయములతో శ్రీ గోపాలకృష్ణుడు 1921లో తన రామదండును నెలకొల్పి, ఊరూర ప్రచారము గావించి, ది 30-3-1921 న బెజవాడలో జరిగిన అఖిలభారత కాంగ్రెసు కమిటీకి సుమారొక వేయిమందితో రామదండు స్పెషల్ రైలును తీసికొని వెళ్ళి, అచ్చట సమావేశమైన లక్షలాది జన సమూహమునకు కాంగ్రెసు వాలంటీర్లు సేవచేయలేనితరి నత్యద్భుతముగ మహాసభ జరిపించి, ప్రజలయొక్కయు, మహాత్మ గాంధీ, ఆలీసోదరులు మున్నగు నాయకుల యొక్కయు మన్నన లకు పాత్రుడై, అప్పటికే మున్మురముగనున్న చీరాల పేరాల రంగమందు అద్వితీయముగు ప్రజాసేవ యొనర్చి, నాయకునిగ మెప్పువడసెను. దరిమిలా 1924 ఏప్రియల్ నెలలో అలమూరులో జరిగిన గోదావరిజిల్లా స్వచ్ఛందసేవక మహాసభయందును, మరుచటి నెలలో కొవ్వూరులో జరిగిన రామదండు శిక్షాశిబిరమునందును, కొంత ప్రచారముగావించి, తదుపరి రాష్ట్రకాంగ్రెసు ద్వారా తన రామదండును శాశ్వతసంస్థగ నొనర్ప బ్రయత్నించెను కాని, నాస్తిక్యత ప్రబలిన యా దిన ములలో తుదకు కాంగ్రెసు పెద్దలైనను యీ దండుయొక్క విలువనుగాని, గోపాలకృష్ణుని ఆశయములనుగాని గుర్తింప లేక పోయిరి. గోపాలకృష్ణుని మరణానంతరము మహారాష్ట్ర

నాయకుడగు మూంజీ మహాశయుడు మాత్రము గోపాలకృష్ణుని రామదండును శిరసావహించి, చీరాలయందలి రామనగరు వలెనే నాశికా సమీపమున "రామభూమి"ని నెలకొల్పి, అందయిదు లక్షల రూప్యములతో నొక సైనిక శిక్షణాలయ మును స్థాపించి, అచ్చటి విద్యార్థులకు "రామదండీ"లని పేరిడి, తన తంతివిలాసమునకు "రామదండీ-నాశిక" యని నామకరణ మొనర్చి, తానాధ్వర్యము వహించుచున్న హిందూమహాసభ యందలి ఐచ్ఛిక భటవర్గమునకు "రామసేన" యని పేరిడెను.

## 11. రాజకీయములు.

1921 సంవత్సరమందు మన దేశములో గాంధీమహాత్ముని యాధ్వర్యమున నొక బ్రహ్మాండమగు రాజకీయోద్యమము చెలరేగెను. దీనికి అహింసాయుత అసహాయోద్యమమని పేరు. ఈ యుద్యమ ముఖ్యసూత్రములను మనము లోగడ కొంత వరకు జదివితిమి. ఆంధ్రదేశమందీ యుద్యమమును నడిపించిన వారిలో మన కథానాయకుడు ప్రధానపురుషుడు. అతని చీరాల పేరాల యీ రంగమందలి ముఖ్యకాండము. ఈ ఘట్టమునకు బయట గోపాలకృష్ణుడొనర్చిన రాజకీయసేవగూర్చి యీప్రకరణ మందు మనము చదువుదుము.

అసహాయోద్యమమందలి ప్రథమఘట్టము శాసనసభా బహిష్కారము. 1920 సెప్టెంబరులో కలకత్తాలో జరిగిన ప్రత్యేక కాంగ్రెసులో యీతీర్మానమామోదింపబడెను. తదు పరి గోపాలకృష్ణుడు చీరాలప్రాంతమందీ కార్యక్రమమును బహు కట్టుదిట్టముగ నేర్పాటుగావించెను. ఏతత్ఫలితముగ ఆ చుట్టు ప్రక్కల బహు సంఖ్యాకులగు వోటర్లు తమ వోట్లను చెలా

యించలేదు. కొన్నిచోట్లనోటు పెట్టెలు ఖాళీగనుం పోయినవట.

1930 డిశంబరులో నాగపురమందు తిరిగి కాంగ్రెసుసభ జరిగెను. ఇచ్చట గాంధీమహాత్ముని అసహాయ తీర్మానము ద్విగుణీకృతోత్సాహముతో ధృవపఱుపబడెను. నాగపురినుండి తిరిగి రాగానే గోపాలకృష్ణుడు కొందరు మిత్రులతో ఆంధ్రదేశ సంచారమునకు బయలుదేరి, ఉద్యమప్రబోధమునకు తోడ్పడెను.

శాసనసభా బహిష్కారమునకు బిమ్మట కాంగ్రెసువారు సాగించవలసిన యుద్యమము స్కూళ్ళబహిష్కారము. ఇందుకై 1931 జనవరి 14 న గోపాలకృష్ణుడు బాపట్ల తాలూకా మహాసభ కధ్యక్షత వహించెను. దానితో బాపట్ల హైస్కూలు ఖాళీ యయ్యెను. 21 వ తేదీన రాజమహేంద్రవరమందు గోదావరి జిల్లా విద్యార్థిమహాసభ కధ్యక్షత వహించెను. కాకినాడ, ఏలూరు, భీమవరము, గుంటూరు, తెనాలిలలో నుపన్యసించెను. అన్నిచోట్లను స్కూళ్ళ బహిష్కారమే యాతని ఉపదేశము.

ఆతని రాజమహేంద్రవరం ఉపన్యాసములో గోపాలకృష్ణుడిట్లు నుడివెను. "ఈ జీవితమే యొక విశ్వవిద్యాలయము వంటిది. దీనిలో భగవంతుడే అధ్యక్షుడు. ముక్తియే యిచ్చట మనము పొందవలసిన 'డిగ్రీ'. ఐరోపావాసులు తమ నిత్యజీవితమునుండి భగవంతుని పారద్రోలిరి. లోగడ హిరణ్యకశిపుని అణచిన నరసింహునివలె ఆతడిప్పుడు గాంధీరూపమున ఇండియాలో నవతరించుచున్నాడు. ఇంతకుమించిన సమయమింకొకటి మనకు దొరకదు. అసహాయోద్యమమును మించిన ఉద్యమముండదు. గాంధిని మించిన నాయకుడును లభించుట దుర్ఘటము"।

తెనాలిలో నీతని ఉపన్యాసఫలితముగ 1200 మంది విద్యార్థులలో 1050 మంది బడిమానిరి. ఒక వారము రోజులు బడిమూసివేసిరి. ఆవారాంతమునగూడ పరిస్థితులలో మార్పును రాదాయెను. ఏలూరులో గోపాలకృష్ణుని సహాయముతో (శ్రీ) మోతే జమీందార్లు గాంధీమహావిద్యాలయమును నెలకొల్పిరి.

1921 మార్చి నెలలో విజయవాడలో అఖిలభారత కాంగ్రెసు సంఘ సమావేశము జరిగెను. ఈసమావేశమందు గోపాలకృష్ణుడును యాతని రామదండును జేసిన సేవగూర్చియు బెజవాడ సభల యనంతరము గాంధీమహాత్ము డాంధ్రదేశ సంచారము జరుపుట గూర్చియు మనము లోగడ జదివితిమి.

గాంధీమహాత్ముడు చీరాల వచ్చినప్పు డొక విచిత్ర సంఘటన జరిగెను. ఆతడు తన సత్యాగ్రహమార్గమును ప్రజలకు బోధపరచుటకై తన సాధనను ప్రహ్లాదసాధనతో బోల్చు చుండెడి వాడు.

పొడిచిన గొట్టిన దిట్టిన
పడుచుందురుగాని పరమభాగవతులు దా
రొడబడరు యొగ్గుసేయక॥

యని భాగవతమార్గముగదా! అందు ప్రహ్లాదుడు తన తండ్రి యెన్ని యిడుమలబెట్టినను జంకని పరమభాగవత శిఖామణి. ఈ యంశమును పురస్కరించుకొని మన గోపాలకృష్ణుడు "ప్రహ్లాద సాధనతో మనకు నారసింహమును సిద్ధించు"నని ప్రజలను ప్రబోధించువాడు. ఈ విషయము గాంధీ చెవులబడెను. ఆతడు చీరాలవచ్చినప్పుడిందుగూర్చి గోపాలకృష్ణుని యిట్లుప్రశ్నించెను.

గాంధీ - నీవేమందువు?

గో॥ కృ - మీసాధనను మీరు ప్రహ్లాదసాధనయందురుకదా! ప్రహ్లాదము నారసింహముగ బరిణమించునని మాత్రమే నాయభిప్రాయము.

గాంధీ - ఈ విషయమై నీవు ప్రజలతో చెప్పుచున్నావా?

గో॥ కృ - చెప్పుచున్నాను.

గాంధీ - వారీభావము నెట్లు స్వీకరించుచున్నారు?

గో॥ కృ - మా ప్రజలలో మంచి విజ్ఞానమున్నది. వారు భారత భాగవతములను జదువు కొన్నారు పురాణములు వినిరి. ఇందలి పరమార్థమును వారు చక్కగనే గ్రహింపగలుగు చున్నారు.

గాంధీ - (అయిదు నిముషములు నిరుత్తరుడై) ఈవిషయమై నీవిక ప్రజలయెదుట తేకుండుట మంచిది.

గో॥ కృ - చిత్తము - మహాత్మా!

ఈ సంభాషణానంతర మీప్రస్తావన గోపాలకృష్ణు డెన్నడును తన సభికులయెదుట తేలేదుకాని, గాంధీమహాత్ముడును తన సాధన నంతటనుండి ప్రహ్లాద సాధన యని జెప్పుటయు మానుకొనెను.

1921 జూన్ నెలలో పొన్నూరులో గుంటూరుజిల్లా మహాసభ జరిగెను. ఆ సభలో చీరాల పేరాల వాసుల ధైర్య స్థైర్య త్యాగసాహసములను బ్రశంసించు తీర్మానములు జరిగినవి. అందుతోపాటు వారి వీరనాయకుడగు గోపాలకృష్ణునకు "ఆంధ్రరత్న" మను బిరుదు నొసంగిరి. అంతటనుండి యాతని నెల్లరును అటులనే పిలుచుచుండిరి.

1921 ఆగష్టులో గోపాలకృష్ణుడు అనంతపురం జిల్లా మహాసభకు అధ్యక్షత వహించెను. ఆ నెలలోనే కృష్ణాపుష్కర సందర్భమున విజయవాడలో నుపన్యాసముల నిచ్చెను. ఈయుపన్యాసములలో నాతడు హింసాహింసలను రెండింటిని సమర్థించి, నెపోలియన్ గాంధీలిద్దరును సమానగౌరవార్హులే యని నిరూపించెను.

సెప్టెంబరు ఆంధ్రమహాసభలకై యాతడు బరంపురంవెళ్ళి యచ్చట చీరాల యుద్యమమునకు సహాయమునర్థించెను. తన యుపన్యాసమందాతడు రామదండు యావశ్యకతగూర్చి చెప్పుచు శ్రీరాముడు భద్రాద్రివాసుడగుటచే ఆంధ్రుడనియు; యింకను శివకేశవుల కభేదమేగాక హిందూముసల్మాను ఐక్యతగూడ నిమిడియున్నదనియు నుడివెను. కిశోరచంద్రుని భజించు ముసల్మానులు కిశోరచంద్రశేఖరుడగు శివునకు బరమభక్తులనియు, అందుచే ముసల్మానులును శైవులే యగుదురనియు; ఆఫ్గనిస్థానములో శివుని కొందఱు శంకర్జాన్ అని పిలుతురనియు చమత్కారముగ జెప్పెను. జిల్లాకలెక్టరు యుత్తరువునకు గోపాలకృష్ణుని ప్రత్యుత్తరములును, ఆజ్ఞోల్లంఘనా ఫలితముగ తాను కారాగారమునకు బోవుచు యాత డాంధ్రమహాజనులకును, చీరాల పేరాల ప్రజలకును నొసంగిన దివ్యసందేశములును చిరస్మరణీయములగుటచే వాని నిట బొందుపఱచడమైనది.

## 12. బరంపురం సందేశములు.

గోపాలకృష్ణుడు జైలుకుబోవుచు, నొక ధోవతి, చొక్కా, తలపాగను ధరించి, భుజముపై నొక కర్ర, వీపుమీద మూట

నుంచుకొని, ముఖమున పెద్ద కుంకుమబొట్టుతో "పదవే భద్రాద్రికి—పాపిష్టిఘటమా!" యను పాట బాడుచు జైలుయాత్రకు బయలు దేరెనట!

ఆనాడు బరంపురమున నుపన్యసింపరాదని కలెక్టరు యుత్తరువు రాగానే కొంతసేపు శాంతముగ నాలోచించి యీతడు కలెక్టరుకు బంపిన ప్రత్యుత్తరము.

"శ్రీమద్రమారమణ గోవిందోహరిః

"గంజాజిల్లా మేజిస్ట్రేటుగారగు టి. జి. రూథర్ ఫర్డు గారికి.

"రామదాసు దుగ్గిరాల గోపాలకృష్ణయ్య అనేక ఆశీర్వచనములు.

"మీరు 28 వ తేదీన నాకంపిన శ్రీముఖము సంతోషముగ గైకొంటిని. అందలి మీకోర్కెను నెరవేర్ప బ్రయత్నించితినిగాని, యనుల్లంఘనీయమగు శ్రీరామాజ్ఞానువర్తినై నేటి సాయంత్రము శ్రీరామచంద్రుని ప్రత్యక్షస్వరూప మనదగు నాంధ్రమహాజన సమక్షమున నుపన్యసింప నెంచితినని మీకు తెలియజేయుచున్నాను.

ఇట్లు

దుగ్గిరాల గోపాలకృష్ణయ్య."

తనయునుంగు చీరాలపేరాలవాసుల కాతడొసంగినసందేశ మిట్లున్నది.

"శ్రీమద్రమారమణ గోవిందోహరిః"

"చీరాల పేరాల గ్రామ మహాజనమునకు రామదాసు దుగ్గిరాల గోపాలకృష్ణయ్య అనేక గాఢాలింగనములు గావించి

వ్రాయునదేమనగా:—

"మనకు సంజీవియాచింప నాంధ్రదేశ సంచారముగావించుచు బరంపురము వచ్చియుంటిని. ఇచ్చటి జిల్లామేజస్ట్రేటగు టి. జి. రూథర్ ఫర్డుగారు ౧౪౪ సెక్షన్ ప్రకారము నాకు వాగ్బంధనము విధించిరి. అందులకియ్యకొనుట సత్వరస్వరాజ్య లబ్ధికి ప్రతిబంధకమనియు, ఆంధ్ర యశశ్చంద్రునకు కళంక మాపాదించుననియు మనము గావించుచున్న మహోద్యమమునకు భంగకరమనియు, తదుల్లంఘనము దేశీయమహాసభా శాసనానుసారము గాకపోయినను తదాదర్శములకు ప్రధానపోషకమనియు, వీరపురుషోచితమనియు, శ్రీరామాజ్ఞ యైనందున నయ్యది శిరసావహించి బరంపురమునుండి శ్రీకృష్ణ జన్మస్థానమున కేగుచున్నాను.

"ఇంతవరకు భవదీయ సేవాపరాయణుండనై ధన్యుండనైతిని ఇక ముందు శ్రీ రామరాజ్యస్థాపన మెన్నడుజరుగును? తిరిగి తమసేవ యెన్నడు లభించును? అని నిరంతర మాపురుషోత్తముని చరణకమలముల భజించుచుండెదను. శ్రీ గాంధీ గురూత్తముని చరణారవిందములు హృత్పీఠమునధరించి సత్వర స్వరాజ్య మంత్ర జపమున కాలముగడపుచుండెదను. అమ్మహామహుని యాదేశము నప్రతిహతముగ, నిర్వివాదముగ, నిష్కళంకముగ, నిశ్చలమనస్కులై, కొనసాగించెదరుగాక! యని మీకు సాష్టాంగ ప్రణామ పురస్సరముగ విన్నవించుకొనుచున్నాను. మనకిప్పుడు ప్రతికక్షులుగ కనుపించుచున్న ప్రభుత్వమువారు మన స్వరాజ్య వ్రతదీక్షను బరీక్షింప నేతెంచిన ధర్మదేవతయో యన భావించి,

వారియెడ యణుమాత్రమును ద్వేషభావమూనక, శ్రీమద్భాగ
వతమునందు గజేంద్రుని మార్గము—అనగా;

పాదద్వంద్వము నేల మోపి, పవనున్ బంధించి, పంచేంద్రియో
న్మాదంబుం బరిమార్చి, బుద్ధిలతకున్ మారాకు హత్తించి, ని
ష్ఖేదబ్రహ్మపదావలంబను గతిన్ క్రీడించు యోగీంద్రు మర్యాదన్॥

పాటించి, నిష్కామకృతిని, శాంతచిత్తులరై, మన మహోద్యమమును కొనసాగింతురుగాక! మన యుద్యమోద్యాపన సమీపించు శుభసూచనలు కాన్పించుచున్నవి. అందు ప్రధానమైనది నాకు లభ్యమైన వాగ్బంధనవిధియే. సత్వరముగ మనకు విజయము చేకూరనున్నది. కావున నీసమయమున మనవ్రతమునందు శ్రీ హరిశ్చంద్రుని పుత్రవియోగకళత్ర సంహారాది సమయమును బోలిన పుష్కరసమయముగ భావింపవలయును. ఇప్పుడే కడుంగడు జాగరూకతతో సంచరింపవలెననియు, అణుమాత్రము మనుమూసించిన వ్రతహానియు, కీర్తిహానియు, స్వరాజ్యోద్యమ ధ్వంసమును పరిణమించి, అధోగతిపాలై, ఆచంద్రతారార్కమవాచ్యమగు దుఃఖపరంపర ననుభవింపవలసివచ్చుననియు, స్పష్టముగ నెఱుంగునది. అప్పుడే ప్రభుత్వ మంత్రివర్గము గావించు మాయోపాయములలో ప్రధానమైనది "మీ దేశత్యాగమును వీడి గ్రామములోనికి వచ్చినచో మీ మునిసిపాలిటీ రద్దుజేసెదము. రేపల్లె మ్యునిసిపాలిటీసు రద్దుజేయుట ఆ ప్రజలు గ్రామమును విసర్జింపకుండుట కారణముననే" అని హెచ్చరికలు తమచారులచేత తీవ్రముగ వ్యాప్తిజేయుటయే. దీనివల్ల నేమాత్రమును మోసపోకుడని పదేపదే హెచ్చరించు

చున్నాను. మహాపతివ్రతామ తల్లియగు శ్రీ సావిత్రీదేవి చరిత్రమును గమనింపుడు. భర్తప్రాణముల నిమిత్తము యమధర్మరాజుతో నసహాయోద్యమ మార్గమువలంబించి వెంబడించినపుడు ప్రథమమున లభించు వరము తన యత్తమామల నేత్రప్రదానము, పిమ్మట తల్లిదండ్రుల రాజ్యప్రాప్తి, ఆఖరునగాని తన భర్త ప్రాణములు లభింపలేదు. అటువలెనే మన యుద్యమము గూడ, మన ప్రయత్నానుబంధమగు రేపల్లె వ్యవహారము ప్రథమమున జయముగాంచుటయు పిమ్మట నింకెన్నియో వాంఛితములుగూడ సిద్ధించుటయు, మనవ్యవహారము కేవలము కుటుంబ కలహముగ ప్రారంభమై కురుక్షేత్ర వ్యవహారముగ బరిణమించుటజూడ, స్వరాజ్యప్రాప్తిగూడ ముందు కలుగుటయు, అనంతరమే మన మ్యునిసిపాలిటీ రద్దగుటయు సంభవించునని మీరు గ్రహింతురుగాక. చిత్తము శ్రీరామపాదములందుజేర్చి, నిరంతర దీక్షా పరతంత్రులై, ఆంధ్రమహాజనులయొక్కయు, యావద్భారత సంతానముయొక్కయు, ప్రతిజ్ఞ నిర్వహించిరను భాగ్యము సర్వేశ్వరుడు మీకు బ్రసాదించుగాక! యని నిరంతరము ప్రార్థించుచున్నాను. వ్యవహారసందర్భమున కొందఱియెడ కాఠిన్యమును, కొందఱియెడ దాక్షిణ్యమును, వహించి వర్తించితిని. ఇంకను నాకు మనోగతములుకాని లోపము లనేకములు కావించి యుండియుందును. చీరాల పేరాలవాసు లాబాల గోపాలము నన్ను మన్నింతురుగాక! మీచరణకమలముల కిదియే ప్రణామము. తిరిగి యనేక గాఢాలింగనములు. నేను కారాగృహమందున్నను, తమ సముఖమున నున్నటులనే భావించి సర్వకార్యములు జయప్రదముగ నిర్వహించెదరుగాక! ఆంధ్ర

మహాజనులు, అఖిల భారతీయులు, గాంధీమహాత్ముడు, శ్రీరామ చంద్రుడు, సర్వదా మిమ్ము గాపాడుగాక!

"స్వస్తి ప్రజాభ్యః.........

ఇట్లు

దుగ్గిరాల గోపాలకృష్ణయ్య."

ఆంధ్రమహాజనులకు గోపాలకృష్ణుడీ దిగువ

సందేశము నొసంగెను.

"శ్రీమద్రమారమణ గోవిందో హరిః

"ఆంధ్రమహాజనులారా! ప్రణాము!

"రామదాసు దుగ్గిరాల గోపాలకృష్ణయ్య అనేక గాఢా లింగనములు గావించి విన్నవించుకొనున దేమనగా :—

"నేను చీరాలపేరాల ధీరులసహాయార్థము సంజీవియా చింప నీ బ్రహ్మపురమునకు వచ్చియున్నాను. ఇచ్చట జిల్లా మేజస్ట్రేటగు టి. జి. రూథర్ ఫర్డు గారు ౧౪౪ వ శెక్షన్ ప్రకారము నాకు వాగ్బంధనము విధించిరి. అందుల కియ్యకొనుట సత్వర స్వరాజ్యలబ్ధికి ప్రతిబంధకమనియు, ఆంధ్ర యశశ్చంద్రునకు కళంక మాపాదించుననియు, చీరాల పేరాల మహాయజ్ఞమునకు భంగకరమనియు, తదుల్లంఘనము దేశీయ మహాసభా శాసనానుసారము గాకపోయినను తదాదర్శములకు బ్రధాన పోషకమనియు, నవశ్యక ర్తవ్యమనియు, వీరపురుషోచితమనియు, శ్రీరామాజ్ఞ యైనందున నయ్యాది శిరసావహించి బ్రహ్మపురము నుండి శ్రీకృష్ణ జన్మస్థానమున కేగుచున్నాను.

"ఇంతవరకు భవదీయ సేవాపరాయణుడనై ధన్యుండనైతిని. ఇకముందు శ్రీ రామరాజ్యస్థాపన యెన్నడుజరుగును?

తిరిగి తమసేవయెన్నడు లభించును? అని నిరంతరమా పురుషోత్తముని చరణకమలములు భజించుచుండెదను. శ్రీగాంధీ గురూత్తముని చరణారవిందములు హృత్పీఠమున ధరించి సంతత స్వరాజ్య మంత్రజపమున కాలముగడపుచుండెదను. అమ్మహామహుని యాదేశము సవ్రతిహతముగ, నిర్వివాదముగ, నిష్కళంకముగ, నిశ్చల మనస్కులై, కొనసాగించెదరు గాక! యని మీకు సాష్టాంగ ప్రణామ పురస్సరముగ విన్నవించుకొన్నాను. ఆంధ్రనాయకు లందరును సత్వర స్వరాజ్యసిద్ధికై ఆత్మసమర్పణము జేయవలసిన సమయము వచ్చినది. మనముపోయిన ముప్పువాటిల్లును. ఉద్యమము భంగపడును" అని సంశయింపకుడు. శ్రీరామచంద్రుడే మన నాయకోత్తముడు. నిరంతర మీమహోద్యమమును కని పెట్టియున్నాడు. ఒక్కొక్కరు కారాగృహము బ్రవేసించిన వారిస్థానమున నూర్గురు శ్రీరామకింకరులు బయలుదేరవలెను. కారాగృహ యాత్రసహాయనిరాకరణ వాదులకు నిత్యకృత్యము. శాసనోల్లంఘనము కూడదనియు, అయ్యది స్వదేశోద్యమము నాటంకపఱచుననియు, దలంచుటభ్రమ, శాసనోల్లంఘనము గావించి ఆంధ్రవీరులు కారాగృహమున కేగినకొలది స్వదేశోద్యమము తప్పక వేయిమడుంగు లభివృద్ధి జెందగలదు. ఇది నిస్సంశయము. ఆంధ్రసాంప్రదాయసిద్ధమగు శ్రీరామదండును యావదాంధ్ర మండలంబుల సమస్త గ్రామములలో వెంటనే నెలకొల్పి, రామసైన్యమే శాంతి సైన్యమగుటం జేసి, శాంతిమార్గమున శ్రీరామచంద్రుని కరుణాకటాక్ష వీక్షణములచే రామకార్యమగు స్వరాజ్య సంస్థాపనము నచిరకాలముననే సాధించెదరుగాక.

"మీ ముద్దుసోదరులు చీరాల పేరాలవాసుల భావిస్థితి శ్రీరామచంద్రుని పరిత్యక్తస్వరూపులగు నాంధ్రమహాజనుల కప్పగించితినను ధైర్యమున నిర్విచారముగ నేగుచున్నాను. మా చీరాల పేరాలను వేయివిధముల గనిపెట్టియుందురు గాక యని ప్రార్థించుచున్నాను. శీఘ్రముగ స్వరాజ్యలక్ష్మి కళ్యాణ మాంధ్రవీరులకు చేకూరుగాక!

స్వస్తి ప్రజాభ్యః పరిపాలయంతాం
న్యాయ్యేన మార్గేణ మహీంమహీశాః।
గో బ్రాహ్మణేభ్యః శుభమస్తు నిత్యం
లోకాస్సమస్తాస్సుఖినో భవంతు॥

ఇట్లు
దుగ్గిరాల గోపాలకృష్ణయ్య."

గోపాలకృష్ణుడు తన కోర్టు స్టేటుమెంటులో చెప్పిన భావములు ధీరవచనములు, భావగర్భితములు. కాని స్థలవిస్తర భీతిచే వానిగూర్చి యిట ప్రస్తావింప వీలులేదు. కాని స్వరాజ్య నిర్వచనముగూర్చి యాతడు తెల్పిన రెండు అంశములను మాత్ర మిట నుదహరించుట యవసరము.

"స్వరాజ్య" మనగా యెల్లరకు నిలువనీడయు, కుడువ గూడును, కట్ట బట్టయు నొసంగి, యెవని విశ్వాసముకొలది వాని మతావలంబనమున కవకాశము నొసంగునది యని గోపాలకృష్ణుని నిర్వచనము.

అటులనే స్వరాజ్యమనగా, హిందూధర్మము, ఇస్లాము ధర్మము, క్రిస్టియన్ ధర్మము, శిక్కుధర్మము, పార్శీ ధర్మము, వీని యన్నిటియొక్కయు స్వధర్మముల సమ్మేళన ధర్మమని యాతడు తన వాఙ్మూలములో తెల్పిన సూత్రము కేవల మన

రాజకీయ అవసరములకే కాక, సాంఘిక, మత సమన్వయము నకును కీలకమని చెప్పినచో అతిశయోక్తి కానేరదు.

గోపాలకృష్ణుని రూథర్ ఫర్డు దొర ఆజ్ఞోల్లంఘనకై విచారణచేసి ఒక యేడాది విడిశిక్ష విధించెను. దరిమిలా బందరు జిల్లా మేజస్ట్రేటు తిరిగి రాజద్రోహమునకాతని విచారించి, తొమ్మిది మాసములు శిక్ష విధించెను. ఈ రెండుశిక్షల నొక్కే సారి అనుభవించి, 1922 అక్టోబరు 2 వ తేదీన తిరుచునాపల్లి జైలునుండి యాతడు విముక్తుడయ్యెను.

## 13. జైలువిమోచనము-ధర్మప్రబోధము.

ఆంధ్రరత్నము తిరుచినాపల్లి జైలునుండి ది 2-10-22 న విడుదలయైనట్లు మనము వెనుకటి అధ్యాయమందు చదివితిమి. జైలు గుమ్మమువద్ద యాతని సత్కరించినవారిలో శ్రీమాన్ సి. రాజగోపాలాచారి, వి. వి. యెస్. అయ్యర్, డాక్టర్ శంకర అయ్యర్, ఇ. వి. రామస్వామి నాయకర్, కె. సంతానమ్, ఎన్. రామనాథం గారలు కలరు. డాక్టర్. వి. వరదరాజులు నాయుడుగారును, రామనాథంగారును, యాకుబ్ హాసాన్ సేటు గారును గోపాలకృష్ణునితో కొంతకాలము కారాగృహమున సాహచర్యము సల్పిరి.

జైలు గేటువద్ద ప్రజలు గోపాలకృష్ణుని పుష్పమాలాలంకృతునిజేసి, వాలంటీర్లు తోడురాగా, యూరేగింపుతో పురమందిరమునకు గొంపోయిరి. ఆనాడే అచ్చట గొప్ప సభ జరిగెను. మౌల్వి సయ్యద్ ముర్తూజా సాహెబు గారధ్యక్షత వహించిరి. ఆ యుపన్యాసమందు గోపాలకృష్ణుడు జైలుజీవితమును

ర్చియు, చీరాల పేరాల యుద్యమమును గూర్చియు చెప్పి "చీరాల పేరాల ముందు రానున్న జగన్నాటకమున కుపోద్ఘాతము. శాసనోల్లంఘన, శాసనసభా ప్రవేశములగూర్చి మనము పోట్లాడకూడదు. నేనొక నూతనస్మృతిని వ్రాసి హిందూసంఘమును ఆధునిక అవసరములకై సంస్కరించెదను. ఇదియే నా జీవితవిధానము. ఇంతటనుండి నేనీపనికి పూనుకొందునని" ప్రకటించెను.

తిరుచినాపల్లినుండి గోపాలకృష్ణుడు శ్రీరంగక్షేత్రమున కేగి, కావేరీస్నానమాడి, రంగనాథుని సందర్శించి యీ దిగువ రీతిగ యాతని స్తుతించెను.

శ్రీరంగనాథ ప్రబోధమ్.

౧. కదావా కావేరీవిమల సలిలప్రాఙ్గణనట
చ్ఛుభాఙ్గం శ్రీరఙ్గం తమిళవ్యాదయు ధ్వాన్తదళనమ్
తనోత్యాతిథ్యం మే నిజసదసిబద్ధచ్యుతియుతే
ముహూర్తత్వాక్రోశన్నిమిషమివ నేష్యామి దివసాన్॥
౨. కదావా శ్రీరఙ్గే భవరసతరఙ్గే ఫణితలే
శయానం స్వారాజ్యాసన ఘనశయానం ప్రాణభజన్
అయేరఙ్గస్వామిన్ తమిళజన సంభావితవిభో
ప్రసీదేతి క్రోశన్నిమిష మివ నేష్యామి దివసాన్॥
3. శ్రీరఙ్గేశ కృపాళో తమిళజన సభాధ్యక్ష దీక్షాంతరఙ్గ
స్వారాజ్యానన్ద నిద్రాపరవశ ధృతము త్తిష్ఠభో రఙ్గనాథ
త్రేతాయాం రామచన్ద్రాకృతి ధృతభవతా ప్రీణితై ర్వాన్ధ్రభూమి
స్త్వాన్ద్రోహం వర్తమానాం తవ భవనకథాంవక్తు మత్రాగతోస్మి॥
౪. ప్రాచీభాగే విరాగే జగతి నతపతిక్షామ సంగ్రామకాభ్యాం
హిందూస్థానే పఠాణే ధృతభరతసుత ప్రాణహారే కృపాణే
ఆన్ధ్రాయాం ప్రాద్యవిద్యానగర నృపయశశ్శృఙ్గభఙ్గావసానే
ఆయాతా స్త్వాఙ్గ్లజాతి వణిజగణమిషేణాత్రి చిత్రస్థితస్త్రీ॥

౫. బిభ్రాణావామనత్వం ప్రథమమథ పృథివ్యాంతు సంపాద్య దేశాన్
ద్వీపాన్ యూరప్సమీపాం స్తదను దశదిశాక్రాన్త ఖండాన్తరస్థాన్
ఏషా సామ్రాజ్యశాలా జ్వలితరవి నిరస్తాంశు మాలావిశాలా
తేయే త్వాత్సాన్ద్రి నిద్రాపరవశ సమయస్వామ్య సా - ర్వభౌమ్యః॥

౬. వాణిజ్యార్థం సమాజః పరికలితమాతో ఽనేక వర్ణానభిజ్ఞాన్
దార్యావర్త ప్రవృత్తాఖిల కలహాతతే పంచతన్త్రి ప్రపశ్చమ్
నిక్షిప్యాక్షిప్య రాజ్ఞాం క్రమగమిత మథా సేతు శీతాచలాన్తం
ఆంగ్లే రాజ్యే ఖిలుమిళిత మ భూత్తస్య వశ్యావయాంతు॥

౭. క్షామాధిక్య స్తదానీం గత విమతనియన్త్ర స్వాన్తసంజాత నీతిః
విద్యాత్వప్రాచ్యవిద్యా విపశుజలఫలో ద్వృత్త పాషాణపణ్యా
యాత్ క్లాన్తిం ధరిత్రీ లవణమపి పణగ్రస్తమాస్తిక్య శూన్యాః
నిస్తే జాస్తే ప్రజావైప్యాత సకలకలోద్భూత నిద్రాదరిద్రాః॥

౮. ధర్మవ్యాఖ్యాన దానాధ్యయన జపతపశ్శీల సత్యవ్రతాదీన్
సన్త్యజ్యస్వీయధర్మా నసురపథచరా భూసురా దోషభూరాః
అన్యే శిక్షాజ్ఞహైన్యేత్వ హితజనవచో భిన్నభిన్నాన్తరఙ్గాః
సర్వేప్యాంగ్లేయదేయ త్వణభరణకణాః ప్రీతిముత్పాదయన్తి॥

౯. దృష్ట్వా దౌస్థిత్యమేత ద్వ్యధికృతమితి సంశోధ్య కారుణ్యసాన్ద్రిః
వ్యామోహవ్యూహదాహ ప్రతతులితగృహీతోగ్ర ప్రసత్యాగ్రహో యః
ప్రేమాక్రాన్త ప్రశాన్త వ్రతిప్రణుత మహీ మోహనాఖ్యో మహాత్మా
గాన్ధిస్వారాజ్యగన్ధి ప్రవిచల దధునాసఖ్య వైముఖ్యయోగమ్।

ది 3-10-22 న శ్రీరంగములో నొక బహిరంగసభ జరిగెను. ఆసభలోగూడ యాతడు హైందవ సంఘమందలి ఘోరములు, విభేదములఁగూర్చియే యాతడు ముచ్చటించి, వీటి నన్నిటిని రూపుమాపినఁగాని మనకు స్వరాజ్యము రాదనిచెప్పెను. శ్రీరంగము నుండి ది 4-10-22 న యాతడు చెన్నపురి జేరెను

గోపాలకృష్ణుడీ కాలమున నుద్భవించిన మహావక్తలలో నొకడు. తన యుద్యమప్రచారమునకై యాతడెన్నియో ఉత్తేజ

కరములగు ఉపన్యాసముల నిచ్చెను. ఆతని రాజకీయోపన్యాసములు వారి కథా కాలక్షేపములే! కాని యీరోజులలో నింకను తెనుగుసంస్కృతి వెనుకబడియుంటచేనేమి, మరే కారణముననైననేమి, యాతని ఉపన్యాసములు విశేషముగ గ్రంథస్థమొనర్పబడలేదు. కాని యాతడు ది 4-10-22 న చెన్నపురిలో సౌందర్యమహాలునందిచ్చిన యుపన్యాసము "ఆంధ్రపత్రిక" యు, 'స్వరాజ్య' (ఇంగ్లీషు) పత్రికలును దీర్ఘముగ బ్రకటించినవి. అటులనే ది 11-10-22 న యాతని బందరు ఉపన్యాసమును "కృష్ణాపత్రిక" ప్రకటించెను. వీనినుండి యీ క్రింది భాగములు పునర్ముద్రితములు.

సౌందర్యమహాల్ ఉపన్యాసము.

"జయ్! శ్రీమద్రమారమణ గోవిందోహారి

"ఈసభయందు ఆంధ్ర, ద్రావిడ, ముసల్మాన్ సమ్మేళన కలదు. కాన యిది పవిత్రమగు త్రివేణీ సంగమముతో తుల్యము. ఇచ్చటనున్న సిద్ధాశ్రీసరుల కందఱకు నా సాష్టాంగ నమస్కారములు...

"మన ఆంధ్రరాష్ట్రమునకు దేశభక్త కొండ వెంకటప్పయ్య పంతులు, కాశీనాధుని నాగేశ్వరరావు, టంగుటూరి ప్రకాశం పంతులుగార్లు ముగ్గురును త్రిమూర్తులు. వారు చెన్నపురిలో చేసిన ప్రయత్నముల వలననే యిప్పుడీనగరమునగూడ ఆంధ్రుల ప్రయోజకత్వమున కవకాశమేర్పడినది.

"నేను శ్రీరంగనాధస్వామివద్దకేగి "ఆంధ్రోహమ్" అని నేనే "ఇంట్రొడ్యూస్" చేసుకొన్నాను. ఈపాటి నీ నిద్రనుండి లెమ్మన్నాను. నీకొంపసంగతి చెప్పడానికి వచ్చేనన్నాను."

చీరాలప్రయత్నము విఫలమగుటకు ప్రజలలో ఐక్యభావము లేకుండుటయే ముఖ్యకారణమని చెప్పుచు, "వర్ణభేదము సర్వవినాశకరము. అయ్యది తొలగి, సాంఘికనైచ్యము, అస్పృశ్యత, అంత్యజ అగ్రజ భేదములు పోయినగాని, ప్రజలలో యేకత్వము లభించదు. రాజకీయములు మాత్రమే యిప్పుడు ప్రజల ఐక్యతకు కారణములు, ఆబలము చాలదు. ప్రబలమగు మతావేశముండవలెను. జాతి, మత, వర్ణవిభేదములవల్ల మనలో పరస్పరానురాగము నశించినది, కావుననే ఆజ్జోలంఘున నెగ్గదని మహాత్ముడుగ్రహించి, తనయుద్యమమును విరమించెను."

హిందూసంఘములో అన్నివర్ణములకు సమానగౌరవము కలుగవలెను. దేశమున అన్నిమతములవారికి మైత్రి కలిగింపుడు—అస్పృశ్యతను తొలగింపుడు—అని మహాత్ముడాజ్ఞాపించెను. అస్పృశ్యతను తొలగించుటయన తాకుట. తాకినంతమాత్రముననే ధన్యులమైతి మని వారు సంతసింతురని కాదు. ఆమాత్ర మవకాశమిచ్చినచో, తక్కినయభివృద్ధి అనాయాసముగనే కలుగును. ఇప్పుడు రైలుబండ్లయినను, నగరములందు, రాజ్యమార్గములలోను అస్పృశ్యత లేనేలేదు. కావున దానిని మహాత్ముడు దేశమంతటను వ్యాపింపజేయదలచెను.

"హిందూ మహమ్మదీయ మైత్రి స్థిరపడుటకైనను హిందూసంఘము ముందుగ చక్కబడవలెను. హిందూసంఘమందు సర్వసమత్వమేర్పడి, ఏకత్వము సిద్ధించినచో, హిందూమహమ్మదీయమైత్రి కరతలామలక మగును. హిందూసంఘములో నందఱు బ్రాహ్మణులే కావలయును. ఇతరవర్ణములెవ్వరు నుండరాదు. ఇప్పటి బ్రాహ్మణులను ముందు నిర్మూలించవలెను. ఏలయన,

బ్రాహ్మణ ధర్మమంతరించినది. బ్రాహ్మణులంతరించినచో, బ్రాహ్మణేతరులు నంతరించెదరు. పిమ్మట నూతన బ్రాహ్మణసృష్టి జరుగవలెను. అప్పుడు దేశమందొక్క బ్రాహ్మణవర్ణము తప్ప యితరవర్ణములుండవు......

"మన నాగరికత కంతకును మతమే మూలకందము. మహాత్ముడీ సత్యమునే కనిపెట్టెను. వర్ణాశ్రమమువలననే బ్రాహ్మణేతరుల కాగ్రహముకలిగి బ్రాహ్మణేతరోద్యమము బయలుదేరినది. వేదకాలమున ఆర్యులు జ్ఞానవిషయములను మాత్రము "రిజర్వుడు సబ్జెక్ట్సు" చేసి, తక్కినవానిని క్షత్రియాదులకు 'ట్రాన్స్ఫర్డ్ సబ్జెక్ట్సు'గ యిచ్చివేసిరి. అది మొదటి స్మృతి కాలము. రెండవ స్మృతికాలమున గీతాచార్యుడగు శ్రీకృష్ణుడు బ్రాహ్మణత్వము జన్మవల్లనే కాక గుణకర్మలవలన యని కాలానుగుణ్యముగ నిర్ణయించెను. మరల యిప్పుడు మార్పుకలిగినది. ఇప్పుడు తిరిగి యింకొక స్మృతి యవసరము...బ్రహ్మజ్ఞానము బడయుటకు ఛండాలునకు గూడ అర్హతయున్నట్లు కానుక శంకరుడే యొప్పుకొనెను. క్రైస్తవమతభిక్ష బొందినంతనే పవిత్రత కలిగినటుల బ్రహ్మోపదేశము కాగానే పాపచింత తొలగును.

"నేను దేశీయులందఱను 'బ్రాహ్మణులు'గ మార్చెదను. మీరందరీ యుద్యమము నవలంబించినచో మీకు ప్రబలమగు ఉత్సాహము కలుగును. అందఱు బ్రాహ్మణులగువరకు ఆజ్ఞోల్లంఘనము నవలంబించుటకు నేనంగీకరింపను."

పంజాబునందలి శిక్కులవలెనే ఆంధ్రదేశమునుండి నూతన బ్రాహ్మణోద్యమమును గోపాలకృష్ణుడు సంకల్పించెననియు, ప్రభుత్వమీ యుద్యమము నరికట్టజాలదనియు, అందఱు ఆంధ్ర

రత్నమునకు తోడ్పడుట తమవిధియనియు. సభాధ్యక్షతవహించిన శ్రీ టంగుటూరి ప్రకాశంపంతులు గారును. "ఆంధ్రరత్నము నేడు రత్నములు వర్షించెను. రామదాసు సర్వమానవులకు దాసుడై దేశదౌర్భాగ్యమును తొలగింప దీక్షబూనెను. మనమందరమూ తనికి తోడ్పడవలె"నని శ్రీ నాగేశ్వరరావు పంతులుగారును నుడివిరి. చెన్నపురినుండి యాతడు చీరాలకును అక్కడనుండి కూచినపూడికిని బోయెను.

# 14. బందరు ఉపన్యాసము.

ది 10-11-1922 వ తేద బందరు ఉపన్యాసమందుగోపాల కృష్ణుడిట్లు చెప్పెను.

"బార్డోలి తీర్మానమందు రెండు ముఖ్యాంశములున్నవి. (1) ఖద్దరుధారణ, (2) అస్పృశ్యతా నివారణము. ఇందు ఖద్దరనగా కుటీరపరిశ్రమల నుద్ధరించుట యని యర్థము. నవీన ఫ్యాక్టరీపద్ధతు లాపత్కరములు. ఫ్యాక్టరీలు మానవులను బానిసలుగ జేయును. ధనికుల పీడనమును బలపరచును. సంఘమును వైషమ్యపూరితమొనర్చును. మనము ఖద్దరు నిర్మాణములో కూడ ఫ్యాక్టరీపద్ధతుల నవలంబించకూడదు. ఎవరికి కావలసిన నూలును వారే వడకి బట్టలు నేయించుకొనవలెనే కాని, వస్తువుల నుత్పత్తిచేయువారు వేరు. వస్తువులను స్వీకరించువారు వేరు, అను భేదముండకూడదు. అప్పుడే కూలివాడు స్వతంత్రుడు కాగలడు. కాని ఫ్యాక్టరీ పద్ధతిలో కూలియెక్కువచేసినను కూలివాడు కూలివాడుగనే యుండును. కూలియనుపద్ధతి దూష్యము.

"దీనికంటె ముఖ్యమైనది — అస్పృశ్యతా నివారణము. ఇది భావగర్భితమైన విషయము. కాంగ్రెసు ఒక్క హిందువుల సంస్థ మాత్రమే కాదు. అది క్రైస్తవులకు, మహమ్మదీయులకు గూడ సంబంధించిన సంస్థ. కావున మహాత్ముడు ఒక్క హిందూ సంస్కారణము మాత్రమే బోధించలేదు. మహమ్మదీయులకు అన్యమతసహిష్ణుతను బోధించెను. మహమ్మదీయులచే గోహింస మాన్పింపనెంచెను. వారియం దన్యమత సహిష్ణుతయు, సహనమును, గౌరవమును కలుగునటుల జేసెను. ఎప్పుడు హిందువులు మహమ్మదీయుల ఖిలాఫత్తును తమ స్వవిషయముగ జేసికొనిరో, అప్పుడే హిందువులు మహమ్మదీయుల హృదయముల నాకర్షింపగలిగిరి. ఇక మహమ్మదీయులు హిందువులను కాఫరులని పిలువజాలరు. మహాత్ముడు హిందూమహమ్మదీయ సఖ్యతకు వలయు పునాదిని వేసెను. అతడు క్రైస్తవులకు గూడ సందేశము నొసంగెను. మహాత్ముడు క్రీస్తుయొక్క క్షమ, త్యాగములు తనయందు మూర్తీభవింపజేసుకొని పాశ్చాత్య క్రైస్తవ మతప్రచారకుల దురహంకారమును భంగపరచెను. కావుననే క్రైస్తవులకుగూడ క్రైస్తవేతరుడగు మహాత్ముడు పూజ్యుడగుచున్నాడు.

"ఇక హిందువుల కాత డస్పృశ్యతా నివారణను బోధించెను. అస్పృశ్యతయే హిందూసంఘమునకు వేరుపురుగైనది. ఈ దోషము స్పర్శయందు మాత్రమే లేదు. శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములనెడి పంచతన్మాత్రలయందు నీదోషము తొలగవలెననియే మహాత్ముని ఆశయము. అస్పృశ్యతా దోషము తొలగనంతవరకు స్వరాజ్యము సిద్ధించనిమాట నిక్కము".

"అస్పృశ్యతను తొలగించుట యననేమి? పంచములను

వీధియనుగుపైకి రానిచ్చినంతమాత్రమున అస్పృశ్యత తొలగించుట యగునా? ఇంకను వీధిగోడ యడ్డములేదా? కచ్చేరీ సావిడి లోనికి రానిచ్చినను అస్పృశ్యత నివారణకాదు. వంటింటికిని, కచ్చేరీ సావిడికిని గోడ లడ్డమున్నవి. ఈ పైపై మెరుగులతో సంస్కరణము గావించినంతమాత్రమున అస్పృశ్యతాదోషము తొలగదు. కావున యీ విషయమును లోతుగ తరచిచూడ వలెను. వర్ణసాంకర్యము కలియుగధర్మము. పేకను తిరిగి కలిపిన గాని క్రొత్తయాటకు వీలుండదు. ఈగడ్డ మెప్పుడువుట్టెనో, అప్పటినుండియు బ్రాహ్మణులు పెద్దలుగ నెంచబడుచుండిరి. బ్రాహ్మణు లెప్పుడును రాజ్యముచేయనిమాట నిజము. మొదటి నుండియు బ్రాహ్మణేతరులే రాజులుగ నుండుచువచ్చిరి. కాని యెవరు రాజ్యాధిపత్యము వహించినను, బ్రాహ్మణులు గౌరవింపబడుచునేయుండిరి. బ్రహ్మోపదేశమును, ధర్మనిర్ణయమును, బ్రాహ్మణులే చేయుచుండిరి. కాని నేడాస్థితిగతులు తారుమారైనవి. బ్రాహ్మణుడే నేడు అస్పృశ్యుడైనాడు. తాలూకాబోర్డులలో గూడ బ్రాహ్మణునకు సభ్యత్వము లభించుటలేదు. ఉద్యోగములకిక బ్రాహ్మణులు నీళ్ళువదలుకొనవలసిన సమయము వచ్చినది బ్రాహ్మణులు ఛండాలురకంటె నీచమైరి.

"ఓ బ్రాహ్మణులారా! మీస్థితినిగూర్చి మీరేమి తలపోయుచున్నారు? స్త్రీలవలె విలపించెదరా? లేక మీతరుణోపాయమును మీరు చూచుకొనెదరా? ఇంకను మీయాధిక్యత యెక్కడ? బ్రాహ్మణులపై తిరస్కారము మెండైనది. క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు, ఛండాలురు, అందరు బ్రాహ్మణులపై కత్తికట్టుచున్నారు. బ్రాహ్మణులలో నేదైన యింగిత

జ్ఞానము మిగిలియున్నచో నది ప్రకాశించవలసిన తరుణమాసన్న మైనది.

"ఎల్లరును పైకిపోవుటకు జూచెదరు కాని ఛండాలురగుటకు సమ్మతించరుగదా! బ్రాహ్మణ్యమే యెల్లర లక్ష్యములోనున్నది. వైశ్యులు ద్విజత్వము నాశించుచున్నారు. శూద్రులలో కొంద రిటీవల యజ్ఞోపవీతమును ధరింప నారంభించిరి. కంసాలులు విశ్వబ్రాహ్మణుల మనుకొనుచున్నారు. ఎల్లరు అగ్రవర్ణములలో లీనమగుటకు గోరుట సహజము. ఎల్లరలో సమధర్మము ప్రతిష్ఠించవలెనని అందఱను బ్రాహ్మణుల జేయుటయే అవశ్యకర్తవ్యము. ఇప్పుడు క్రొత్తగ బయలుదేరిన బ్రాహ్మణేతరోద్యమమును బ్రాహ్మణోద్యమముగ మార్చవలెను. ఎవరు గాయత్రీ మంత్రోపదేశము బడయుదురో వారెల్లరు బ్రాహ్మణులుగ నంగీకరింపబడవలెను. ఎవరైననుసరియే, వైశ్యులైనను, క్షత్రియులైనను, శూద్రులైనను, ఛండాలురైనను, గాయత్రీమంత్రోపదేశముచే బునీతులు కావచ్చును.—ద్విజత్వము బొందవచ్చును. బ్రాహ్మణేతరోద్యమమును ప్రారంభించినది డాక్టరు నాయరుగారని మీరనుకొనుచున్నారు కాబోలు. నాయరుగారి పద్ధతివల్ల బ్రాహ్మణేతరులకు నిజముగ అభ్యున్నతి సిద్ధింపజాలదు. బ్రాహ్మణేతరులకు బ్రాహ్మణత్వమిప్పించుటకు మొదట ప్రయత్నించినది విశ్వామిత్రమహాఋషి. ఈతడు బ్రాహ్మణేతరుడయ్యు, బ్రహ్మజ్ఞానమును సాధించి బ్రాహ్మణత్వము స్వీకరింపగలిగెను. గీతాచార్యుడు వర్ణవిభాగమును కేవలము జన్మవల్ల కాక గుణకర్మలచే చేయజూచెను. గౌతమశాక్యముని నిర్వాణమార్గమును వర్ణవిభేదము పాటింపక యెల్లరకు జూపెను. కాని

యీ ప్రయత్నములన్నియు విఫలమైనవి, సంఘైక్యతకు పునాది వేయగలిగిన తత్త్వము నిరూపించవలసియుండెను. శ్రీ శంకరాచార్యులవా రద్వైతమతమును స్థాపించి, సంఘైక్యతకు శంకుస్థాపన గావించెను. కాని శంకరుడు తత్త్వరూపేణ సిద్ధాంతీకరించిన అద్వైతతత్త్వము ధర్మమందు స్మృతిరూపముగ నిరూపించకపూర్వమే యాతడు పరమపదించెను. శంకరుని పిమ్మట శ్రీరామానుజుడు సకలవర్ణములవారికిని తిరుమంత్రము నుపదేశించెను. సకలవర్ణములవారిని రామానుజకూటమందు జేర్చుకొనుచుండెను. కాని యీతనికూడ పూర్తిగ కొనసాగలేదు.

“నేడీపనిని సఫలపరచుటకు శ్రీ గాంధీమహాత్ముడే యుగప్రవక్తగ బయలుదేరెనని నానమ్మకము. ఆతని అస్పృశ్యతానివారణవిధి సంకుచితభావముతో గూడినదికాదు. సత్యము, అహింస, యీ రెండును బ్రాహ్మణలక్షణములు. అన్నివర్ణములలో యీ రెండులక్షణములు ప్రకాశింపజేయ బూనుట యననేమి? ఎల్లరను బ్రాహ్మణులుగ జేయుటయే యని మనము నమ్మవలెను. వృత్తులు, చిత్తవృత్తులు కలసియున్నప్పుడే వర్ణవిభాగము సాధ్యమగును. కాని అవి వేరుముఖములు దాల్చినప్పుడు వర్ణసాంకర్యము తప్పదు. నేను బ్రాహ్మణుడను. ఇతరులను బ్రాహ్మణులజేయుటకు నాకధికారముకలదు. పూర్వాచారపరాయణులైనను ఒక్కవిషయమును గమనించవలెను. ప్రస్తుతము మన హిందూసంఘము బహు ఆపద్దశలోనున్నది. వైషమ్యములలోనుండి పరరాజ్యసేవ జేయుచున్నది. ఈ వైషమ్యమును తొలగించి, సంఘైక్యతను సాధించుటకు మీరు మార్గము గనుగొనదరా? అద్వైతతత్త్వమును వ్యవహారములో ననుష్ఠించుట

కస్పృశ్యత అడ్డు రాదని యెవరు చెప్పసాహసించెదరు? మీ శాస్త్ర ప్రమాణములటుంచి. ఆపద్ధర్మముగనైనను యెల్లర నొక ప్రేమ పాశమున బంధించుట అవసరము కాదా? బ్రాహ్మణధర్మమును నిలుపవలెనన్నచో యెల్లరలో బ్రాహ్మణతిరస్కారము ప్రబలుట శ్రేయస్కరమా? లేక యెల్లరు బ్రాహ్మణులగుటకు మార్గము జూపుట యుక్తమా?

"నేను గాయత్రీమంత్రోపదేశముచే యెల్లరకు ద్విజత్వము నిప్పించుటకు సంకల్పించుకొన్నాను. తక్కిన ఆచారములతో నాకు నిమిత్తము లేదు. ఎవరియిష్టము వారిది. బ్రాహ్మణులలోమాత్రమొకేవిధమగు ఆచారములున్నవా? ఆహారవిహారములందు, వివాహములందు, కట్టుబొట్టులయందు, వృత్తులయందు, యెవరికులముల ప్రకారము వారుండవచ్చును. కాని యెల్లరును గాయత్రీ మంత్రోపదేశమునుబొంది, అహింసా వ్రతమును, ఖద్దరుధారణను స్వీకరింపవలెను. ఈ మూడే బ్రాహ్మణునకుండవలసిన నియమములు. నేను ప్రతి గ్రామమునందొక బ్రాహ్మణగోష్ఠి నెలకొల్పెదను. ఇందు జేరువారెల్లరు బ్రాహ్మణులుగ నెంచబడుదురు. ప్రతిగోష్ఠియు నొక విద్యాలయమును నొక వైద్యాలయమును నెలకొల్పవలెను. వీనికంగములుగ నొక గ్రంథాలయమును, సహకార పరపతి సంఘమును, పంచాయతికోర్టును స్థాపించవచ్చును. వీనిమూలమున యీగోష్ఠికి గ్రామపాలనాధికారము సిద్ధించును. ప్రతిగ్రామమును యీ విధముగ బలపడినయెడల సంఘీభావము కరతలామలకమై స్వరాజ్యము సుసాధ్యమగును."

ఈయుపన్యాస పరంపరల యనంతరము గోపాలకృష్ణుడు

1923 జూలై నెలలో నాగపురియందు జరిగిన అఖిల భారత కాంగ్రెసు ప్రధాని యగుటయు, కాంగ్రెసు కార్యాలయమును విజయవాడకు చేర్పించుటయు; జూలై మొదలు డిశెంబరు ఆఖరు వరకు తన హయాములో సెప్టెంబరులో ఢిల్లీ అవసర కాంగ్రెసు మహాసభయు, డిశెంబరులో కాకినాడ కాంగ్రెసును దిగ్విజయముగ జరిపించుటయు; తదుపరి 1924 జూలైలో ఆంధ్రరాష్ట్ర కార్యదర్శియై, నవంబరులో స్వరాజ్యపార్టీలో జేరుటయు; యింతలో శరీరమస్వస్థతచే 1925 నాటికి తిరిగి చీరాల జేరుటయు; అప్పటి గోపాలకృష్ణుని చరిత్రయందలి ప్రధానఘట్టములు.

## 15. బార్డోలి ఉపసంహారము.

గోపాలకృష్ణుడు జెయిలులో నుండగా దేశములో విపరీతముగు మార్పులు తటస్థించెను. స్వరాజ్యోద్యమము ప్రజలలో నత్యుత్సాహముతో ప్రబలెను. వేలకొలది ప్రజాసేవకులు సంతోషముతో కారాగారముల కేగిరి. ఆలీసోదరులు, దాసు, నెహూరు, లజపత్రాయ, అజాద్, వెంకటప్పయ్య మున్నగు నాయకులెందరో జైళ్ళనలంకరించిరి. అనేకమంది స్త్రీలును యిడుములబడజొచ్చిరి. కాంగ్రెసులో కోటిమంది సభ్యులు జేరిరి. తిలకు స్వరాజ్యనిధికి కోటిరూప్యములు విరాళములు వసూలయ్యెను. బ్రిటిష్ యువరాజు బొంబయిలోను, కలకత్తాలోను అడుగుపెట్టినప్పుడు పట్టణములు పాడుపడినట్లు "హర్తాళములు" జరిగినవి. అనేకమంది ఉద్యోగములు మానిరి. ప్లీడర్లు కోర్టు బహిష్కరించిరి. దేశములో నచ్చటచ్చట వ్యక్తిశాసనోల్లంఘన ఆరంభమయ్యెను. సంవత్సరాంతమున గుజరాతునందలి బార్డోలి

తాలూకాలో గాంధీమహాత్ముని నాయకత్వమున సంఘవిప్లవమును, పన్నుల నిరాకరణమును సంకల్పింపబడెను. విదేశవస్త్ర బహిష్కారము, స్వదేశీ యుత్పత్తి జోరుగ సాగిపోయెను. ఇంతలో చెలమ్స్‌ఫోర్డు ప్రభువు వైస్రాయి పదవి చాలించుకొనిపోయెను. రీడింగ్‌ప్రభువు క్రొత్త వైస్రాయి అయ్యెను.

గాంధీమహాత్ముడు రీడింగుతో ముందు కొన్ని మంతనములు జరిపెను. కాని యుభయులకు సంధికుదురలేదు. 1922 లో బార్డోలీ సత్యాగ్రహము నారంభింతునని గాంధీమహాత్ముడు శపథము జేసెను. ఫిబ్రవరిమాసములో సుముహూర్తమేర్పరుపబడెను. వైస్రాయిపేర తుదిలేఖను వ్రాసివేసెను. ఈలోగా ఉత్తరప్రదేశమందు చౌరీ చౌరా యనుచోట కొందరు కాంగ్రెసు వాలంటీర్లు దౌర్జన్యమునకు గడంగిరి. అంతకుపూర్వమే బొంబయిలోను, మలేగాం, మలబారునందును అచ్చటచ్చట దౌర్జన్యము పొడసూపెను. దేశమింకను తన అహింసాపథమునకు సంసిద్ధముకాలేదని గాంధీమహాత్ముడు భావించెను. బార్డోలి సత్యాగ్రహమునేగాక దేశమందలి ప్రతిఘుటనోద్యమమునంతను గాంధీమహాత్ముడు నిలుపుచేసి, నిర్మాణకార్యక్రమమును సూచించెను. దానితో ప్రజలలో యుత్సాహము సశించిపోయెను. నిస్పృహ ప్రబలెను. నిప్పుపై నీరుబోసినట్లంతయు చల్లబడిపోయెను. వెన్వెంటనే, యిదే తగినయదనని భావించి ప్రభుత్వము గాంధీమహాత్ముని ఖైదుజేసి, రాజద్రోహమునకు విచారించి, ఆరేండ్లు శిక్షించి, యర్వాడాజైలునందు నిర్బంధించిరి.

గాంధీమహాత్ముని బార్డోలీ నిర్ణయములను దేశమందలి వివిధరాజకీయ నాయకులు వరి వరి విధముల విమర్శించిరి. పలు

పురు తీవ్రముగ ఖండించిరి. గాంధీయుద్యమము దివాలాతీసెనని కొందరును, గాంధి దేశమునకు మహాపరాధ మొనర్చెనని మరి కొందరును, జెప్పసాగిరి. "వైరాయిలో మహాత్ముడు సంధి మార్గమునైన నవలంబించి యుండవలసినది. లేనిచో బార్డోలీ సత్యాగ్రహమునైన సాగించియుండవలసినది. ఇప్పుడిది ఉభయ భ్రష్టమైనది, అని చిత్తరంజనదాసు విమర్శించెను. ఈ పరిస్థితు లలో గాంధీమహాత్ముని చర్యగూర్చి గోపాలకృష్ణుని భావములు కేవల రాజకీయ దృక్పథమున కతీతమై, లౌకికపార లౌకికమార్గ ములు రెండింటికిని సమన్వయ సూచకములై యుంటచే వాని నిట పొందుపరచుట సమంజసము.

తే 4-5-1924 దీన మాడుగులలో జరిగిన విశాఖపట్టణ మండల మహాసభ కధ్యక్షత వహించుచు గోపాలకృష్ణు డిట్లుల నుడివెను.

"ఇప్పుడు మన దేశపరిస్థితుల నొకతూరి సింహావలోకన మొనర్చుకొనుట యవసరము. గతమూడేండ్లలో మనము కొంతఅనుభవమును గడించితిమి. ఆయనుభవము నిష్ప్రయోజ నము కాదు. విజయముకొఱకు మన మాతృత బడరాదు. మన యుద్యమ మాదర్శయుక్తమును, సాత్త్వికమైనదియు నైనది. అందువలన యేనాటికైనను మనకు విజయము కలిగితీరును. ఒక సారి ప్రబోధముగాంచిన దేశము మరల నిద్రాణము గాజాలదు. స్వరాజ్యమునకై మన సంప్రదాయములకును, దేశీయాశయ ములకును దగిన సాధనమెద్ది యనునదే ప్రస్తుతము మనకు జింత నీయము.

"శ్రీ గాంధీమహాత్ముడు భగవదంశా సంభూతుడనియు,

అవతారపురుషుడనియు, యిచ్చట శిష్టసంరక్షణార్థమును, దుష్ట శిక్షణార్థమును జన్మించినవాడనియు మన మెఱుగుదుము. ఆతని దౌర్జన్యరహిత సహాయ నిరాకరణోద్యమ సాధనను మిత్రులును, శత్రులును యెల్లరు సంగీకరించిరి. మన దేశపరిస్థితులకిదియే తగియున్నదని భావించిరి. క్రైస్తవప్రపంచము గౌరవించిరి. మహమ్మదీయు లీమార్గము ననుష్ఠించుట కంగీకరించిరి. హిందువులకీ మార్గములో మనజాతి పొందదగిన నైతికాధిక్యత గోచరించు చున్నది. ఇతరులకీ మార్గము క్రొత్తగా గాన్పించవచ్చును. కాని భారతమార్గములో జోల్పుచూపినవారు వ్యాసాది మునులే. భాగవత మార్గ మనదగును."

బార్డోలీ సత్యాగ్రహమునుగురించి ప్రస్తావింపుచు గోపాల కృష్ణుడిట్లు చెప్పెను.

"బార్డోలీ తీర్మానములయెడ దురభిప్రాయము వారల ప్రబలినది. మహాత్మునకు నైసర్గికమైన తన యంతరదీక్ష ననుసరించి ముందుకేగ సాధ్యమై యుండవలసినది. లేనిచో కలకత్తాలో నైసర్గికముతో యేదైన నొక సమాధానమునకైన వచ్చియుండవలసినదని చెప్పెదను. నిజమే. మహాత్ముడు తుది జాబు వ్రాసియుండెను. పదిరోజులు గడువుపెట్టెను. సమా ధానము కుదురనిచో శాంతిసమరము తప్పదనెను. ఇది చాల తీవ్రమైన చర్యయే. ఆతడు దేనిపై సాధింపదలచెను! ఆ సమయ మందు మనలో ఐక్యత ఇంకను లేదని యాతడెరుగడా! అస్పృశ్యత యింకను అంతరించలేదని యాతడెరుగడా! సత్యాగ్రహ కార్యక్రమమందలి అనేకాంశములును యింకను పూర్తికాలేదని యాతడెరుగును. కాని అప్పటి మన యుద్యమవైఖరికిని

యిప్పటి స్థితికిని చాల తారతమ్యమున్నది. అప్పట్లో మనము రాజకీయముగ మాత్రమే జాత్యైక్యతను వాంఛించితిమి. మనలో మనకు గల మత సాంఘిక భేదములను గూర్చి మనము లెక్క పెట్ట లేదు. ఒక్క శాసనముతో స్వరాజ్యసిద్ధియైన వెంటనే యీ భేదముల నన్నింటిని తుడిచిపెట్టవచ్చునని మన మాశించితిమి. మనము కోరిన విధముగ రాజకీయైక్యత సిద్ధించెనని మహాత్ము నకు దోచెను. యువరాజు రాకసందర్భమున జరిగిన అద్భుతా హార తాళములు, ముప్ఫై వేలమందిని జైళ్ళకుబంపిన ప్రజలఅమితో త్సాహము, శాంతికొఱకై ప్రభుత్వము జూపిన ఆతృత, సం సిద్ధత,—యివన్నియు నునుమయమే తెంచెననియే సూచించెను. తన తపస్సు సిద్ధింపనున్నదని మహాత్ముడు భావించెను. ఆ సమ యమందు కాంగ్రెసువారందరును యాతని సంపూర్ణముగ శరణు జొచ్చిరి. కాని యింతలో దుశ్శకునము లగుపడెను. ఏదో విషమ పరిస్థితి యేర్పడనున్నట్లగపడెను. ఈ పరిస్థితిలో సత్యాసాధకుడు చేయదగు పనియేమి? మహాత్ముడాలోచింప జొచ్చెను.

"ఆతనికి రెండుమార్గములున్నవి అందొకటి, యెట్టికష్టన ములు వచ్చినను వాటిని నిర్లక్ష్యము జేసి ముందుకుబోవుట. 'ఈ దుర్నిమిత్తములకు నేనేల బెదరవలెను? వైరాగ్యికి తుది లేఖ వ్రాయుమని నన్నెవరు ప్రేరేపించిరి? భగవంతుడుకాదా? ఆ భగవానుడిచ్చటి యథార్థ పరిస్థితుల నెఱుగడా! నేనాతని చేతులలో కేవల నిమిత్తమాత్రుడను. నన్ను పరీక్షించుటకే యాతడీ దుర్నిమిత్తములను బంపెనేమో? నేను వీటిగూర్చి యోచింపజనదు. పరమేశ్వరుడెప్పుడును సంసిద్ధుడే! ఆతనిగూర్చి మాత్రమే నేను యోచింపదగు. ఆతడే నన్నింతవరకు నడిపించిన

వాడు. కావున యీ హృదయదౌర్బల్యము పనికిరాదు. ఇది దుశ్శకునమే యగుచో యాతడీ హెచ్చరికలను యింతకు పూర్వమే యేలబాపలేదు? అట్లు కాజాలదు. ఏమైనను సరే— ఏమి మూడనున్ననుసరే! నేను ముందుకు పోవలసినదే! ఈ దేశములో స్వరాజ్యము లేనిచో జీవించుట నిష్ప్రయోజనమని నేనిది వరకే యుంటిని. కావున నే నీ యుద్యమము నాపకూడదు.

"ఇది యొకమార్గము. ఇందలి వివేకము పారలౌకిక వివేకము. ఇచ్చట తీర్పుజెప్పుటకు మనము పనికిరాము—మనకర్హత చాలదు. ఈ మార్గములో మనమణుమాత్రమును సాధింపలేదు. కాని యొక్క విషయముమాత్రము మనము చెప్పవచ్చును. మహాత్ముడీ మార్గము నవలంబించుచో యాతడు మన గురు పరంపరలోనికి వెళ్ళియుండెడివాడు. బహుశః యాతని జీవితమంతె మొందెడిదేమో? దాని ఫలితముగ దేశమంతయు నొక గొప్ప జీవాహారముత్పన్నమయ్యెడిది. ఆ మహాజ్వాలలలో మనకు స్వరాజ్యము లభించెడిదేమో! ఎవరుచెప్పగలరు?

"ఇందలి రెండవమార్గము లౌకికవివేకమునకు సంబంధించినది. 'ఈ జాతీయోద్యమములో ప్రతి కార్యక్రమమునకును నేను బాధ్యుడను. ఇందు నే నేమాత్రము అజాగ్రత్తగ నుండరాదు. ఇప్పుడు భగవంతుడీ దుశ్శకునమును బంపెను. దీనిని నేను గుర్తించి తీరవలెను. ఇతరులు నన్ను నిందించి, దూషించి, అపహాస్యము జేసిన జేతురుగాక! నేనిప్పు డడ్డుకొననిచో యీ జాతి యధః పతనమునందును. ఇందువిషయమై యితరులకు మున్ముందు కాని బోధపడదు. ఈ యుద్యమము నిప్పుడు ఆపి వేయక తప్పదు. దానివల్ల మన కెంతనష్టము వచ్చిననుసరే.

దీని నాపుటయే యిప్పటి నా కర్తవ్యము.

"ఈ రెంటింటిలో యేమార్గము నవలంబించవలెనో నిర్ణ యించుటకు ఆ మహాత్ముడొక్కడే అధికారి. ఆతడు రెండవ మార్గము నవలంబించెను. ఇందుకై మనమాతనికి కృతజ్ఞులము. ఆతడు మొదటిపద్ధతి నవలంబించినచో మనమాతని కెక్కుడు ఋణపడియుండెడివారమేమో? కాని యిందు మహాత్ముని చర్యను ఖండించుటకు మన కధికారము లేదు. బార్డోలీ యుప సంహారమువల్ల మనకుగలిగిన నష్టమెద్దియు లేదు. విజయసమయ మునగూడమనము వెనుకకుతగ్గినచో ముందు ముందు మనకింకను యెక్కుడు విజయములే చేకూరును. కావున మానవదృష్ట్యా మహాత్ముని చర్యలో నెట్టిదోషమును లేదని నాయభిప్రాయము. ఆతడెన్నటికిని తప్పుజేయడని మన విశ్వాసము. ఆతని చర్యను మనమా సమయమందే ఖండింపజాలకపోయితిమనుట యొకటే ఆతని చర్యను సమర్థించుచున్నది. అందుచే బార్డోలీ యుప సంహారము యుక్తమనియే తోచును."

## 16. గోపాలకృష్ణుని మతము.

గోపాలకృష్ణుడు జైలునుండి విడుదలకాగానే తిరుచినా పల్లి, శ్రీరంగము, చెన్నపురి, బందరు మున్నగు స్థలములయందు దాతడిచ్చిన యుపన్యాససారమును వెనుకటి అధ్యాయమునందు కొలదిగ చవిజూచి యున్నాము. గోపాలకృష్ణుని రాజకీయ సేవ యెంత గొప్పదైనను, ఆతని రాజకీయములకంటె మత సంస్కా రిమే యెక్కుడనియు, ఆతనిని రాజకీయవేత్త యనుటకంటె మతప్రవక్త యనుటయే యెక్కుడు సమంజసమని భావించుటచే,

గాతని మహోద్దేశ్యములగూర్చి ప్రత్యేకముగ బరిశీలించుట యుచితము.

దాస్యబద్ధమగు ప్రతిదేశమందును ప్రభుత్వ కారాగార వాసమే ప్రతి వీరపురుషునియొక్కయు సామాన్యధర్మమై యుండును. అందుచేతనే కాబోలు యీకలియుగారంభమందు యుగపురుషుడని ప్రఖ్యాతిబడసిన శ్రీ కృష్ణభగవానుడు జైలునందే యవతరించెను. గత యేబదియేండ్లలో తిలకు, దాసు, గాంధీ, నెహ్రూ, లాలాజీ, సావర్కార్ సోదరులు, మాలవ్యా, ఆలీ సోదరులు మున్నగు మహనీయులెందరో తమజీవితమందు కొంత కాలము జైళ్లలో గడపుచువచ్చిరి. ఇట్టి బంధితులు జైళ్ళలో తమకు గలిగిన విశ్రాంతిలో దేశ పరిస్థితిని సమగ్రముగ నూహించి, తమ విమోచన సమయమున దేశీయులకు తమ భావముల నొక సందేశరూపమున బ్రకటించుట సామాన్యానుభవము. ఇట్టి సందేశముల నొసంగిన భారతవీరులలో శ్రీ అరవిందఘోష్, ఆంధ్రరత్న గోపాలకృష్ణుల నామములు సుప్రసిద్ధములు.

శ్రీ అరవిందులు 1910 లో ఆలీపూర్ జైలునుండి విముక్తుడై నపిమ్మట తన "ఉత్తరపర" యుపన్యాసములో "సనాతన ధర్మోద్ధరణ"యే తన జీవితాశయమని ప్రకటించెను. అటులనే శ్రీ గోపాలకృష్ణుడును ఒక నూతన బ్రాహ్మణ మతస్థాపన తన ఆశయమని నుడివినటుల మనము లోగడ చదివియున్నాము.

"సనాతన ధర్మము" — "బ్రాహ్మణ మతము" — ఈ రెండును ఒక్కటే—బొమ్మయు, బొరుసునని చెప్పవచ్చును.

కాని గోపాలకృష్ణుని బ్రాహ్మణధర్మము ప్రస్తుతమా

పేరిట బరగు హిందూమతమేనా! లేక ఆ రెంటికి నెద్దియైన భేద మున్నదా? ఉన్నచో యెట్టిభేదము? ఆంధ్రరత్న సంకల్పమందలి యాతని నిజాశయము లెట్టివి? అవి యీకాలమం దెంతవరకు సమంజసము? ఆచరణీయము? ఈ ప్రశ్నలకు మనము సరియగు సమాధానములను తెలుసుకొననిచో ఆతని చరిత్ర జదివియు బ్రయోజనముండదు.

గోపాలకృష్ణుని "బ్రాహ్మణ ధర్మ"మనగా ప్రస్తుత భారతావనిలో పెనుభూతముగ వెలసి, హిందూ—ముస్లిమేతర కక్షలకుగాని, లేక హైందవాతర్గత బ్రాహ్మణ, బ్రాహ్మణేతర, ఆర్య, ద్రావిడ, స్పృశ్యాఽస్పృశ్యాది విభేదములకుగాని కారణ భూతమగు నొక పిశాచము మాత్రము కాదని మనము జ్ఞాపక ముంచుకొనవలెను. ఇప్పటి మన మత, కుల, శాఖా, లింగ భేదములు మన సంఘమును పీల్చి పిప్పి జేయుచున్న ననుట నిర్వివాదాంశము. ఈ పీడ నిప్పుడు తొలగించి, యిందలి చిత్తవృత్తుల నన్నింటిని సమన్వయ మొనర్చి, అంధకారబంధురంబగు యీ విశాల ప్రపంచమందు తిరిగి జ్ఞానజ్యోతిని—బ్రహ్మజ్యోతిని-వెలిగించుటయే శ్రీ వివేకానంద, ఆంధ్రరత్నగారల "బ్రాహ్మణ" ధర్మ సంకల్పముల కంతరార్థము.

కాని యీ "బ్రాహ్మణ" శబ్దము కేవల మొక శాఖకు జెందినది కాదా? ఇందుకు సమాధానము. ఈశబ్దనిర్వచనమందు "బ్రహ్మాన్వేషకుడు బ్రాహ్మణు"డని గోపాలకృష్ణుని నిర్వచనము. భారత సంప్రదాయమందు "బ్రహ్మ" శబ్దమునుమించిన శబ్దము లేదని మెక్డోనల్ పండితుడు వ్రాసెను. ఇచ్చట ప్రజాపతి బ్రహ్మ-బ్రహ్మలిపి – బ్రహ్మముడి — బ్రహ్మోపదేశము - బ్రహ్మచ

ర్యము - బ్రహ్మనివాహము - బ్రాహ్మముహూర్తము - "సర్వమ్ ఖల్విదం బ్రహ్మ" - ఇవన్నియు పవిత్రములు. ఇచ్చటి మత గ్రంథములలో బ్రాహ్మణములు ముఖ్యములు - అగ్రవర్ణమును బ్రాహ్మణులనిరి - బ్రహ్మగర్భ - బ్రహ్మసూత్రము - బ్రహ్మ జిజ్ఞాస ఉత్తమాదర్శము బ్రహ్మపదార్థమనియు యెల్ల రెఱింగినదే.

ఇంతియగాక పాశ్చాత్యుల బైబిలునందు సృష్ట్యాది "ప్రప్రథమమున అబ్రహామ్ ఉద్భవించె"నని యున్నది. అబ్రహామ్ - బ్రహ్మము - యీ రెండుపదములకెట్టి యన్యోన్యత యున్నదో పాఠకులే యూహింపగలరు. ఆంగ్లమందు "బ్రెయిన్" (Brain) అను పదము నీ "బ్రహ్మ" శబ్దముతో సంజనితమే. "బృహ" యనగ "పెరుగుట" యని అర్థము.

మన ప్రస్తుత కళాశాలలలో బి. యే., బి. యల్., బి. ఇ. డి., బి. యెస్. సి., మున్నగు స్నాతక బిరుదములలో 'బి' యనగా నేమో ఒక్కతూరి పరీక్షించినచో మనకిందలి ధర్మ సందేహము తొలగగలదు. "బి" యనగ "బేచిలర్" అనగ "బ్రహ్మచారి", లేక "బ్రహ్మమార్గమున చరించువాడు" లేక "బ్రాహ్మణు" డనియే భావము.

ఈ ప్రపంచమందలి హైందవులు, ముసల్మానులు, వైదికులు, అవైదికులు. ఏకజులు, ద్విజులు, స్పృశ్యులు, అస్పృశ్యులు, యెల్లరను "బి. యే." లుగ జేయుటకంటె, అందరు "బ్రాహ్మణులు" కావలయుననుట మనకెక్కుడు జాతీయమును, స్వసంప్రదాయసిద్ధమును, ప్రయోజనకరమును గాదా?

"బ్రహ్మము" వేదస్వరూపము - ప్రణవాత్మకము -

పౌరుషేయ, అపౌరుషేయ, సాధకము - ఆనందమయము - అట్టి "బ్రహ్మాన్వేషకుడు" బ్రాహ్మణుడని గోపాలకృష్ణుని నిర్వచనము.

1927 లో యాతడు ప్రథమ బ్రాహ్మణగోష్ఠిని నెలకొల్ప యత్నించినప్పు డా గోష్ఠి లక్ష్యలక్షణము లెట్లుండవలెనని యాత డాశించెనో లోగడ మనము చదివియుంటిమి. అట్టి లక్ష్యలక్షణ ములతో జీవయాత్రను సాగింప కృతనిశ్చయులైనవారే నిజముగ "బ్రాహ్మణులు."

కాంగ్రెసులో జేరువారు కాంగ్రెసువాదులు-కో ఆపరేటివ్ సంఘమందు చేరువారు కోఆపరేటివులు-జస్టిస్ పార్టీ లోనివారు జస్టిస్టులు - వర్తకమండలివారు వర్తకులు. అటులనే బ్రహ్మాన్వేషకులై బ్రాహ్మణగోష్ఠియందు జేరువారెల్లరును బ్రాహ్మణులే! ఇందు సంఘసమన్వయమే కాక మత సమన్వయము, గ్రంథ సమన్వయము, వివిధవృత్తి సమన్వయమును గాననగును.

హైందవ సంఘముయొక్క పరిస్థితిగూర్చి గోపాలకృష్ణుని భావములను బరీక్షించుచో యీ విషయమును మనము మరింత సులభముగ గ్రహింపగలము.

"మన దేశమం దిప్పుడొక మహావిప్లవ మవసరము. యుగయుగములనుండి మనలను బంధించిన పాశములను మన మిప్పుడు క్రూరముగ ఛేదించవలసియున్నది. జాత్యైక్యత, అస్పృశ్యతానివారణ - యీ రెండును యిందలి కార్యక్రమములు. వీనిని సాధించినగాని జాతి తిరిగి ముందుకు పోజాలదు."

అస్పృశ్యతా నివారణను మనము విశాలదృష్టితో చూడవలెను. హైందవులలో వందలాది యేండ్లుగ ప్రబలిన పాప విమో

సనావిధి యీ అస్పృశ్యతానివారణ. ఈవిధి తురకలకు సర్వమత సహిష్ణుతను బోధించును. మూఢులగు క్రైస్తవులకు క్రైస్తును బోధుక స్వర్గద్వారమున జేర్చుటకై యీమానవకోటికి యితర హితులను కలరని యీమంత్రార్థము. ధనోన్మత్తులకిది తమ నిరుపేద కార్మికులయెడ న్యాయవర్తనమును బోధించును. . .దీనివల్ల అన్నిమతముల, కులముల సమన్వయము మేర్పడగలదు."

"మన సాంఘికసమస్య గురించి నేను దీర్ఘముగ యోచించితిని. ఊరక వోట్ల సమత్వమువల్లగాని నైతిక సూత్రములవల్లగాని ప్రయోజనము లేదు. ప్రతిమానవుడును 'అణోరణీయాం మహతో మహీయాం' అను మహావాక్యార్థమును గ్రహించవలెను. ఈ మంత్రమే మన ముక్తిసమయమున యీ జాతికంతకును నలయుశక్తి సామర్థ్యముల నొసంగగలదు."

హైందవసంఘమందేకజు లనబడు ప్రజలకు ద్విజత్వమిప్పించుటయే గోపాలకృష్ణుని గోష్ఠిసంకల్పము. ఈసంస్కారము శ్రీ గాయత్రీ మంత్రమువల్లనే జరుగవలెను. దీనివల్ల ప్రస్తుతము ద్విజులగు వైశ్య, క్షత్రియ, సాలె, కంసాలి, పల్లె మున్నగువారలకేగాక, శూద్రజాతులలో కూడ జ్ఞానాన్వులగువారి కెల్లరకు వేదోపాసనయు, గాయత్రీమంత్రాధికారమును అబ్బును.

వేలకొలది సంవత్సరములనుండి శూద్రులుగ బరిగణింపబడినవారుగూడ, గురూపదేశమువల్లను, శ్రవణపఠనాదులవల్లను, తామొనర్చిన తపోసాధనలు, అవలంబించిన చిత్తవృత్తులవల్లను, సాంగత్యముచేతను, ఉత్తమాధికారులైనవారు కోటానకోట్లు కలరనుట జగద్విదితము. వీరెల్లరకు ముక్తిమా

సనావిధి యీ అస్పృశ్యతానివారణ. ఈవిధి తురకలకు సర్వమత సహిష్ణుతను బోధించును. మూఢులగు క్రైస్తవులకు క్రైస్తు బోధక సన్మార్గదాగ్రహమున జేయుటకై యీమానవకోటికి యితర హితముంజను గలరని యీమంత్రార్థము. ధనోన్మత్తులకిది తమ నిరుపేద కార్మికులయెడ న్యాయవర్తనమును బోధించును...దీనివల్ల అన్నిమతముల, కులముల సమన్వయము నేర్పడగలదు."

"మన సాంఘికసమస్య గురించి నేను దీర్ఘముగ యోచించితిని. ఊరక నోట్ల సమత్వమువల్లగాని నైతిక సూత్రములవల్లగాని ప్రయోజనము లేదు. ప్రతి మానవుడును 'అణోరణీయాం మహతో మహీయాం' అను మహావాక్యార్థమును గ్రహింపవలెను. ఈ మంత్రమే మన ముక్తిసమయమున యీ జాతికంతకును గలయుశక్తిసామర్థ్యముల నొసంగగలదు."

హైందవసంఘమునందేకజు లనబడు ప్రజలకు ద్విజత్వమిప్పించుటయే గోపాలకృష్ణుని గోష్ఠిసంకల్పము. ఈసంస్కారము శ్రీ గాయత్రీ మంత్రమువల్లనే జరుగవలెను. దీనివల్ల ప్రస్తుతము ద్విజులగు వైశ్య, క్షత్రియ, సాలె, కంసాలి, పల్లె మున్నగు వారలకేగాక, శూద్రజాతులలో కూడ జ్ఞానార్హులగువారి కెల్లరకు వేదోపాసనయు, గాయత్రీమంత్రాధికారమును అబ్బును.

వేలకొలది సంవత్సరములనుండి శూద్రులుగ బరిగణింపబడినవారుగూడ, గురూపదేశమువల్లను, శ్రవణపఠనాదులవల్లను, తామొనర్చిన తపోసాధనలు, అవలంబించిన చిత్తవృత్తులవల్లను, సాంగత్యముచేతను, ఉత్తమాధికారులైనవారు కోటానకోట్లు కలరనుట జగద్విదితము. వారెల్లరకు ముక్తిమా

మిచే, దేశమం దింకను బహువ్యాప్తిగాంచలేకున్నది. దక్షిణాఫ్రికా యందలి భారతీయులందరకు అచ్చటి శ్వేతముఖులతో పాటు సమానకోటింగు హక్కునుమన మెటుల గోరుచున్నామో, యిచ్చటి మనవారలందఱకు ద్విజత్వము బ్రసాదించుటయే యిప్పటి భారతసంఘసంస్కరణమునకు లక్ష్యము.

అట్టి లక్ష్యమును విస్పష్టముగ గ్రహించి, నిర్భయముగ ప్రపంచమునకు జాటినవాడు—మన ఆంధ్రరత్నము.

భారతావనిలో యిటీవల బహు వ్యాప్తిగాంచిన ఆర్య సమాజమునకును, యీగోపాలకృష్ణ మతమునకును భేదమేమి! (1) గోపాలకృష్ణు డద్వైతియయ్యు, సగుణోపాసకులకు విగ్రహా రాధన నంగీకరించుటచే మన ఆలయములను పాడుబెట్టనక్కర లేదు. (2) "శ్రీమద్రమారమణగోవిందోహరిః" యని మనము మన సంఘమునంతను వెన్వెంటనే కళ్ళుమూసుకొని పేక తిరుగ వేసి కలిపినప్పటికిని, మానవప్రకృతి త్రిగుణాత్మకమగుటచే, స్వతస్సిద్ధముగు సత్త్వరజస్తమోమిశ్రగుణములను, వాని కను గుణ్యముగు కర్మలనుబట్టియు, తిరిగి వర్ణవిభజన రాకతప్పదు. (3) ఇంతియగాక అన్యమతములయెడ శ్రీ దయానందునికంటె గోపాలకృష్ణుని సూత్రమే యెక్కుడు సమన్వయ మార్గమును, యీ విశ్వమానవ ప్రపంచమందు సర్వజనాదరణీయమును, మన స్వప్రయత్నములయెడ యెక్కుడు ప్రయోజనకారియునై యున్నది.

స్వామి వివేకానందుని పిమ్మట యీ వద్భారతావనియందే గాక, చతుస్సాగరపర్యంతమ్మగు యీ భూమండలమంతకు నొక నవీన బ్రాహ్మణధర్మమును నిర్భయముగ చాటిన మహానీ

యుచున్న ఆంధ్రరత్నము. వీ రుభయులలో స్వామీ వివేకా నందుడు ముఖ్యముగ అమెరికాలో నద్వైతప్రచారము గావించెను. గోపాలకృష్ణుడు "ఇంటగెలిచిగాని రచ్చగెలువగరా" దను నార్యోక్తి ననుసరించి యిచ్చట శూద్రాదుల సమస్యపై యెక్కుడుగ తన దృష్టిని ప్రసరించెను.

భారతావనియందే కాక, యావదార్యఖండమందును, మన హైందవమతమునకును, సాంప్రదాయములకును, పోటీగానిలచి, మనలనోడించి, కొంతవరకు పీడించుచున్న క్రైస్తవ మహమ్మదీయ, బౌద్ధసిద్ధాంతములతోపాటు మనమును తలయెత్తుకొని, కేవలము మనదేశమందలి ఉత్తర దక్షిణములందే కాక, క్రమముగ నరేబియాలోను, చైనాలోను, బ్రిటన్‌నందును, అమెరికాలోను యీ నవీన బ్రాహ్మణగోష్ఠుల నెలకొల్పుట శ్రీ గోపాలకృష్ణుని ఆశయము. అటులగాక, క్రైస్తవ మిషనరీలు, మౌగల్మాన్ ముల్లాలును మనదేశమందే మతప్రచారము గావించుచున్నచో హైందవధర్మము కేవల కూపస్థమండూకమైనచో నది ఆత్మఘాతుకము కాదా!

## 17. కాంగ్రెసు రాజకీయములు.

గోపాలకృష్ణుడు జైలునుండి విడుదలయైన పిమ్మట యాతని రాజకీయములగూర్చి మనము లోగడ కొంతవరకు జదివితిమి. ఈ అధ్యాయమందు వానిగూర్చి మరికొంత విపులముగ జర్చించుట యవసరము.

ఆనాటి దేశపరిస్థితి టూకీగ యోచించినచో :-

బార్డోలీ తీర్మానానంతరము కాంగ్రెసులో రెండు పార్టీ

లేర్పడెను. ఒక కక్షకు దేశబంధు చిత్తరంజనదాసు నాయకుడు. ఆకక్షకు స్వరాజ్యపార్టీ యని పేరు. గాంధీమహాత్ముడు సూచించిన నిర్మాణకార్యక్రమమువల్ల శతృవు నణచుట దుస్సాధ్యమనియు, బ్రిటిష్‌ప్రభుత్వము సాధించుటకు వారికిచ్చట పెట్టని కోటలవలెనున్న శాసనసభల నాక్రమించుకొని, యిటు ప్రభుత్వ సభలలోను, అటు దేశమందును, యింటా బయటా పోరుసాగించుటయే ముఖ్య కర్తవ్యమని వీరి విశ్వాసము. ఇందుకు మారుగ శ్రీమాన్ సి. రాజగోపాలాచార్యులుగారి నాయకత్వమున యింకొకపార్టీవారు పూర్వపు గాంధీ అసహాయవాదననే శిలాక్షరములుగ నమ్మి, శాసనసభలు దోషపూరితములనియు, వానిలో జేరుట వ్రతిభంగమగుననియు, నిర్మాణ కార్యక్రమమే అప్పటిపరిస్థితులలో కాంగ్రెసువాదులకు శరణ్యమనియు వాదించిరి. ఈ రెండవపార్టీవారిని "నోఛేంజర్సు", అనగా యెట్టిమార్పును గోరని ఛాందసులని పేర్కొనిరి. ఈ రెండుపార్టీలలో మొట్టమొదట మన కథానాయకుడు కొంతవరకు "నోఛేంజర్సు" కనుకూలుడై, క్రమముగ వారి వాదనలోని దుర్బలత్వమును గ్రహించి, తుట్టతుదకు స్వరాజ్యకక్షిలో జేరెను. ఈ సమయమున యాతని రాజకీయ పరిణామమును మనమీ దిగువ వివరములనుబట్టి గ్రహింపగలము.

1922 నవంబరు, డిశెంబరు నెలలలో గోపాలకృష్ణుడాంధ్రదేశమందలి పలుచోట్ల పర్యటనమొనర్చి యిటు తన నూతన బ్రాహ్మణ ధర్మప్రబోధమును, అటు శ్రీ గాంధీమహాత్ముని కారాగారవాసముతో మందగమనమునొందిన కాంగ్రెస్సౌధ్యమమును శక్తికొలది ప్రోత్సహించి, ఖాళీయైన కాంగ్రెసు

బొక్కసములను "నూటపదహార్ల"తో కొంతవరకు నింపి, ఆసంవత్సరాంతమున గయలో దేశబంధు దాసుగారి అధ్యక్షతక్రింద జరిగిన కాంగ్రెసుమహాసభకు సతీసమేతుడై వెడలెను. అప్పటి యాతని రాజకీయ చిత్తవృత్తి యీక్రింది శ్లోకరూపమున మనము గ్రహింపగలము.

నయాచే రిఫారమ్ - నవాస్టీలు ప్రేమం।
నకౌన్సిల్ నతు ప్రీ - వికౌన్సిల్ పదంవా।
స్వరాజ్యార్థిహంతాంఽగ్ల రాజ్యేనియంతు।
ఫరంగీ, ఫిరంగీ - శృగంగీ కరోతు॥

ఈ వైఖరిలో యాతడు సంపూర్ణముగ చిత్తరంజనుని స్వరాజ్యోద్యమమునకు విరుద్ధభావముబూని, గాంధిమహాత్ముని యడుగుజాడలలో నేతృత్వము వహించిన శ్రీమాన్ రాజగోపాలాచారి ప్రభృతులతోజేరి సంపూర్ణముగ "నో ఛేంజి" పక్షమునకే తన బలమునొసంగెను, కాని మరుచటి నెలలో యాతడు కాశీకి బోయి అచ్చటనుండి తిరిగివచ్చుచు రాజమంహేంద్రవరమున ద్వార పత్రికావిలేఖరికొసంగిన యీక్రింది భావములాతని నిజాభిప్రాయములను తెలుపునటుకు సందియము లేదు.

"గయా కాంగ్రెసు సారాంశములు శ్రీ గాంధిమహాత్ముని యెడ నద్వితీయమగు విశ్వాసప్రకటన మాత్రమే అయియున్నవి. సి. ఆర్. దాసుగారి రాజీయత్నము లెంత నిష్ప్రయోజనములో, రాజగోపాలాచారిగారి శాసనోల్లంఘన యత్నములు నంత అనుచితములే. గయా కాంగ్రెసు తీర్మానములందలి శాసనోల్లంఘనాభాగము కేవల లాంఛనప్రాయముగ మాత్రమే అంగీకరింపబడినది. అందు స్పష్టీకరణమేమియు లేదు. శ్రీమాన్ ఆచార్యులవారు ధనము, వాలంటీర్లు కావలెనని కోరిరేకాని,

వీనితో నేమిచేయ నెంచిరో, ఎందుకు కావలెనో, తన నిజోద్దేశ ములు నెఱుకపరచలేదు. ఇందు కాతని సంశయాత్మకారణమా! లేక అదొక లౌక్యమా?...ఈ యాలోచనలకన్నిటికిని ముందు ముందు చాల సావుకాశముండునని యాతడు చెప్పెను. అన్నిటి కిని 'శ్రీ గాంధీ ఉవాచ' మంత్రముమనలను తృప్తిపరచినది. కాని అసలు బురదలో దిగవలసిన మాబోంట్లకు మాత్రమీా విష యమై యింకను సందేహముగనే యున్నది."

ది 10-7-1923 న నాగపురమందు కూడిన అఖిలభారత కాంగ్రెసు కమిటీసమావేశములో ఆంధ్రరత్నము కాంగ్రెసు ప్రధానకార్యదర్శియై కార్యాలయమును విజయవాడకు మార్పిం చెను. ఆంధ్రదేశమున కాంగ్రెసుప్రధానకార్యాలయమువతరించుట గతయేబదియేండ్లలో నదియే మొదటిసారి-అదియే ఆఖరుసారి కూడను. గోపాలకృష్ణుని కార్యదర్శిత్వములో ఢిల్లీలో అవసర కాంగ్రెసు సమావేశమును, కాకినాడలో వార్షిక మహాసభయు జరిగినవి. రెండును దిగ్విజయములే. అందు ముఖ్యముగ దేశ మందు అప్పటికో ప్రబలిన స్వరాజిస్టు — 'నో ఛేంజీ' కలతలు సమసిపోయి కాంగ్రెసువాదులలో తిరిగి సఖ్యత యేర్పరచుటకే ఢిల్లీసభ జరుపబడినది. ఆ సభకు మౌలానా అబ్దుల్ కలామ్ అజాద్‌గా రధ్యక్షులు. ఏదోయొక పథకముతో సఖ్యత యేర్ప డెను. ఆ పథకమునే కాకినాడ కాంగ్రెసు మౌలానా మహమ్మ దల్లీగారి అధ్యక్షతక్రింద ధృవపరచెను. ఇతరవిషయములందును ఆంధ్రరత్న మితరులకు తీసిపోయినవాడు కాడు. మహావైభవ ముతో రాజఠీవి, లాంఛనములతో, కార్యాలయమును, సిబ్బం దిని నడుపుచు, వివిధరాష్ట్రములకు పోవుచు, అందరమెప్పను

బడయుచు, తన విద్యుక్తధర్మము నద్వితీయముగ నడిపించుకొనుచువచ్చెను. ఇంతలో కాకినాడ కాంగ్రెసు రానున్నది. ఆరోజులలో కాంగ్రెసులో నొక ఆచారముండెడిది. కాంగ్రెసు యొక్క ముఖ్యకార్యదర్శులలో నొక్కరను కాంగ్రెసు మహాసభ జరిగిన రాష్ట్రమునుండి యెన్నుకొనవలెనను సంప్రదాయముండెడిది. కాంగ్రెసు ఆంధ్రదేశమందు జరుగనున్నది. గోపాలకృష్ణుడదివరకే కాంగ్రెసు ప్రధానియై యుండెను. ఆతని ఆధ్వర్యము ప్రజానురంజకముగను, ఉత్సాహజనితముగను కాంగ్రెసు ఉద్యమమునకు మిగుల ప్రోత్సాహకరముగను నుండెను. అందు ముఖ్యముగ గాంధీమహాత్ముని నిర్మాణకార్యక్రమముందే యాతడు విశేషశ్రద్ధను బ్రకటించెను. ఆ కార్యక్రమమందలి జాత్యైక్యత, అస్పృశ్యతానివారణ, ముఖ్యభాగములని అంతకు ముందు ఆంధ్రదేశములో చెప్పిన యంశములనే బొంబాయి యందును అహమ్మదాబాదు, ఢిల్లీ, లాహోరు లందును యాతడు ప్రచార మొనర్చి, పేలవము, నిస్సారమనుకొనుచున్న కాంగ్రెసు కార్యక్రమమునకు పటిమయు, గాంభీర్యమును, రసజ్ఞతయు, శక్తిసామర్థ్యముల నొసంగుటకాతడు ప్రయత్నించెను.

"ఈ జాతియంతయు నొక్కటి కావలసినదే. ఇందుకు వలయు మూలసూత్రమును మనమన్వేషింపవలయును. ఇదొక మహాత్కార్యము ... కాంగ్రెసు నిర్మాణకార్యక్రమమందు జాత్యైక్యత, అస్పృశ్యతానివారణ, యీ రెండే ప్రధానవిషయములు... ఈజాతిలో యేకత్వమును సాధించుటకు లోగడ గురునానకు, అక్బర్ బాదుషాలు యత్నించిరి. వారి యత్నములకు

మించిన కార్యమునే మనమిప్పుడు సాధించవలసియున్నది. అంతకు తక్కువవని మనకు వలదు. శ్రీ గాంధీఋషియొక్క ఋణమును జాత్యైక్యతవల్లనే మనము తీర్చుకొనగలుగుదుము. ఇది యెంతకష్టమైననుసరే. అందరును తక్షణమే యోచించి, యెట్టి సంశయమును లేకుండా, మనము కార్యదీక్ష బూనవలెను... హైందవులు, అల్లాను తమ అవతారపరంపరలో జేర్చుకొనవలెను. ఖురానును తమ పురాణములందు జేర్చవలెను. ముసల్మానులను తమ హైందవాద్వైత సంఘమందలి అంతర్భాగముగ భావించవలెను. అటులనే ముసల్మానులును హైందవులు తమ విశ్వమానవ సౌభ్రాతృత్వమునకు నూతన ఔరసులుగ నంగీకరింపవలెను. ఇండియా విపత్తునుద్దేశించి, కాంగ్రెసు మన మహాజ్ఞానాలను, పండితులను పిలచి, "ఓ అయ్యలారా! మనదేశము నీవిపత్తునుండి తప్పించుటకు వలయు సాంఘిక, మత, సమన్వయమును మీరు సిద్ధపరచవలెను... సర్వమానవాద్వైతమే మనదేశమునకిప్పుడు శరణ్యము... ఇప్పుడందఱు నట్టియేకత్వమునే ఆరాధించవలెను. ఇందుకవసరమగు సంస్కారమును మనమిప్పుడు కావించనగు. ఇందుకు కాలము పరిపక్వమైనది. మిగతి పనులన్నియు పట్టిశుష్కప్రియములే" నని 19౩౮ నవంబరులో యాతడు ప్రకటించెను.

"ఈ మహావిప్లవమును కాంగ్రెసు సాధించక తప్పదు. మన సంఘమును బంధించి అణచిపెట్టు బంధనముల నీవిధముగ ఛేదించి ఆత్మకు ముక్తినొసంగినచో తద్వారా మనకు సంక్రమించు స్వాతంత్ర్యశక్తుల వెల్లువగా యెట్టి అహంకార సామ్రాజ్యములైనను కొట్టుకొనిపోక తప్పదు. అప్పుడే తిరిగి యీభూమి

స్వర్గతుల్యము కాగలదు." (1923 డిశెంబరు.)

కాకినాడ కాంగ్రెసుకుబూర్వము గోపాలకృష్ణుని మనో వాంఛయము లిట్టివి. అంతవర కాతడు చీరాల పేరాల నేతృత్వమును, ఆంధ్రదేశమందు పేరుప్రతిష్ఠలను, అంతకుపూర్వ మూరు మాసములలో యావద్భారతదేశమందు కొంతపరిచయమును, అనుభవమును, సంపాదించుకొని, ఢిల్లీ కాకినాడలలో కాంగ్రెసు నందలి అంతఃకలహములు పాతమారినపిమ్మట శ్రీ గాంధీ మహాత్ముని యాజ్ఞానుసారమాతడు సంకల్పించిన జాత్యైక్యతకు కాంగ్రెసు బలముతో, తన సహజ గాంభీర్య శక్త్యుత్సాహములతో, మహమ్మదల్లి వంటిప్రతిభాశాలియధ్యక్షతక్రింద, తిరిగి తాను కాంగ్రెసు కార్యద్రష్టయై, కార్యసాధనకు గడంగవలెనని యాశించెను.

కాని, నాడింకను ఆంధ్రదేశమందు వలయునంత సహాన శక్తి లేదు. ఒక యువకరత్నము చొరుచుకొని ముందుకు పోవుట పెద్దలకు సంకటమైపోయెను. గోపాలకృష్ణుడు కాంగ్రెసు పని మీద దూరస్థుడగు పాంచాళమందున్న సమయమున, 1923 నవంబరులో కాకినాడలో ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసుసభ జరిగెను. అచ్చటనే అఖిల భారత కాంగ్రెసు యెన్నికలును జరిగినవి. ఆ యెన్నికలలో గోపాలకృష్ణుడు తిరిగి భారత కాంగ్రెసుసభ్యుడు కాకుండ మంత్రాంగము జరిగెను. అందుచే డిశెంబరు నెలాఖరున కాకినాడలో జరిగిన కాంగ్రెసు సభనాటికి గోపాలకృష్ణుడఖిలభారత కాంగ్రెసు సంఘ సభ్యుడే కాడు! సభ్యత్వమే లేనివాని కిక కార్యదర్శిత్వ మెక్కడ? పోనీ, ఆతని త్రోసివేసిన మహనీయులు తామైనను సంప్రదాయ సిద్ధముగ తమ రాష్ట్రమునకు రావలసిన పదవిని సంపాదించుకొని, బెజవాడయందలి

కార్యాలయమును సుస్థిరమొనర్చుకొనలేకపోయిరి. అందుచేతనే కాకినాడ కాంగ్రెసు అనంతరము గోపాలకృష్ణుడు పత్రికా విలేఖరులతో యీవిధముగ తన హృదయవేదనను బ్రకటించు కొనెను.

"ఇంకొక గొడ్డుసంవత్సరము మనల నెదుర్కొనుచున్నది......నాబోంట్లకింకను కాంగ్రెసులో స్థానమున్నటుల తోచదు. అనేక సంవత్సరములనుండి ఆచారముగ వచ్చుచున్న కాంగ్రెసు కార్యదర్శిత్వము నాకు రాకుండజేసిన ఆంధ్ర కాంగ్రెసు వాదుల కుతంత్రములను నేను ఖండించుటలేదు...కాని నా అహంకారమును కొంచెము క్షమించినచో, నాబోటివానిని రంగస్థలమునకు లాగుటకు తగినపరిస్థితి దేశమందింకను లేదని తోచును. బహుశః యేదూరస్థదేశమునుండియో, యెవ్వరైన, ఏయుద్యమమునైన, ప్రారంభించువరకు అట్టిస్థితి సంక్రమించదు కాబోలు! ఇంతకును నేనీరాజకీయములందు చేరుటయే పొరబాటేమో! కావున త్వరలోనే అజ్ఞాతవాసము శేయదలచితిని. అచ్చటనే నా కానందము చేకూరును. అందు నా కత్యావశ్యకమగు విశ్రాంతియు మానసికోల్లాసమును, ఎలయుజీవనోపాధియు గలుగ గలవని ఆశించుచున్నాను."

కాకినాడ కాంగ్రెసుకు పిమ్మట 1924-26 లలో గోపాలకృష్ణు డాంధ్ర దేశమందలి పమిడిపాడులో ఆంధ్రదేశ గ్రంధాలయ మహాసభకును, ఆలమూరులో గోదావరిజిల్లా స్వచ్ఛందసేవాదళ సభకును, మాడుగులలో విశాఖపట్టణజిల్లా మహాసభకును అధ్యక్షత వహించెను. 1926 లో గుంటూరుమండల సభకు సన్మానసంఘాధ్యక్షుడయ్యెను. నెల్లూరు, చిన్నపురి, బెజవాడ,

బందరు, రాజోలు, అమలాపురం మున్నగు స్థలములందు సంచార మొనర్చి, కొంతకాలము ఆంధ్రస్వరాజ్యపార్టీయొక్కయు, ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు సంఘము యొక్కయు కార్యదర్శిత్వమును వహించి యథాశక్తి రాజకీయములందు పాల్గొనెను. ఈ కాలమందే 'సాధన' యను నొక ఆంగ్ల వారపత్రికనుకూడ యాతడు ప్రారంభించెను. కాని నదియు నచిరకాలముననే ఆగిపోయెను. ఇంతలో శరీరరుగ్మత అతిశయించి, 1926 జూన్ నాటి కాతడు క్షయగ్రస్థుడని వైద్యులు నిర్ణయించిరి. మరి రెండేండ్లలో ది 10-6-1928 న యాతడు గుంటూరులో దివంగతుడయ్యెను.

## 18. చరమదశ - దైవమార్గము.

గజేంద్రమోక్షమందు కరిమకరు లొండొరులు వేయేండ్లు పోరాడి తుదకు కరిరాజు

"నీవే తప్పనితఃపరంబెరుగ రక్షింపం గదే దీనునిన్
రావే యీశ్వర కావవే వరద."

యని యా భగవానునికి శరణాగతుడైన పిమ్మటనే యాతనికి చక్రి ప్రత్యక్షమయ్యెను. అటులనే మన గోపాలకృష్ణుడును రాజకీయములనుండి విరమించు సమయమందే దైవమార్గము ద్రొక్కనారంభించెనని చెప్పవచ్చును.

ది 3-6-1927 న శ్రీయుత వత్సవాయ జగపతివర్మగారి పేర ఆతడిటుల వ్రాసెను. "ఇచ్చట శ్రీ రామనగరులో రామాలయ ప్రతిష్ఠజేయ నేను సంకల్పించి ఆరు సంవత్సరములైనది. కారణాంతరములచే నేనింతవరకు నది సానుకూలము

చేయులేకపోతిని...ఇందుకు శంకుస్థాపనచేసి రెండు సంవత్సరము లైనది."

"జైలునుండి విడుదలయై వచ్చినప్పుడు అందరు బ్రాహ్మణులు కావలయునను నొక తాత్పర్యము నేను పలుచోట్ల ప్రసంగించి యుండుట తమకు జ్ఞాపకముండి యుండవచ్చును. అది నాకత్యంత సన్నిహితులైన యే యిద్దరు ముగ్గురో తప్ప తదితరులకు విచారణీయుర్వాత గూడ కలిగియున్నట్లు యెవ్వరికిని తోచి యుండలేదు. కాని యది నా యంతరంగమున మాత్ర మతితీవ్రముగ మననమై నన్నువరతము బాధించుచుండెడిది. దానిని యెల్లప్పుడును నామనమునసే యణగద్రొక్కియుంచి కేవల రాజకీయ వ్యవహారములందు నాకుండియున్న ప్రవేశము నుపసంహరించుకొని యీ విషయమై విచారప్రచారాచారముల ప్రవేశపెట్ట యత్నప్రారంభము గావించెదనని తలంచి, వేచియుండి తీరా ఆసమయము సంప్రాప్తించువరకు జాడ్యముగూడ ఆరంభమైనది. ధర్మసేవయం దిదియే ప్రధానలక్ష్యమను నిశ్చయము నాకు గలుగునప్పటి కిట్లు దైవోపహతుడనై జాడ్యాదులచే నేమియు చేయజాలకయున్న సమయమున నాకు దోచినదేమనగా:—ప్రజతో ముచ్చటించి వారికీలక్ష్యము నెరుకపరచు నవకాశము తప్పినప్పుడీ ప్రజను మూర్తీభవించిన శ్రీరామచంద్రమూర్తి సన్నిధి యందా బ్రాహ్మణస్మృతిని సమర్పించి, కృతార్థుడనై, యసువుల త్యజించెదగాక యని తీర్మానించుకొంటిని. వెంటనే జాడ్యమంకరించి యేమియు చేయజాలకపోతిని."

అంతకుబూర్వమే, అనగా 1925 ఫిబ్రవరిలో ఆతడిట్టుల వ్రాసెను. "శ్రీరామనగరులో ది 5-3-25 న రెండాలయము

లకు (శివాలయము, విష్ణ్వాలయము) శంకుస్థాపన జరుప నిశ్చయించబడినది. ♦ ఈ రీతిగ మన విద్యాపీఠగోష్ఠి ప్రారంభమగును. ఈ సంస్థవల్ల మన జాత్యుద్ధరణము కాని, స్వరాజ్యము కాని లభించకపోవచ్చును. ఇవి గాంధీశకమునకుగాని, గాంధీనీతికిగాని సంబంధించినవికావు. ఈభావములంతయు పూర్వమే నామనోగోళమం దంకురించి యింతకాల మీ రామనగరు యిసుకలోనే యిమిడియున్నవి. కాని యిప్పుడీ పనిచేయుటకు నాకు కొంత సావకాశము కలిగినది. ఎన్ని యిక్కట్టులు వచ్చినను, ధనమున్నను లేకపోయినను, యీపనిచేయుటకు నేనిప్పుడు దృఢసంకల్పుడనైతిని. ఆధునికులీ సంకల్పమును మెచ్చకపోవచ్చును. కాని విగ్రహములు మన గ్రామమునకు ప్రథమవాస్తవ్యులు, గోష్ఠికి మొదటిసభ్యులు. నా సంకల్పమిట్టిది. విగ్రహమే మన ఆదర్శరూపము!”

గోపాలకృష్ణుడు వస్తుతః రామభక్తుడు. ఆతని తలిదండ్రులు సీతారాములు. వాలంటీర్లు రామదండులు, ఆదర్శగ్రామము రామనగరు. జాతీయజెండా హనుమద్ధ్వజము. స్వరాజ్యము రామరాజ్యము. “అంతా రామమయమ్” అను సూత్రమాతని యెడ వర్తించినరీతిగ యింకొకరియెడ వర్తించదని చెప్పవచ్చును. ప్రజలు మందబుద్ధులగు నీ కలియుగములో దేవాలయములే ముక్తిదాయకములనియు, మన పూర్వహైందవాభ్యుదయము, ఔన్నత్యము, సంస్కృతి, నాగరికత, గ్రామపాలన, కళ, తుదకు ఐశ్వర్యమును ప్రతి గ్రామమందును యీ ఆలయములచుట్టును

---

♦ యీ ముహూర్తము ది 7-3-25 కు మార్చబడి, ఆరోజువనే శంకుస్థాపన జరిగెను.

అల్లబడియుంటయే గాక, నేడు తిరుపతి విశ్వకళాపరిషత్తు మున్నగు ఉన్నత విద్యాలయములకును యీ దేవాలయములే శరణ్యములగుచున్నవి.

గోపాలకృష్ణుని ఆలయములో సర్వులకు సమత్వమొసంగబడినది. ఇదియే మన భావిజాత్యైక్యతకు రాజబాట యని ఆతని అభిప్రాయము.

జాత్యైక్యత యనగానేమి? అందఱకు సమముగ వోట్ల పంపకమా? అది కేవల పాశ్చాత్యానుకరణము; పైపై మెరుగుల సమత్వము. అందఱకు సమానముగ ఆస్తులు, ధనములను పంచిపెట్టుటయా? నిజమే! మన దేశమందును సాంఘిక, ఆర్థికవిప్లవమవసరమే! కాని తద్వారా మనజాతియందు శాశ్వత సమత్వము, శాంతి, అభ్యున్నతి చేకూరునా? అందఱను 'బి. యే' లను జేయుటయా! ఇందు "బి." యనగా "బ్రహ్మచారి" లేక బ్రహ్మమార్గమున చరించువాడు, లేక "బ్రాహ్మణుల" జేయుటయే మన జాతిలక్ష్యమని లోగడ మనము చదివియుంటిమి. కాని దానిని సాధించు టెట్లు? ఇదే యిప్పటి ముఖ్యసమస్య.

ఈ సమస్యాపరిష్కారమునకు గోపాలకృష్ణుడు సూచించిన సాధకమార్గములు రెండు. (1) జ్ఞానాధికారుల కెల్లరకును వేదమును - గాయత్రిని - సమానముగ నిచ్చుట. (2) భక్తులగు వారి కెల్లరకు దైవము - దేవాలయములను - సమానముగ నిచ్చుట. అనగా వేదము, దైవము, యీ రెండును మానవకోటికి మూలధనములగుటచే యీ రెండింటిలో మనము సమత్వమును సమకూర్చినయెడల సాంఘిక సమత్వమును, ఆర్థిక సమత్వమును,

తుదకు రాజకీయ సమత్వమును సమకూరునని గోపాలకృష్ణుని నమ్మిక.

వేదము - దైవము - యీ రెండును ఆముష్మికసిద్ధికి ముఖ్యమార్గములు. రెండును ఒకటే—'దేవ' 'వేద' శబ్దములలో ఒకటి బొమ్మ, రెండవది బొరుసు—ఒకటి సగుణోపాసనకును, రెండవది నిర్గుణసాధనకును ఉపయుక్తములు.

కావుననే 1925 లో గోపాలకృష్ణు డిట్లుల వ్రాసెను. "నాకును, నేను చేయదలచిన కార్యములకును యీ ఆలయములు మిక్కిలి ముఖ్యమైనవి. అవి విడువగలవికాకపోయినను, కనీసము రూపకమైన యేర్పడవలెను. నా భావి కార్యక్రమమునకీ ఆలయములు ప్రాణము. ఈ నాస్తికయుగమందీ ఆలయముల ప్రయోజనము మనలో చాలమంది యెఱుగరు. కాని వాటి మహిమ ఆ స్వామి యెఱుగకపోడు. మనకు అంతేచాలును... అసహాయోద్యమమునకు పూర్వమునుండియు నేను వీనికై కృషి చేయుచున్నాను. కాని యింతవరకు అవి నా యూహాప్రపంచమునుగాని, రామనగరు దిబ్బలనుగాని, వదలి బయటపడలేదు"

1927 లో—"ఆఖరు విల్లు" అను పేరిట 'ఆంధ్రపత్రిక'లో ఆతడిట్లు వ్రాసెను.

"రామనగరు అను పేరును సార్థకపరచుటకై శ్రీరామాలయము కట్టుబడి అయిన వెంటనే శ్రీ స్వామివారికే యీస్థలము నంతయు సమర్పించి, వారి కృపాకటాక్షముననే...గ్రామమేర్పడ వేడికొని, కృతార్థుడనగుటకు నిశ్చయించుకొన్నాను. నాశరీరస్థితి ప్రస్తుత మవసానము ననుకరించుచున్నది. నేను మరణించులోగా తెప్పిక శ్రీ కోదండరామస్వామివారికీ యావత్తుభూమిని అర్పించి,

అట్లు దస్తావేజువ్రాసి, పిమ్మట ప్రాణములు వదలగలనని యిం దుకు సంబంధించినవారి కందరికి ప్రమాణపూర్తిగ విన్నవించు చున్నాను. ఒకవేళ నా మరణమునకు పూర్వమీపని జరుగక పోయినచో, యిదియే నావిల్లుగ భావించి, ఆంధ్రమహాజనులు దీనిని చెల్లింతురుగాక!"

ఇదియే గోపాలకృష్ణుని విల్లు.

దీనిని చెల్లించు భాగ్యము, భారము - ఆంధ్రమహా జనులది.

## 19. గోపాలకృష్ణుని భావములు.

ఇటీవల నాంధ్రావనిలో నుద్భవించిన మహనీయులలో ఆంధ్రరత్నము మిన్నయని చెప్పవచ్చును.

కర్మరంగమున యాతని చీరాల పేరాల అద్వితీయమైనది. భక్తిమార్గమున యాతని రామదండు నేటికిని మన ప్రజలకు ముక్తిదాయకమైయున్నది. ఇటులనే జ్ఞానరంగమందును యాతని ప్రతిభ చెప్పనెన్నిక గలదైయున్నది.

భావప్రపంచమున గోపాలకృష్ణుడు కవి, వక్త, విమర్శ కుడుగ వెలుగొందెను.

ఆతని కవిత్వములో శ్రీరంగనాథస్తవము నిదివరకే మనము పఠించితిమి. ఇందలి సొగసులలో విశేషమేమనగా రంగనాథుడు "తమిళజన సంభావిత విభు"డని యాతడు వాకుచ్చుట.

ఇందు పరమేశ్వరుడే ప్రజాధ్యక్షుడను భావము కేవలము నవీనముగాకపోయినను, చాలకాలముగ ప్రజలు భగవంతుని మరచిపోవుటయు, ముఖ్యముగ పాశ్చాత్య మోహప్రభావముచే

నేటి మానవాహంకార విజృంభణకు కొంత విరుద్ధముగ గన్పట్టక మానదు.

కాని ఆంధ్రాధ్యక్షుడు భద్రాద్రియందలి రామచంద్రుడనియు, తమిళాధ్యక్షుడు శ్రీరంగనాథుడనియు గోపాలకృష్ణుడు యెలుగెత్తి చాటెడివాడు.

"భారతవర్షాధిపతియైన
బదరికాశ్రమమున నున్న నారాయణుండు"

అని భాగవతమందు పోతనామాత్యుడు చెప్పెను. పూరీలో జగన్నాథుని, కాశీలో విశ్వనాథుని మన పూర్వులు ప్రతిష్ఠించిరి.

గోపాలకృష్ణుని ఉత్తమోత్తమభావములలో యీ భగవద్భక్తి, భగవద్విశ్వాసము అగ్రగణ్యము. ఆతనికి శ్రీరాముడిష్టదైవమగుటచే, తానొనర్చిన సర్వయత్నములతో శ్రీరామనామమును సమ్మిళితముజేసి యాతని దివ్యప్రభను వేనోళ్ల జాటెడివాడు. ఆతని యుపన్యాసములు హరికథలను బోలియుండెడివి. "శ్రీమద్రమారమణగోవిందో హరిః" యాతని నామ మంత్రము. ఆధునిక భారతనాయకులలో యీదివ్యనామము నంతగ బ్రచార మొనర్చినవారు మరెవ్వరును లేరు.

గోపాలకృష్ణుని భగవద్భక్తి మోహరహితమైనది. గాంధీ మహాత్మునికి బార్డోలీలో దుర్నిమిత్తములగుపడినప్పుడు సత్యసాధన యందలి హరిశ్చంద్రునిబోలె నా మహాత్ముడును వ్యవహరించి యుండవలసినదని గోపాలకృష్ణు డనెడివాడు. తన భార్య నొడ్డపై వ్రేటువేయువా సివచ్చినప్పుడు కత్తి దూసుకొనిపోగా, భగవానుడు తన నా ప్రయత్నమునుండి విరమింపజేయు టదియొక హెచ్చరికగ నాతడు భావించలేదు. ఇందుకుమారుగ తా నజా

గ్రస్తగనుంటినేమోనని, జాగ్రత్స్వప్నసుషుప్త్యావస్థలను మూడింటినిదాటి యాతడు సత్యహరిశ్చంద్రుడ నేయని నిర్ధారించుకొనెను. ఇటులనే మానవయత్నములలో రావణుడు సీతాదేవిని మోహించుటకై యతివేషమునవచ్చినరీతిగ ధర్మమార్గమునుండి మనలను మరలించుటకు రాక్షసులెన్నియో రూపములు ధరించి వచ్చినను వాటిభ్రాంతిలో బడకుండుటయే దివ్యమార్గమని ఆంధ్రరత్న ముపదేశించెను.

గోపాలకృష్ణుని ఆస్తిక్యతతో బాటు అన్నదానమునుగూడ యుండెడిది. భూతతృప్తి యాతనికి పంచమహాయజ్ఞములలో నొకటి. కాకినాడ కాంగ్రెసుకు వచ్చిన లక్షలాది యాత్రికులందఱకును "సప్తాహము" జేయించవలెనని యాతడు ప్రయత్నించెను. తనకింట్లో యున్నదో, లేదో, యని విచారించక, యాతని మరణమునకు ముందొక బస్తా బియ్యముతో పేదజనులకు అన్నదానము జరిపించెను. అన్నదానముతో పాటు తోలుబొమ్మలాటయు నుపరి.

భారతచరిత్రలో ప్రస్తుతసమయ మెటుల విప్లవసూచకమైనదో ది 7-3-1925 న రామనగరులో శ్రీరామాలయముల శంకుస్థాపనాసమయమున యాతడుచెప్పిన యీదిగువ పద్యమును బట్టి మనము గ్రహించుకొనగలము.

సీ॥ శ్రీ గిరిజా సతిస్మిత ముఖాంభోరుహ
సారస్యమధుపాన సమయములను।
బ్రహ్మాది ముని ముఖ్య ప్రార్థితదానవ
సంతాన సంహార సమయములను।
వరకుచేలాది భూసుర భక్త సంత్రాణ
సంరంభ సాద్వత్వ సమయములను।

నవయుగోదయవేళ భవ సమంచిత వస్తు
సంతానము సృజించు సమయములను।
తే॥ గీ॥ ప్రళయ తాండవ ముద్దండలీల వెలయు।
రాజ రాజేశ్వరీ మనో రాజ్యమేలు।
సమయముల నాదు బల్కు లజాడ వినుము।
రామనగరీ వరాంగ! శ్రీరామలింగ॥

1926 లో ఆంధ్రరత్నము కొంతకాల మానాధసేవ జేయుచు మంగళగిరిలో నుండెను. అచ్చటనుండి 23-5-26 న రామనగరు కేగుచు శ్రీ నరసింహస్వామి నుద్దేశించి యిటుల జెప్పెను.

ఉ॥ ఎండల కోర్వలేక యిటులింటికివచ్చితి నంతెకాని నీ
యండను వీడలేదు భవదంఘ్రి యుగంబు సదామదీయ హృ
న్మండలి నిల్వనాడ ననుమానము వీడవె నాదుజాడ్యమున్
జెండవె మంగళాద్రి నరసింహ! సుధాలయ! పానకాలయా॥

ఉ॥ ఎండలకోర్వలేక జుమి యింటికివచ్చితి మంగళాద్రికిన్
రెండవసాటి రామనగరీక్షితి యంచును దొల్లి త్రేత కా
లాండపు రామచంద్ర విమలాకృతితో నటువీవకావె మా
కండగనిల్చి ప్రోతువు శుభాద్రి నృసింహాయ! పానకాలయా॥

26-2-26 న గుంటూరులో జరిగిన జిల్లా మహాసభకు ఆహ్వాన సంఘాధ్యక్షత వహించి సభాసదుల కాతడొసంగిన స్వాగతవాక్యము :

సీ॥ శ్రీమదాంధ్రావనీ క్షేమమీమాంస వి
స్తార పూర్తులు గుంటూరివారు।
తిక్కనాది మదాంధ్ర దిగ్గజేంద్ర విహార
సార భూవరులు గుంటూరివారు।
నిఖిలాంధ్ర నేతృత్వ నిరుపమప్రజ్ఞా ప్ర
కారపారగులు గుంటూరి వారు।
వార లిచ్చుచు నున్నారు స్వాగతంబు
ధర్మదీక్షితులగు సభాస్తారతతికి

చేరి నటియింపు వారి హ్రుత్సీమలందు
రామనగరీ నరేంద్ర! శ్రీరామచంద్ర!

**అసహాయోద్యమము విఫలము కాగా నాతడు తన యిష్ట దైవమునకు నివేదించిన పద్యరాజము :**

సీ॥ గాంధి దేవుని రాక కంచు ఢక్కలగాక
కరతాళ శబ్దాల దరువుగోర ।
దేశబంధుని దళ ద్దివసాలతో దీర
రాజ గోపలచారి బూజుపట్టె ।
కొండెంకటప్పన్న ఉండి లేకుండెను
భాయిపటేళ్లు నిర్భాగ్యులైరి ।
అలీలు గోలీల గేళీసవాల్ మాని
ఖాళీగతాలీల పాలబడిరి ।
జమ్నలాలూశెట్టి తుమ్నపీముబట్టి
ఖద్దరు కాన్ సబ్ సర్దుచుండె ।
మొదటి తాకిడికింతటి మోసమయ్యె ।
ఖ్యాతికొక్కడునిల్చె మా మోతిలాలు ।
ముందుగతులెట్టులెనో భామందువీవు ।
రామనగరీ వరేంద్ర! శ్రీరామచంద్ర॥

**ఆంధ్రమహాసభా వ్యవహారముల నుద్దేశించి ఆతడిటుల జెప్పెను.**

సీ॥ బయ్యా నరసమ్మయ్య బ్రహ్మలోకాన్నుండె
న్యాపతి సుబ్బన్న చూపుతగ్గ ।
పానుగంటి విభుండు ప్రథమ ప్రధానియై
ప్రభులచెంతను జేరి యొదిగియుండె ।
మోచర్ల రామన్న గేచరుండై యుండె
కె. వి. కృష్ణారావు కీర్తి మిగిలె ।
పట్టాభి సీతన్న గుట్టుగా కాలంబు
'జన్మభూమి'ని జేరి జరుపుచుండె ।

వీరలందఱు మోహరేట్వేధివారు ।
ఆంధ్రసభ మున్ను నేలి రత్నాదరమున ।
నేడు మన పాలబడియెను నిశ్చయముగ ।
రామనగరీ నరేంద్ర! శ్రీరామచంద్ర॥

1927 జూన్‌లో నాతఁడు శ్రీ వత్సవాయ జగపతివర్మ గారికి వ్రాసిన లేఖనుండి అప్పటి భారత రాజకీయములపై యాతని అభిప్రాయముల నిట్లు గ్రహింపగలము. అందు రామనగరులో తాను సంకల్పించిన ఆలయములగూర్చి యొకపరవిన బిమ్మట గోపాలకృష్ణు డిటుల వ్రాసెను.

"ఆలయముగూర్చిన విషయము క్లుప్తముగ దెల్పితిని. ఇక కాంగ్రెసు పరిస్థితులగూర్చియు, స్వరాజ్యపక్షపు చర్యలను గూర్చియు, నే నేమైన జెప్పుట సాహసమని యెంచుచున్నాను. ఏలయన, నిప్పటికి రెండుసంవత్సరములనుంచి జాడ్యపీడితుడనై, ఏమాత్రమందుల పాల్గొనక, నేనిప్పుడేమైన విమర్శించుట సమంజసమా? నాకందుకు శక్తికూడ అంతగా చాలదు. అయినను తరచు వార్తలు వినుచున్నవాడనగుటచేతను, సంసార తాపత్రయము నతిక్రమింప నింకను శక్తి చాలనివాడనగుటచేతను, మీరంతగ యడిగితిరి కావునను, దెల్పెదను. మన్నింపవలయును.

"కాంగ్రెసు జీవకళారాహిత్యమై, లక్ష్యలక్షణములయందు విజాతీయమార్గములనందియున్నటుల దోచుచున్నది. ఆమహాసభ యీస్థితిజెందుటకు కారణము తాను ప్రప్రథమమున విజాతీయ బీజమున నంకురించియుండుటయేనని తోచుచున్నది. భ్రమరకీటకన్యాయముగ దీనిని నైజభారతరూపమునందింప మహాత్మావతరణము కొంతవరకు బ్రయత్నించెనుగాని తిరిగియది యథాపూర్వకముగనే

తెలుచున్నది. గాంధీమహాత్మునివంటి తపశ్శాలుల నేకులుద్భవిల్లి తమ తపోమహిమచే సాధించినగాని యీ రూపమున మనము స్వారాజ్యము నందుటకల్ల. ఇందుకొక యుదాహరణముమాత్రము దెల్పెదను.

"ప్రతి నాయక శిఖామణియు హృదయగ్రంథులు తెగ యొక ప్రవాహమునబడిన యప్పుడే ఐక్యత కుదురుననుచున్నారే — అట్టి హిందూమహమ్మదీయైక్యతయు, బ్రాహ్మణ బ్రాహ్మణేతరాది సమస్యలును, ధనాఢ్యులయొక్కయు, ధనాఢ్యులచే నడిపింపబడు సంస్థలయొక్కయు వోట్లు, తీర్మానముల వల్ల బరిష్కారము కాగలవా? తపోధనుల అనుగ్రహముచేనైన నగునుగాక! మనజాతియొక్క వ్యావహారిక పారమార్థిక వ్యవస్థలు వేటియందును తపోధన పరిపాలనమింకను యవతరించలేదు. ఏ యీషన్మాత్రమైనను యిట్టి తపోధనమున్నచో, అక్బరు, నానకు, కబీరు మొదలగు దేశబాంధవులీ ప్రయత్నము చేయ సాహసించి తుదకు విఫలులైరి. వర్తమానమున వారికన్న నతి వ్యాప్తిగ గాంధీమహాత్ముడు యావద్భారతభూమికి యేకత్వము నొందజేయ బ్రయత్నించెనుగాని, ఆయనగూడ మూలకందములను కదలించలేక, సమస్యా సిద్ధాంతములను శాసించలేక యూరకుండెను. కావున అస్మదాదులము పరమార్థ యథార్థములను తెలుసుకొని, దైవమును బ్రార్థించుచు, తదనుగ్రహమునకు వేచియుండి, కాలము గడుపుకొనుట యుత్తమము. కాంగ్రెసు విమతి ప్రభువునకొక గయ్యాళి పెండ్లామువలె, అన్యాపదేశముగ సరసమాడుచు, లేక తిట్టుచు, విముఖతజూపుచు, పరి పరి విధముల నిటులనే యుగావసానమువరకు వర్థిల్లుచుండునని

నే నెంచెదను. శక్తి చాలనప్పుడు ఆ ప్రభువు పత్తిడిలేని సమయములం దిష్టమున్నవారు కాంగ్రెసుతో సరస సల్లాపములాడుచుండవచ్చును. అది తపోరూపము వహించనంతవరకు దానివలన మనము తరించుట దుర్లభము.

"స్వరాజ్యపక్షమువారాదియందు తపోరూపము విడనాడలేదు. 'నో ఛేంజర్లు' బ్రహ్మఋషులైతే, వీరు రాజఋషులైరి. కాని తమ గురుపరంపరలో నొకరు దివంగతులై, యొకరు వార్ధక్యాది లౌకిక బాధోపహతులై యిటులనే పలువు రనేకవిధముల నిర్వీర్యులైన కారణమున వీరి లక్ష్యలక్షణములందు దోషములుదయించి బాధించుచున్నవి. వోట్లు, తీర్మానములచే హిందూ మహమ్మదీయ ఐక్యతాది సమస్యలు సాధింపవచ్చునని వీరు నిజముగ నమ్మినచో, తాము కౌన్సిళ్లలో జేరనది మొదలు యీ కౌన్సిళ్ల ప్రయోజనశూన్యతను ముందేగమనించి అందు బ్రవేశించినవా రందరొక్కరాశిగ నేర్పడి, తమకు జయము కలుగని స్థానములలో తమవారిని "నామినేటు" చేసుకొని, కౌన్సిళ్ళ మొత్తములను బూరించి, అన్నికౌన్సిళ్లవారు నేకమై, 'ప్రజలారా! మేము మీచేతను ప్రభుత్వమువారి యెన్నికసంఘములచేతను యెన్నుకోబడిన' వారమై, మనవని చెప్పబడుచున్న ప్రభుత్వ కౌన్సిళ్లలో యేమియు ప్రజోపయోగములు చేయనివ్వబడక, విడిగా నొక స్వతంత్ర భారతసభను వారిలెఖ్ఖనే యేర్పరచి, ఖాళీస్థానములను దేశసేవకులచేపూరించి, సత్వర స్వరాజ్య సంపాదనకై కార్యరంగమున దిగనున్నాము. ఓట్లిచ్చిన మీరు మీపన్నులనుగూడ మా కేయిచ్చి, ఇదియే యథార్థమగు భారత పాలక సభగా భావించి, మా శాసనముల ప్రకారము ప్రతి

పక్షులనుంచి స్వారాజ్యము సాధింపవలసియున్నది. ఇందుకు దౌర్జన్యరహిత సహాయ నిరాకరణము, సత్యాగ్రహము మొదలగునవి ఆయుధములగుచున్నవి' అని చాటించి, కార్యరంగమునకు దుముకవలసియుండెను.

"నా మనోవాంఛయమన నిటువంటిది. ఇది వదలిపెట్టి, "నీవే ముందు వందెము వేయు" మని ప్రతిపక్షులను గోరుచు, వారితో పూలచెండాడుచు, వారు ముందుమాటే కాక వందెము గూడ చేయురని తెలిసియు వారినే పట్టుకొని వ్రేలాడి, వారిమంత్రులలో మంతాంగము జేయుచు, ఛందస్సును(కాన్స్టిట్యూషన్)బరిష్కరింప, సృష్టింప, రాజకీయ తర్కమునంతయు రాత్రింబవళ్ళు రాద్ధాంతముచేయుచున్న మన సోదరుల నేమందును? రంగస్థలములలో నున్నవారిని నేపథ్యాదులయందున్నవాడేమి చేయగలడు? చాటునుండిమాత్రము చూచి మొగము చిట్లించగలడు. నేను చేయునదియు నంతే.

"ఇక నొక్కమాట. మహాత్ములు శెలవిచ్చు నిరంతర ఖద్దరుకర్మానుష్ఠానమును నాదురదృష్టమే మొకాని నన్నంగీకరింపజేయజాలదయ్యెను. నేనుయథాశక్తి శ్రీరాముని సేవజేయువాడను. రామభక్తుడను అందుచే ఆపురుషోత్తముని చేతలు నాకెప్పుడును దార్శాణములుగదోచుచుండును. సీతాన్వేషియ హనుమంతుడు ఆ దేవి ప్రతిపత్ కలగన్న చిక్కియుంట నెఱింగి, ఆమె వహించిన నిరశనవ్రతము దెలుసుకొని ఆమెకు భోజన సదుపాయము

శేవిము చేయ యత్నించలేదు. శ్రీరాములుసహిత మందుగూర్చి సందేశమెద్దియు బంపలేదు. యుద్ధసమయమందును అట్టి ప్రయత్నమేమియు జేయలేదు. భారతభూదేవత శుష్కించియున్నదని మనము ఖద్దరుద్వారా అన్నముపెట్ట బ్రయత్నింపనేల? ఆమెకు నిజ సంసారమబ్బినప్పుడామె కళలును సంపూర్ణముగనుండును. ఆమె నిరసనవ్రతము వహించెనేమో? ఇప్పటిక్షామములు, త్రాగుట కుదరకముగూడ లేకుండుట. సస్యక్షీరములు సన్నగిల్లుట, జాడ్యప్రాబల్యాదులన్నియు యీ నిరసనవ్రతసూచకములుకావా? చేసినకృషికి తగినఫలము గాంచుట వెనుకటికంటె యిప్పుడెన్ని మడుంగులు మన దేశమున తగ్గియుండెనో యెల్లరెఱింగిన విషయమే. దొంగతనమువారా ఫలమును వెనుకకు నెట్టిరా? వారి నాక్షేపించి ప్రయోజనములేదు. ఆమె నిజసంసారమును యథాపూర్వముగ నొనర్చుటయే మన కర్తవ్యము. ఖద్దరుతప్ప వేరుమార్గములేదని శాసించుట ప్రయోజనము కాదని నా యభిప్రాయము.”

## 20. తనను గూర్చి.

గోపాలకృష్ణుడు తనగూర్చి వ్రాసుకొన్న యొక పద్యముతో యీ ప్రసంగమును ముగించుట యుక్తము.

సీ॥ వేదాంతములతోడ వెక్కిలింతలతోడ
లెక్చర్ల సాగించులీల నెవడు।

లక్ష్యమొక్కటిలేక యక్షగానములతో
కాలంబు వృథబుచ్చు ఘనుడెవండు ।
చీరాల పేరాల చిన్ని గ్రామంబుల
దోసమెన్నక కీర్తి పంపదీసె నెవడు ।
ఆంధ్రరత్నంబంచు నహిమికతో పెద్ద
పిన్నలంచును మదినెన్న డెవడు ।
అట్టి గోపాలకృష్ణుని హాస్యసరళి ।
గోలకృష్ణునిగా జేసి కోఱతదీర్చె ।
గాక పగ్గములుండునే "గాడ్డు"కైన ।
రామనగరీ నరేంద్ర! శ్రీరామచంద్ర॥

శ్లో॥ స్వస్తిప్రజాభ్యః పరిపాలయంతాం, న్యాయ్యేనమార్గేణ మహీమ్ మహీశాః । గోబ్రాహ్మణేభ్యశ్శుభమస్తు నిత్యం, లోకా స్సమస్తా స్సుఖినోభవంతు॥

---

యమ్. యస్. ఆర్. ప్రెస్, విశాఖపట్టణము.